# గ్రామ సచివాలయ నిర్వహణ

## మార్గదర్శిని - 2

## (రెవెన్యూ పరిపాలన)

## విషయసూచిక


| క్రమ సంఖ్య | విషయము | పేజి నెం |
|---|---|---|
| 1. | పంచాయితీ కార్యదర్శులు గుర్తుంచుకోవలసిన ముఖ్యాంశములు | 1 - 3 |
| 2. | ప్రభుత్వ భూములు మంజూరు చేయు విధానము | 4 - 10 |
| 3. | ఆంధ్ర ప్రదేశ్ ఎసైన్డు భూములు బదలాయింపు (నిషేధ) చట్టం 1977 | 11 - 12 |
| 4. | ఆంధ్రప్రదేశ్ భూ ఆక్రమణ చట్టం 1905 | 13 - 15 |
| 5. | ఆంధ్రప్రదేశ్ భూ కబ్జా (నిషేధ) చట్టము 1982 | 16 - 17 |
| 6. | ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు ప్రాంతాల భూమి బదిలీని నిబంధనలు 1959 | 18 - 19 |
| 7. | ఎ.పి.ఆక్యుపెంట్స్ ఆఫ్ హోమ్ స్టెడ్సు - కన్ఫర్మెంట్ ఆఫ్ ఒనర్‌షిప్ చట్టం 1976 | 20 - 21 |
| 8. | ఆంధ్రప్రదేశ్ ఎచ్చీట్స్ మరియు బౌనా వేకెంటియా చట్టం 1974 | 22 - 23 |
| 9. | ఆంధ్రప్రదేశ్ రైట్సు ఇన్ లాండ్ మరియు పట్టాదార్ పాస్ బుక్సు చట్టం 1971 | 24 - 27 |
| 10. | ఆంధ్రప్రదేశ్ భూ సంస్కరణలు (వ్యవసాయ కమతాలపై గరిష్ట పరిమితి) చట్టం 1973 | 28 - 31 |
| 11. | ఆంధ్రప్రదేశ్ (ఆంధ్రప్రాంతం) కౌలుదారిచట్టము 1956 | 32 - 34 |
| 12. | ఆంధ్రప్రదేశ్ (తెలంగాణ ప్రాంతము) కౌల్దారీ మరియు వ్యవసాయ భూముల చట్టము 1950 | 35 - 36 |
| 13. | ఆంధ్రప్రదేశ్ (ఆంధ్రా ఏరియా) ఇనాముల (రద్దు మరియు రైత్వారీగా మార్పు) చట్టం 1956. | 37 - 38 |
| 14. | ఆంధ్రప్రదేశ్ (తెలంగాణ ప్రాంతము) ఇనాం భూముల రద్దు చట్టము, 1955 | 39 - 40 |
| 15. | ఆంధ్రప్రదేశ్ నీటి పన్ను చట్టం 1988 | 41 - 43 |
| 16. | ఎ.పి.రెవెన్యూ రికవరీ చట్టం 1864 | 44 - 47 |
| 17. | జమాబందీ నిర్వహణ (బి.ఎస్.ఓ.12) | 48 - 50 |
| 18. | ప్రభుత్వ భూములు - పంట భూములు | 51 - 52 |
| 19. | వ్యవసాయ గణాంకాలు | 53 - 54 |
| 20. | ప్రకృతి వైపరీత్యాలలో, పంచాయితీ సెక్రటరీ చేపట్టవలసిన చర్యలు | 55 - 62 |

| | | |
|---|---|---|
| 21. | ఆంధ్రప్రదేశ్ (షెడ్యూల్డు కులముల, షెడ్యూల్డు తెగల మరియు (వెనుకబడిన తరగతుల) కుల ధృవీకరణ పత్రముజారి విధాన చట్టం 1993 (చట్టం 16/1993) | 63 - 65 |
| 22. | ఆదాయ సర్టిఫికెట్ | 66 - 67 |
| 23. | నివాస ధృవీకరణ సర్టిఫికెట్ | 68 - 69 |
| 24. | జనన మరణ సర్టిఫికెట్ | 70 - 72 |
| 25. | షెడ్యూల్డు జాతులు, తెగలపై అత్యాచార నిరోధక చట్టము - 1989 | 73 |
| 26. | వెట్టిచాకిరి నిర్మూలన చట్టం | 74 |
| 27. | ఆంధ్రప్రదేశ్ ఋణ విముక్తి చట్టం 1977 | 74 |
| 28. | కనీస వేతనాల చెల్లింపుకు సంబంధించిన చట్టం | 75 |
| 29. | రైలు కట్టలు | 75 |
| 30. | ది ఇండియన్ ట్రెజర్ - ట్రోవ్ చట్టం 1878 (కేంద్ర చట్టం) నిధి నిక్షేపాలు | 76 - 77 |
| 31. | ఆంధ్ర ప్రదేశ్ ప్రజారోగ్య చట్టం - 1939 | 78 - 79 |
| 32. | వినియోగ దారుల రక్షణ చట్టము - 1986 | 79 - 82 |
| 33. | శాంతి భద్రతలు | 83 |
| 34. | యఫ్.ఐ.ఆర్ (సెక్షన్ 154 సి.ఆర్.పి.సి) | 84 |
| 35. | అరెస్టు - బెయిలు - హక్కులు | 85 |
| 36. | మానవ హక్కుల పరిరక్షణ చట్టము 1993 | 86 |
| 37. | మనోవర్తి | 87 - 88 |
| 38. | లోక్ అదాలత్ (ప్రజా న్యాయపీఠము) (చాప్టరు ।జ సెక్షన్లు 19 నుండి 22 వరకు) | 89 |
| 39. | ఉచిత న్యాయ సహాయము ,న్యాయ విజ్ఞాన వేదికలు | 90 - 92 |
| 40. | ఫ్యామిలీ కోర్టులు కుటుంబ న్యాయస్థానాల చట్టం 1984 (Act No.8.) | 93 |

## 1. పంచాయితీ కార్యదర్శులు గుర్తుంచుకోవలసిన ముఖ్యాంశములు

గ్రామ పంచాయితీ కార్యదర్శులు రెవెన్యూ విధులు నిర్వర్తించేందుకు యీదిగువ అంశములపై అవగాహన కలిగి ఉండాలి.

I. **కాలములు - సీజనులు**

II. **భూముల వర్గీకరణ**

III. **భూములతో సంబంధం ఉండేవ్యక్తులు**

**I కాలములు - సీజనులు:-**

| | |
|---|---|
| 1) ఫసలీ సంవత్సరము:- | జూలై 1వ తేదీతో ప్రారంభమైన 12 నెలల కాలమునకు 'ఫసలీ' అంటారు. (అనగా జూలై 1వ తేదీ నుండి మరుసటి సంవత్సరం జూన్ 30 తేదీ వరకు) |
| 2) ఆర్థిక సంవత్సరము:- | ఏప్రియల్ 1వ తేదీ నుండి మరుసటి సంవత్సరం మార్చి 31వ తేదీ వరకు గల కాలము. |
| 3) ఖరీఫ్ సీజను (సార్వా):- | జూన్ 1వ తేదీ నుండి సెప్టెంబరు 30 వరకు. |
| 4) రబీసీజను (దాళ్వా):- | అక్టోబరు 1 నుండి - మార్చి 31 వరకు. ఏప్రిల్, మే నెలలో విత్తినచో జూన్ మాసాంతములోగా కోయబడినచో రబీ పంటగా నమోదు చేయాలి. జూన్ మాసాంతమునకు కోయబడినిచో రాబోయే ఫసలీ ఖరీఫ్ పంటగా నమోదు చేయాలి. |
| 5)కిస్తీ సీజనులు:- | అ) ఖరీఫ్ పంటకు:- డిశంబరు 1 తేదీ నుండి జనవరి 31వ తేదీ వరకు (రెండు మాసములు)<br>ఆ) ఏప్రిల్ 1 నుండి మే 31 తేదీ వరకు (రెండు మాసములు) |
| 6)ఖరీఫ్ పంటల నమోదు అక్రమణల సర్వేరాళ్ల తణిఖీ నమోదు | జూలై 1వ తేదీ నుండి ప్రారంభించాలి (అడంగలు/పహాణీలో నమోదు |
| 7)రబీపంటల నమోదు ఆక్రమణల నమోదు పోరంబోకులలో /గయాళు భూములలో చెట్లతణిఖీ | అక్టోబరు 1వ తేదీ నుండి ప్రారంభించాలి.(అడంగలు/పహాణీలో నమోదు) చెట్ల వివరాలు/ప్రభుత్వ భూముల వినియోగం నెం॥రు లెక్కలో నమోదు చేయాలి. |
| 8)డిమాండ్ లెక్కలు4ఎ, 4బి, 4సి, ఆ 4 లెక్కలు | 1)ఖరీఫ్ పంటకు:- నవంబరు నెలాఖరునకు శిద్ధపరచాలి.<br>2)రబీపంటకు:- ఏప్రిల్ నెలాఖరునకు శిద్ధపరచాలి. |
| 9) అజమాయిషీ చేయవలసిన అనుకూల సమయము | ప్రతి నెల 20వ తేదీ నుండి 25 తేదీ వరకు |

## II భూముల వర్గీకరణ:-

| | |
|---|---|
| 1)మాగాణీ భూమి నంజ,: తరి, పల్లం, మెరక (wet) | ప్రభుత్వ నీటివనరుల నుండి నీటి సౌకర్యంపొందే రైత్వారీ సాగుభూమి |
| 2)మెట్ట భూమి పుంజ,ఖుష్కి, మెరక: (Dry) | ప్రభుత్వ నీటి సౌకర్యం లేనట్టి రైత్వారీ సాగు భూమి |
| 3)పోరంబోకు(Poramboke): | ప్రభుత్వము భూమి ప్రజోపయోగముకై కేటాయించబడిన భూమి (రోడ్లు, చెరువులు, స్మశానం, కాలువలు, బండిబాట, కాలిబాట, మురుగు కాలువలు వగైరా) |
| 4)బంజరు భూమి(Waste Land): | ప్రజోప యోగముకై కేటాయించబడిని ప్రభుత్వ అధీనములోగల శిస్తు కట్టిన/శిస్తు కట్టని గయాళు భూమి. |
| 5)మిగులు భూమి (Surplus Land): | భూగరిష్ట పరిమితి చట్ట ప్రకారం గరిష్ట పరిమితికి మించియున్న భూకామందు నుండి ప్రభుత్వము స్వాధీనపరచుకొన్న భూమి. |
| 6)ఇస్తిఫాభూమి(Relinquished Land): | పట్టాదారు తనకు గల భూమిని స్వచ్ఛందముగా ప్రభుత్వ పరంచేసి నట్టి భూమి. |
| 7)తిరిగి ప్రభుత్వపరం చేసుకున్న సదరు భూమి (Resumed Land): | పట్టాపై యిచ్చిన భూమి విషయంలో లబ్దిదారు పట్టా షరతులను ఉల్లంఘించినచో తిరిగి ప్రభుత్వపరం చేసుకున్న భూమి. |
| 8)సేకరణ భూమి(Aquired Land): | ప్రజా ప్రయోజనార్థం రైత్వారీ (జిరాయితీ) భూమిని ప్రభుత్వము భూసేకరణ చట్టం ప్రకారం సేకరించిన భూమి. |
| 9)కేటాయించిన ప్రభుత్వ భూమి(Assignment of Government Land for cultivation/House site): | సాగు నిమిత్తం డి ఫారం పట్టాపై గాని, నివేశ గృహ నిర్మాణం నిమిత్తం పట్టాపై షరతులకు లోబడి అనుభవించుటకు యిచ్చే ప్రభుత్వ భూమి. |
| 10)భూమి బదలాయింపు (Transfer of Land): | ప్రభుత్వ ఆధీనములోగల భూమిని ప్రజోపయోగం నిమిత్తం మరియొక ప్రభుత్వ శాఖకు (రాష్ట్ర/కేంద్ర ప్రభుత్వ శాఖలు) బదిలీ చేయబడిన భూమి. |
| 11)భూమి అన్యాక్రాంతము (Alienation of Land): | ప్రభుత్వ ఆధీనంలోగల భూమిని స్థానిక సంస్థలకు, ఫ్యాక్టరీలకు, కంపెనీలకు, రిజిష్టర్డు సొసైటీలకు అన్యాక్రాంత నిబంధనలకు లోబడి అనుభవించుటకు అన్యాక్రాంతము చేయబడిన భూమి. |
| 12)కౌలుభూమి (Lease Land): | షరతులకులోబడి సాగుకు/ నివశించుటకు నిర్ణీత కాలమునకు కేటాయించు భూమి. |
| 13)ఆక్రమణ భూమి (Eneroached Land): | అనుమతి లేకుండ ఆక్రమించబడిన ప్రభుత్వ భూమి. |

| | |
|---|---|
| 14)వ్యవసాయేతర భూమి (Non-Agrl.Land): | వ్యవసాయేతర పనులు అనగా, పరిశ్రమలు, వాణిజ్యము లేదా నివాసము కొరకు ఉపయోగించే భూములు. |
| 15)గ్రామకంఠం (Village site): | నివేశ్న స్థలములుగా ఉపయోగించు ప్రదేశము (నివాస ప్రదేశము) |
| 16)బేవార్సు ఆస్థి (Escheated Property): | వారసులు లేకుండ చనిపోయిన వ్యక్తి యొక్క ఆస్థి ప్రభుత్వమునకుచెందే ఆస్థి (స్థిర చరాస్తులు) |
| 17)ప్రభుత్వం కొనుగోలు చేసిన భూమి (Bought in - Land): | పన్ను బకాయిలు రాబట్టుటకు రెవెన్యూ రికవరీ చట్ట ప్రకారం బకాయి దారు భూమిని వేలం వేయు సమయములో పాటదార్లు లేనట్లయితే,ప్రభుత్వం తరపున పాట ఖాయమైనపుడు ఆ భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసిన భూమిగా పరిగణిస్తారు. |

**III భూములతో సంబంధం ఉండే వ్యక్తులు**

| | |
|---|---|
| 1)పట్టాదారులు | ఎ)సెటిల్మెంటు చేసినపుడు భూమిపై హక్కులు కలుగజేస్తూ రైత్వారీ పట్ట పొందిన వ్యక్తులు/అతని వారసులు/ చట్ట బద్దముగా బదిలీ పొందిన వ్యక్తులు.<br>బి)ప్రభుత్వ భూమిని సాగు నిమిత్తం కేటాయింపు పొందుతూ డి.ఫారం పట్టాపొందిన వ్యక్తి/ అతని వారసులు. |
| 2)కౌలు లీజుదారులు | ఎ)ప్రభుత్వ అనుమతి పొంది నిర్ణీత కాలమునకు ప్రభుత్వ భూమిని అనుభవించు వ్యక్తులు.<br>బి)పట్టాదారు అనుమతితో నిర్ణీత కాలమునకు రైత్వారీ భూమిని అనుభవించు వ్యక్తులు. |
| 3)ఆక్రమణదారులు | ప్రభుత్వ అనుమతి లేకుండ అక్రమముగా ప్రభుత్వ భూమిలో ప్రవేశించి అనుభవించు వ్యక్తులు |
| 4)సివాయిజమాదారులు | పట్టాకొరకై దరఖాస్తుచేసుకొన్న ఆక్రమణదారు దరఖాస్తు తేదీకి ముందు ఒక సంవత్సరం కాలం పైబడి ఆక్షేపణ లేని ఆక్రమణగా పరిగణించబడే ప్రభుత్వ భూమిని అనుభవించుచున్న వ్యక్తులు |
| 5)లబ్దిదారులు | ప్రభుత్వము నుండి ప్రయోజనము పొందే వ్యక్తులు (భూమి/ఋణము/ఆర్థిక సహాయము/నివేశన స్థలము/వృత్తిపరికరములు వగైరా) |
| 6)నీటి వినియోగ దారులు | ప్రభుత్వ జలవనరులనుండి సాగుకు నీటిని వినియోగించుకొను వ్యవసాయదార్లు. |
| 7)చెట్టు పట్టాదారులు | ప్రభుత్వ భూమిలో ఫలసాయము నిచ్చే చెట్లు పెంచుకొని, ఫలసాయమును అనుభవించుటకు అనుమతి పొందిన వ్యక్తులు. |
| 8)భూకబ్జాదారులు | ప్రభుత్వ, ప్రభుత్వేతర భూములపై ఎట్టి హక్కులు లేకుండ భూ యజమాని అనుమతి లేకుండ, దురుద్దేశము/దౌర్జన్యముగా భూమిని ఆక్రమించుకొని, సాగుచేయుట, లేదా లీజుకు యివ్వడం, గృహనిర్మాణముచేసి, నివశించుట లేదా అద్దేకివ్వడం వంటి నేరాలకు పాల్పడే వ్యక్తులు |

# ౨. ప్రభుత్వ భూములు మంజూరు చేయు విధానము

(Assignment of Government Lands)

**1. మంజూరు విధానమును గురించి ప్రభుత్వముచేసిన ఉత్తర్వులు మరియు చట్టములు.**

(ఎ) ఆంధ్రప్రదేశ్ ఆంధ్రా ఏరియాలో ప్రభుత్వ భూములు కేటాయించుటకు ఎట్టి చట్టముచేయబడలేదు. పరిపాలనా ఉత్తర్వుల ప్రకారము మాత్రమే అనగా బి.ఎస్.ఓ 15 (మరియు బి.ఎస్.ఓ.21) ప్రకారము ప్రభుత్వ భూములు సాగుకు (లేదా నివేశ్న స్థళములుగా కేటాయించడం జరుగుతోంది. కేటాయింపుకు సంబంధించిన నిబంధలు ఏకీకృతంచేసి జి.ఓ. నెం.1407 రెవెన్యూ తే 25.07.1958 ఉత్తర్వులు జారీ చేయబడ్డాయి. దర్మిలా అనేక ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి.

(బి)తెలంగాణా ఏరియాలో ప్రభుత్వ భూముల కేటాయింపుకు చట్ట బద్ధతకల్పింపబడి, ఆంధ్రప్రదేశ్ (తెలంగాణా ఏరియా) ల్యాండు రెవెన్యూ చట్టం 1317 ధసలీ లోని సెక్షన్ 53ఎ, 54, 54ఎ, మరియు 58 - బి. (చాప్టర్ 5) మరియు జి.ఓ.నెం.1406 రెవెన్యూ తే25.7.1958 ప్రకారం కేటాయింపు విధానం చేపట్టబడుచున్నది.

**2. ప్రభుత్వభూములు వర్గీకరణ:**

(I)సాధారణముగా సాగుకు మంజూరు చేయుటకు లభ్యమయ్యే భూములు:

(ఎ)రిజర్వు చేయని తరంకట్టిన (శిస్తు నిర్ణయించిన) బంజరు భూములు.

(బి)రిజర్వుకాని తరంకట్టని (శిస్తు నిర్ణయించని) బంజరు భూములు.

(II)సాధారణముగా మంజూరు చేయుటకు అవకాశం వుండని భూములు

(ఎ)పోరంబోకు భూములు.

(బి)రిజర్వు చేయబడిన (తరంకట్టిన।తరం కట్టని) బంజరు భూములు.

(III)రిజర్వు భూములు:

ప్రత్యేక ప్రజా ప్రయోజనం కోసం ప్రస్తుతముగాని, భవిష్యత్తులోగాని, అవసరము అవుతుందని భావించి అందుకోసము కేటాయించబడిన భూమిని రిజర్వు భూమి అని అంటారు. అట్టి భూములను ప్రోహిబిటివు ఆర్డరు (నిషేధ ఉత్తర్వుల) రిజిష్టరులో నమోదు చేయాలి. ఉదాహరణకు:- (1) రిజర్వు భూములు పట్టాపై మంజూరు చేయకూడని భూములు- పోరంబోకులు, చెరువు గర్భములు, మందబయలు, మేత బీళ్లు, స్మశానములు సాగునీటి (మురుగునీటి పొరంబోకులు, రిజర్వు ఫారెష్టుకు ఆనుకొని ఉన్న భూములు, విలువైన వృక్ష సంపదగల భూములు, కంటోన్మెంటు, పోర్టు, రైల్వే, విమానములు దిగు భూములు గనులు, నదీ తీర ప్రాంతము, సముద్ర తీరము (H.T.L) నుండి 500 మీటర్లలోపుగల ప్రభుత్వ భూములు పట్టాలపై మంజూరు చేయరాదు.

(2)పట్టణములలోను, మున్సిపాలిటీలలోను, జిల్లా కేంద్రములలోను, చుట్టూ 1 మైలు దూరం వరకు గల ప్రభుత్వ భూములు మంజూరు చేయరాదు.

3.ప్రభుత్వ భూముల మంజూరు చేయుటకు కావలసిన అర్హతలు

(ఎ) అసలు భూమి లేని పేదవారు.

(బి) భూమి లేని పేదవారు 2.50 ఎకరాలు పల్లం (తర) గాని లేదా 5.00 ఎకరాల మెట్ట (ఖుష్కి) భూమిగాని, అతనికున్న సొంత భూమి కలిపి మించకుండా ఉన్న వారు ఒక ఎకరా పల్లాన్ని రెండు ఎకరములు మెట్టగా లెక్కించాలి. నీటి పారుదల గల మెట్ట భూమిని కూడా పల్లంగానే భావించాలి.

(సి) రాజకీయభాధితులు.

(డి) మాజి సైనికులు

4. శివాయి జమీదారు: మంజూరు ఫసలికి (అనగా వ్యవసాయక సంవత్సరానికి) ముందునుండి స్థిరమైన ఆక్రమణ కలిగి వుండాలి.

5. ఒక వ్యక్తికి ఎంత భూమిని మంజూరు చేయవచ్చు: ఒక వ్యక్తికి 2.50 ఎకరాల పల్లం లేదా 5.00 ఎకరాల మెట్ట భూమికి మించి మంజూరు చేయకూడదు ఆవ్యక్తికి అదివరకే ఉన్న భూములను లెక్కలోనికి తీసుకొని మంజూరు చేయుచున్న భూమితో కలిపి ఆతనికి 2.50 ఎకరాలు పల్లం, 5 ఎకరాల మెట్ట మించకూడదు అవసరమైన సందర్భంలో 10% తేడా ఉండవచ్చు. మాజీ సైనికులకు కూడ ఇదే వర్తిస్తుంది.

షెడ్యూలు ప్రాంతాలలో ఒక గిరిజనుడికి 5 ఎకరాల పల్లం 10 ఎకరాల మెట్ట వరకు మంజూరు చేయవచ్చు.

రాజకీయ బాధితులకు య 5.00 పల్లం భూమిగాని 10.00 ఎకరముల మెట్ట భూమిగాని పట్టాపై మంజూరు చేయవచ్చును.

6. మంజూరు చేయుటకు పాటించాల్సిన విధానం:

1.తరం కట్టిన గయాళు (బంజరు) భూములు:- దరఖాస్తు దారు అర్హుడైనచో, గయాళు భూమి ప్రభుత్వమునకుగాని, స్థానిక సంస్థలకుగాని, ప్రజోప యోగము నకు గాని అవసరం లేదని నిర్ధారణ చేసినచో, గ్రామంలో దరఖాస్తుదారు వివరములతో, దరఖాస్తు చేసిన భూమి వివరములతో, ఎవరికైన ఆక్షేపణలున్నచో 15 రోజులలోగా తెలియజేయ కోరుచూ ఎ - 1 నోటీసు ప్రచురించి నోటీసు యొక్క ప్రతిని గ్రామ పంచాయితీ కి అందజేసి, గ్రామ పంచాయితీకి అందినట్లు, ఎ - 1 నోటీసుపై సంతకం పొందవలెను. నోటీసు ప్రచురించిన 15 రోజులలోగా ఆక్షేపణలు వచ్చినచో వాటిని పరిశీలించి, మండల రెవెన్యూ అధికారికి పంపవలెను. ఆక్షేపణలు రాకపోయినట్లయితే, వచ్చిన ఆక్షేపణలు అసమంజసమని భావించినచో, దరఖాస్తుదారు వివరములు, కోరిన భూమి వివరములు ఎ మెమోరాండంలో పూరించి, భూమిలో గల కట్టడములు, చెట్లు వివరములు, వాటి విలువలు

తెలియజేస్తూ నివేదికతోబాటు దరఖాస్తు, ఎ మెమోరాండం, ప్రచురించిన ఎ - 1 నోటీసు, భూమి యొక్క స్కెచ్చి, ఎ రిజిష్టరు నకలు, అడంగలునకలు (మూడు ప్రతుల చొ॥న) జత పర్చి మండల రెవెన్యూ అధికారి వార్కి ప్రతిపాదనలు పంపాలి. కోరిన భూమి సర్వే నెంబరు లేదా సబ్ డివిజను లో భాగమైనచో సబ్ డివిజను రికార్డు (3 ప్రతులు) జతపర్చాలి.

శిస్తు కట్టని గయాళు (బంజరు) లేదా నిరుపయోగమైన పోరంబోకు:-

దరఖాస్తు దారుడు అర్హుడైనచో, పై తరగతి భూములు ప్రభుత్వమునకుగాని, స్థానిక సంస్థలకుగాని, ప్రజోపయోగమునకు గాని భవిష్యత్తులో కూడ అవుసరం లేదని నిర్ధారణచేసినచో, పట్టాపై కోరిన దరఖాస్తు దారు వివరములు, భూమి యొక్క వివరములు పొందు పరుస్తూ ప్రజలకు గాని, స్థానిక గ్రామ పంచాయితీకి గాని ఏమైన ఆక్షేపణలు ఉన్నచో 15 రోజులలో గా తెలియజేయవలసినదిగా ఎ1 నోటీసు గ్రామ పంచాయితీకి అమలు జరిపి గ్రామంలో దండోరా మూలముగా ప్రకటన చేయించి, నోటీసు ప్రతి గ్రామ పంచాయాతీ కార్యాలయ నోటీసు బోర్డులో ఉంచుట ద్వారా ప్రకటించాలి. అసమంజసమైన ఆక్షేపణలు వచ్చినట్లైతే మండల రెవెన్యూ ఆఫీసరుకు పంపాలి. అసమంజసమైన ఆక్షేపణలు వచ్చినచో వాటిపై వివరణతో మండల రెవెన్యూ అధికారి వార్కి నివేదిక పంపాలి. అట్టి ఆక్షేపణలను త్రోసి పుచ్చుతూ మండల రెవెన్యూ అధికారి వార్కి ఉత్తర్వులు ఇచ్చినచో ప్రతి పాదనలతో యీదిగువ రికార్డు జతపర్చి పంపాలి.

1. అభ్యర్థి యొక్క రదఖాస్తు.
2. ప్రచురించిన ఎ1 నోటీసు ప్రతులు, ఎసైన్మెంటుకు 1, కన్వర్షన్ కు 1
3. కోరిన భూమి సర్వే నెంబరు లేదా లెటరులో భాగమైనచో సబ్ డివిజను రికార్డు (మూడు ప్రతులు)
4. భూమి తణిఖీ నివేదిక.
5. భూమిలో గల కట్టడములు, చెట్లు వివరములతో చెట్ల కట్టడముల విలువను తెలిపే స్టేటుమెంటు
6. దరఖాస్తు దారులపై అమలు జరిపిన సి నోటీసు
7. చెట్ల/కట్టడముల విలువను చెల్లించుటకు అంగీకరిస్తూ దరఖాస్తు దారుని స్టేటుమెంటు
8. శిస్తు నిర్ధారణ చేయుటకు "తరం స్టేటుమెంట్లు" -3 ప్రతులు
9. పోరంబోకు అయినచో "పోరంబోకు" నుండి "ఆయాను" గామార్చుటకు - ట్రాన్సుఫరు దరఖాస్తులు - 3 ప్రతులు.
10. పోరంబోకు గ్రామ పంచాయితీ అధీనములో వున్నచో పట్టాపై యిచ్చు భూమిని గ్రామ పంచాయితీ అధీనము నుండి తొలగించుటకు "విత్ డ్రాయల్ నోటీఫికేషన్లు" -3ప్రతులు.
11. పోరంబోకు గ్రామ పంచాయితీ అధీనములో గాక, ప్రభుత్వము యొక్క రెవెన్యూ కానట్టి

యితర శాఖల అధీనములో ఉన్నచో, అధీనముగల శాఖాధిపతి యొక్క అంగీకార పత్రము పొంది జత పర్చాలి.

12. ఎసైన్మెంటు చెక్ మెమో 2 ప్రతులు.

13. ఎ. రిజిస్టరు నకలు - 3 ప్రతులు

14. అడంగలు (వి.ఎ.3) నకలు - 3 ప్రతులు.

15. దరఖాస్తుదారు ఆక్రమణదారైతే గ్రామ లెక్క 4 -సి నకలు.

16. గ్రామ పంచాయితీ తీర్మానము - 3 ప్రతులు.

పూర్తి స్థాయి ప్రతి పాదనలు మండల రెవెన్యూ అధికారికి చేరిన పిదప, దరఖాస్తుదారు (Elegibility) అర్హత గురించి, కోరిన భూమి పరిశీలించిన తరువాత అవుసరమైన దర్యాప్తు పూర్తి చేసి తన భూతనిఖీ రిమార్కులతో రెవెన్యూ డివిజినల్ అధికారి వార్కి తగు సిఫార్సులతో నివేదిక పంపుచూ ప్రతిపాదనలు ఆమోదం నిమిత్తం పంపుతారు.

మండల రెవెన్యూ అధికారి నుండి వచ్చిన ప్రతిపాదనలు పూర్తిస్థాయిలో వున్నచో, ప్రతిపాదించిన భూమిని రెవెన్యూ డివిజినల్ అధికారి వారు కూడ క్షేత్ర పరీక్షచేసి, అట్టి భూమి గ్రామ పంచాయితీ అధీనములో ఉన్నచో, చట్ట ప్రకారము ఆ భూమిని గ్రామ పంచాయితీ అధీనమునుండి తప్పిస్తూ జిల్లా గెజిట్లో విత్డ్రాయల్ నోటిఫికేషను ప్రచురణ చేయించి, భూమిని “పోరంబోకు” నుండి “ఆయాను” గా మార్చి, తీరం స్టేటుమెంటులో శిస్తు నిర్ధారణచేసి, మండల రెవెన్యూ అధికారికి ఉత్తర్వులు పంపుతారు. ఉత్తర్వులనను సవరించి, మండల రెవెన్యూ అధికారి దరఖాస్తు దారునకు డి-ఫారం పట్టా మంజూరు చేస్తారు.

డి- ఫారం పట్టా దారుకు పట్టాదారు పాసుపుస్తకం టైటిల్ డీడ్ మంజూరు చేస్తూ రిమార్కుల కాలంలో “వంశ పారంపర్యముగా అనుభవించవలసినదే గాని, అన్యాక్రాంతము చేయరాదు” అని ఎర్రసిరాతో వ్రాసి అందజేయాలి.

**7. ఎసైన్మెంటు షరతులు:**

ఎ) మంజూరు చేయబడిన భూమిని వంశ పారం పర్యంగా అనుభవించాలే గాని అన్యాక్రాంతం చేయకూడదు.

బి) మంజూరు పొందిన 3 సంవత్సరాలలోగా భూమిని సాగులోకి తీసుకురావాలి.

సి) పంటకు ప్రభుత్వ నీటివనరుల నుండి నీరును తీసుకుంటే నీటి పన్ను చెల్లించాలి.

డి) మంజూరు పొందిన వ్యక్తి లేదా అతని కుటుంబ సభ్యులు స్వయంగాగాని లేదా వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో కూలీలతో గాని వ్యవసాయం చేయాలి.

పై షరతులులో ఏ ఒక్క దానిని ఉల్లంఘించినా ప్రభుత్వం భూమిని వెనక్కు తీసుకుటుంది. ఆ అధికారము మంజూరు చేసిన అధికారికి ఉంటుంది.

మంజూరు చేసిన భూమిని ఏ విధముగానైనా అన్యాక్రాంతము చేసినచో కేటాయించిన భూమి (బదిలీ నిషేధము) చట్టం 9/77 ప్రకారం తిరిగి తీసుకొనబడును.

**8. అప్పీలు:**

దరఖాస్తు దారుగాని, ఆక్షేపణదారు గాని తనకు బి.ఎస్.ఓ. 15- మండల రెవెన్యూ అధికారి వారి ఉత్తర్వులు వల్ల అన్యాయం జరిగినట్లు భావిస్తే బి.ఎస్.ఓ. 15లో పేరా 15 ప్రకారం ఉత్తర్లు అందిన 30 రోజులలోగా రెవెన్యూ డివిజినల్ అధికారి వద్ద, రెవెన్యూ డివిజినల్ అధికారి ఉత్తర్వులు అందిన 30 రోజులలోగా కలెక్టరు వారి వద్ద అప్పీలు చేసుకోవచ్చును. కలెక్టరు వారి ఉత్తర్వులు అందిన 40 రోజులలోగా ల్యాండు ఎడ్మినిస్ట్రేషన్ ఛీఫ్ కమీషనరు హైదరాబాదు వార్కి అప్పీలు చేసుకోవచ్చును. అప్పీలు పై రూ.5/-ల కోర్టు ఫీజు బిళ్ల అతికించాలి. అప్పీలు ఒక్క సారి మాత్రమే అంగీకరించబడుతుంది.

**9. పునర్విచారణ (రివిజన్):**

రివిజను: బి.ఎస్.ఓ. 15-18 మండల రెవెన్యూ అధికారి ఉత్తర్వులు 1 రెవెన్యూ డివిజినల్ అధికారి జారీ చేసిన (అప్పీలులో) ఉత్తర్వులు దర్మిలా 3 సంవత్సరములలోనూ ఎప్పుడైనను దరఖాస్తుపై గాని, తనంతటతానుగా కాని కలెక్టరు వారు ఫైలు పరిశీలించి లోపములున్నచో దిగువ అధికార్లు ఉత్తర్వులను రద్దు పర్చవచ్చును, మార్చవచ్చును,ప్రధాన కమీషనరు, భూ పరిపాలన వారు ఎప్పుడైననూ ఫైలు పొంది, పరిశీలించి, లోపభూయిష్టముగా ఉన్నచో దిగువ అధికార్ల ఉత్తర్వులు రద్దు పర్చ వచ్చును, లేదా మార్చవచ్చును.

1.పునర్విచారణ: (రివిజన్): ఎస్సైన్‌మెంట్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడిన తరువాత వాటిపై ఎటువంటి అప్పీలు లేనట్లైతే లేదా అప్పిలేట్ అధికారి ముందు అప్పీలు దాఖలైతే అవే ఆఖరువి. వాటిపై రెండవ అప్పీలు లేదు. కానీ మొదటి ఉత్తర్వులు గానీ లేదా అప్పీలేట్ ఉత్తర్వులు గానీ వెలువడిన మూడుట సంవత్సరాలలో అవి నిబంధనలకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయని గానీ లేదా తప్పుడు సమాచారం వల్ల, అవినీతితో తన కింది అధికారులు ఇచ్చినవిగా జిల్లా కలెక్టరు భావిస్తే అటువంటి ఉత్తర్వులను పక్కకు పెట్టడం గానీ, రద్దుచేయడం, మార్పులు చేయడంగానీ చేయవచ్చు. ఇదే విధంగా ఏ సమయంలోనైనా ప్రధాన పరిపాలన కమీషనర్) తన కింది అధికారుల ఉత్తర్వుల నిబంధనలకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయని గానీ, తప్పుడు సమాచారం వల్ల, అవినీతి వల్ల, తగిన అధికారాలు లేకుండా ఇచ్చినవిగా భావిస్తే అటువంటి ఉత్తర్వులను పక్కకు పెట్టడం లేదా రద్దు చేయడం లేదా మార్పులుచేసే అధికారం ఉంది. దరఖాస్తు కేసులకు సంబంధించిన అన్ని రివిజన్ పిటీషన్లు రెండు రూపాయలు విలువ గల కోర్టు ఫీజు స్టాంపుతో వేయాలి.

2. రాష్ట్ర ప్రభుత్వం ఏ సమయంలోనైనా స్వయంగా గానీ లేదా తమకు అందిన దరఖాస్తు వలన గానీ రికార్డులను కోరవచ్చు. రికార్డులను పరిశీలించి తమ కింది అధికారులు ఇచ్చిన ఉత్తర్వులు లేదా

కార్యానిర్వహణల న్యాయ బద్ధతను పరిశీలించి తగిన ఉత్తర్వును ఇవ్వవచ్చు. అప్పటివరకు ప్రభుత్వం తమ కింది అధికారి ఉత్తర్వులను లేదా కార్యాకర్తనాలను నిలుపుదల చేసే స్టే ఉత్తర్వులను ఇవ్వవచ్చు.

**10. అప్పీలు విచారించుటలో పాటించవలసిన పద్ధతులు:**

అప్పీళ్ళను విచారించటంలో పాటించవలసిన పద్ధతి: ఆ కేసులో ఇదివరకే వచ్చిన ఉత్తర్వు లేదా ఉత్తర్వుల పబ్లిక్ నకళ్ళు (సర్టిఫైడ్ కాపీలు) లేకుండా ఏ అప్పీలు పిటిషన్‌కు విచారణకు స్వీకరించకూడదు. జిల్లా కలెక్టరుకు గానీ రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్ గానీ ప్రతివాదికి నోటీసు ఇవ్వకుండా అతనికి లోగడ ఇచ్చిన ఉత్తర్వులకు విరుద్ధంగా మార్పులు చేయటం గానీ, మినహాయించటం గానీ చేయకూడదు. పిటిషనర్లు, రెస్పాండెంట్ల సమక్షంలో అప్పీల్ తీర్పులను చదివి వినిపించని పక్షంలో ఎటువంటి రుసుమూ తీసుకోకుండా లిఖితపూర్వకంగా అందచేయాలి. ఉత్తర్వులు పబ్లిక్ నకలు (సర్టిఫైడ్ కాపీల)కు దరఖాస్తు చేసి తగిన కాపీయింగ్ స్టాంప్ పేపర్స్ అందచేసి వాటిని మంజూరు చేయాలి.

## 11.ప్రభుత్వ భూమి నివేశ్న స్థళములుగా కేటాయింపు విధానము బి.ఎస్.ఓ.21

ప్రభుత్వ అధీనంలోగల గ్రామ కంఠం పోరంబోకు భూమిలో నివేశ్న స్థళములు ఇండ్లు, ఇండ్ల స్థళములు లేని పేద వార్కి 0.05 సెంట్లకు మించకుండ మండల రెవెన్యూ అధికారి వారు Home Site పట్టా మంజూరు చేయు అధికారము కలిగియున్నారు.

నివేశ్న స్థళముల కొరకు భూసేకరణ చట్ట ప్రకారం రైత్వారీ భూమిని సేకరించిన సందర్భములో యం. 03 సెంట్ల విస్తీర్ణము వరకు Home Site పట్టాపై మంజూరు చేస్తారు.

గ్రామ కంఠం కాకుండ ఇతర పోరంబోకు భూమిలో యిళ్ల స్థళాలు కేటాయించుటకు నిర్ణయిస్తే, జిల్లా కలెక్టరు వార్కి ప్రతిపాదనలు పంపాలి. బి.ఎస్.ఓ. 15-2(3) ప్రకారం జిల్లా కలెక్టరు వారు మాత్రమే ఒక "పోరంబోకు" నుండి "మరియొక పోరంబోకు"గా మార్చు అధికారము కలిగియున్నారు. ప్రతి పాదనలు పంపుటలో సాగుభూమికి ఏవిధంగా ప్రతిపాదనలు పంపవలెనో అదేక్రమంలో (భూ వినియోగము మాత్రమే మార్చి) ప్రతి పాదనలు కలెక్టరు వారి స్థాయికి మండల రెవెన్యూ అధికారి ద్వారా, రెవెన్యూ డివిజినల్ అధికారి ద్వారా పంపవలసి ఉంటుంది.

పట్టణ ప్రాంతాల్లో 31.3.1990 తేదీకి పూర్వం నుండి ఆక్రమించుకున్న ఆక్రమణ దారులకు జి.ఓ.యం.ఎస్.నెం. 508 రెవెన్యూ తే 20.10.95 ప్రకారం మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో 60 చ॥గజాలు, మిగతా మున్సిపల్ పట్టణాల్లో 75 చ॥గజాలు స్థళాన్ని ఉచితంగా మంజూరు చేయవచ్చును. అంతకుమించి 100 చ॥గజాలలోపు స్థళం ఆక్రమింపబడి ఉన్నచో మౌళిక విలువలో 4వ వంతు వసూలు చేయాలని జి.ఓ.నెం.313 రెవెన్యూ తే 22-4।97 దీ ఉత్తర్వులు నిర్దేశించుచున్నవి.

జి.ఓ.నెం.185 రెవెన్యూ తే 11.3.97 ఉత్తర్వుల ప్రకారం రాజకీయ బాధితులకు ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణా రీజియన్‌లో వారు నివశించుచున్న రీజియన్‌లో గల ఏ పట్టణములోనైనా 300 చ॥గ॥ల స్థళం మంజూరు చేయవచ్చును.

గ్రామల్లో చెల్లా చెదురుగా ఉన్న ఇళ్ల స్థళాలు విషయంలో, స్థళ యజమానులు బలహీన వర్గాల గృహనిర్మణ కార్యక్రమంలో ఎ.పి.స్టేట్ హౌసింగ్ కార్పోరేషన్ నుండి ఋణాలు పొందుటకు అవసరమైన "స్థానానుభవ ధృవీకరణ" (Possession Certificate) పత్రాన్ని పొందుటకై అనుసరించవలసిన పద్దతులు జి.ఓ.ఎం.ఎస్ 546 రెవెన్యూ తే.30.6.1997 దీ భవములో వున్నచో, అతనికి ఏవిధంగా సంక్రమించినది, ఎంతకాలము నుండి అతని స్వాధీన అనుభవములోనున్నది దర్యాప్తుచేసి, ధృవీకరణ పత్రము కొరకు మండల రెవెన్యూ అధికారి వార్కి సిఫార్సు చేయవలసి ఉన్నది.

# 3. ఆంధ్ర ప్రదేశ్ ఎసైన్డు భూములు బదలాయింపు (నిషేధ) చట్టం 1977

## 1. ముఖ్య ఉద్దేశ్యము:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పేదప్రజలకు మంజూరుచేసిన ప్రభుత్వ భూముల బదలాయింపును (అన్యాక్రాంతాన్ని) ఈ చట్టం నిషేధిస్తుంది. ఈ చట్టం 21-1-1977 నుండి అమలు లోనికి వచ్చినది. ఈ చట్టం అంతకుముందు జరిగిన బదలాయింపులకు కూడ వర్తించును. ఆంధ్ర ప్రదేశ్ అంతటికి వర్తిస్తుంది.

**సెక్షన్2:** ఎసైన్‌మెంటు భూమి అంటే ఇతరులకు అన్యాక్రాంతం చేసే హక్కు లేకుండా ప్రభుత్వ నిబంధనలు అనుసరించి భూమి లేని పేదవారికి మంజూరు చేసిన ప్రభుత్వ భూములు, చట్టం ద్వారా స్వాధీనం చేసుకొని భూమిలేని పేదవారికి ఇచ్చిన సీలింగు మిగులు మిగిలుభూములని అర్థం. మంజూరు చేసిన భూములు, లబ్దిదారు సాగుచేసుకొని వంశపారంపర్యముగా అనుభవించవలసిన దేగాని, అన్యాక్రాంతము చేయరాదు.

తనఖా పెట్టడం కూడా బదలాయింపు నిర్వచనం కిందికి వస్తున్నప్పటికీ 1964 కో - ఆపరేటివ్స్ చట్టం కింద రిజిష్టరైన కో - ఆపరేటివ్ సొసైటీలలోనూ, కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాల గుర్తింపు పొందిన జాతీయ, వాటి అనుబంధ బ్యాంకులకు తనఖా పెట్టుకోవడం ఈ నిర్వచనం (బదలాయింపు) కిందకు రాదు.

భూమి లేని పేదవాడు అంటే 2.50 ఎకరాల పల్లం (తర) గానీ 5.00 ఎకరాల మెట్ట (ఖుష్కి) గానీ మించకుండా వుండి ఇతర మార్గాలలో జీవనోపాధి లేని వ్యక్తి అని అర్థం. భూ విస్తీర్ణం నిర్ధారించడంలో ఒక ఎకరం పల్లం (తర) భూమిని 2 ఎకరాల మెట్ట (ఖుష్కి) భూమికి సమానంగా భావించాలి.

బదలాయింపు అంటే అమ్మటం, కానుక, మార్పిడి, స్వాధీన, అస్వాధీన తనఖాలు, కౌలు, లేదా ఎసైన్‌మెంటు భూములకు సంబంధించిన ఏ వ్యవహారమైన బదలాయింపు నిర్వచనం కిందికి వస్తుంది.

**సెక్షన్3:** చట్టం రావడానకి ముందుగానీ తరువాత గానీ ప్రభుత్వం ద్వారా వ్యవసాయానికి లేదా గృహ నివాసానికి మంజూరు చేసిన ఎసైన్‌మెంటు భూమిని బదలాయించడం నిషేధించబడింది. అమలులో వున్న మరేదైనా చట్టం ద్వారా గానీ లేదా రికార్డుల ద్వారా గానీ ఎసైన్‌మెంట్ భూమిని బదలాయించకూడదు. చట్ట విరుద్ధంగా అన్యాక్రాంతం పొందిన వ్యక్తికి ఆ భూమిపై హక్కు గానీ, యజమానిత్వం (title) గానీ వుండవు.

భూమిలేనీ పేదవారెవరూ తమకు మంజూరు చేసిన ఎసైన్‌మెంట్ భూములను అన్యాక్రాంతం చేయకూడదు. అమ్మకం, కానుక, కౌలు, తనఖా, మార్పిడి, మరే ఇతర రూపాలలోనూ ఇతరులు ఆ భూమిని పొందకూడదు. చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా బదలాయింపు జరిగితే దానికి చట్టపరంగా ఎట్టి గుర్తింపు, హక్కు వుండదు.

సివిల్ కోర్టు ఆదేశాల ద్వారా, డిక్రీ అమలు ద్వారా లేదా ఇతర అధికార వ్యవస్థల ఆదేశాల ద్వారా గానీ పైన తెలిపిన విధంగా ఎసైన్‌మెంటు భూమిని బదలాయింపు చెయ్యటం చెల్లదు.

కానీ చట్టం అమలులోనికి రావడానికి ముందు ఎవరైనా పేదవారు వ్యవసాయం కోసం లేదా ఇంటి నివాసం కోసం సదుద్దేశంతో, సక్రమ పద్ధతుల్లో భూమిని కొని వారు దాన్ని అనుభవిస్తుంటే అటువంటివారికి ఈ చట్టం వర్తించదు.

**సెక్షన్ 4 :** చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా బదలాయింపు జరిగిందని జిల్లా కలెక్టరు విశ్వసిస్తే తాశీల్దారు కంటే దిగువ స్థాయి కాని అధికారిని బదలాయింపు ద్వారా భూమి పొందిన వ్యక్తి నుండి ఎసైన్‌మెంట్ భూమిని స్వాధీన పరుచుకోమని ఆదేశించాలి.

తిరిగి స్వాధీన పరచుకున్న భూమిని అసలు లబ్ధిదారుడికి లేదా అతని చట్టబద్ధ వారసులకు గానీ అందచేయాలి. అది సాధ్యం కానిపక్షంలో అమలులోవున్న నిబంధనలను అనుసరించి పేదవారికి ఎసైన్ చేయాలి.

ఈచట్టం కింద ఇచ్చిన ఆదేశాలను సివిల్ కోర్టులలో ప్రశ్నించడానికి వీలు లేదు. ఈ చట్టాన్ని అనుసరించి చేపట్టే చర్యలపైన, అధికారులపైన, ప్రభుత్వంపైన ఇంజక్షన్ ఇచ్చే అధికారం సివిల్ కోర్టులకు లేదు.

**సెక్షన్ 5:** ఎసైన్‌మెంటు భూముల బదలాయింపుకు సంబంధించి ఏ వ్యవహారాన్ని రిజిస్ట్రేషన్ శాఖ రిజిష్టర్ చేయకూడదు.

అయితే కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలకు, జాతీయ బ్యాంకులు, కో-ఆపరేటివ్ బ్యాంకులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడిపే, నియంత్రించే ఆర్థిక సంస్థలకు ఎసైన్‌మెంట్ భూములను తనఖా పెట్టుకొనే సందర్భాలలో ఈ సెక్షన్ వర్తించదు.

**సెక్షన్ 7 :**చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ఎసైన్‌మెంట్ భూమిని అన్యాక్రాంతం పొందితే అట్టి వ్యక్తికి 6 నెలలు జైలుశిక్ష, 2 వేల రూపాయల వరకు జరిమానా విడివిడిగా గానీ కలిపిగానీ విధించవచ్చు.

## 4. ఆంధ్రప్రదేశ్ భూ ఆక్రమణ చట్టం 1905

**1.ముఖ్య ఉద్దేశ్యము:**

ప్రభుత్వ భూములను పరిరక్షించుటకు ఆక్రమణలకుపక్రమించే వారిపై చర్యలు తీసుకొని నిరోధించుటకు, ఆక్రమించిన ఆక్రమణ దారుల పై ఆక్రమణ పన్ను తో పాటు పెనాల్టి విధించి, అక్రమణలు తొలిగించేందుకు ఉద్దేశించబడిన ప్రజోపయోగచట్టము.

**2.చట్ట పరిధిలోనికి వచ్చు ప్రభుత్వ భూములు:**

చట్టంలోని సెక్షన్ 2 ప్రకారము అన్ని ప్రభుత్వ భూములు, తరం కట్టిన, తరంకట్టని గయాలు (బంజరు) భూములు, ప్రభుత్వ ఆధీనములోగల, ఆధీనములోనికి వచ్చు యావత్తు భూములు అనగా మిగులు భూములు, రెజ్యూమ్డు భూములు, ఇస్తిఫా భూములు వేలం ద్వారా ప్రభుత్వ పరమైన భూములు, భూసేకరణ చట్ట ప్రకారము సేకరించిన భూములు ఈ చట్ట పరిధిలోనికి వస్తాయి.

**3.ఆక్రమణలు - వర్గీకరణ:**

బి యస్ ఓ 26-4 ప్రకారం ఆక్రమణలు యి క్రింది విధంగా వర్గీకరించాలి.

(అ) ఆక్షేపణ లేని తాత్కాలిక/శాశ్వత ఆక్రమణలు

(ఆ) తాత్కాలికముగా ఆక్రమించుట ఆక్షేపన లేనట్టిది/ శాశ్వతముగా

(ఇ) తాత్కాలికముగాగాని, శాశ్వతముగా కాని ఆక్రమించుట ఆక్షేపణ కరమైనది.

**4.ఆక్రమణలపై శిస్తు విధింపు విధానము:**

“భూ ఆక్రమణ” అనగా ప్రభుత్వ భూమిని అనుమతి లేకుండా అనుభవించడం. ఆ విధంగా భూ ఆక్రమణ చేసిన వ్యక్తి సెక్షన్ 3(1) ప్రకారము శిస్తు నిర్ధారణ కాబడిన భూమి అయినచో అట్టి శిస్తు (టి.ఎ) శిస్తు నిర్ధారణ కానట్లైతే సెక్షన్ 3(11) ప్రకారం సమీపములో గల అదే తరహా భూమికి నిర్ణయించిన శిస్తు రేటు (హెచ్ డి ఆర్) ప్రకారం గాని శిస్తు విధించి వసూలు చేయాలి. ఆక్షేపణకరమైన ఆక్రమణ అయినచో సెక్షన్ 5(1) ప్రకారం తరం శిస్తు ఉన్నచో రూ. 5/-లు మించకుండా లేదా 10 రెట్ల తరం శిస్తు మించకుండా పెనాల్టీ విధించవచ్చును. తరం శిస్తు లేనిచో సెక్షన్ 5(2) ప్రకారం రూ.10/ లు మించకుండా లేదా 20 రెట్ల ఎ.డి.ఆర్ లేదా హెచ్.డి.ఆర్‌కు మించకుండ పెనాల్టీ విధించవచ్చును. పట్టణములలోని ఆక్రమణలకు కూడా పన్ను విధించవలెను. చెల్లించనంత మాత్రాన ఆక్రమణదారుకు చట్ట పరమైన ఎటువంటి హక్కులు రావు. సెక్షన్ 4 ప్రకారం విధించిన శిస్తు విషయంలో ఏ సివిల్ కోర్టు పరిధిలోనికి రావు.

**పై కేటగిరి (అ) భూములు:**

1) శిస్తు కట్టిన గయాళు భూములు

2) రిజర్వు కానట్టి శిస్తు కట్టని గయాళు భూములు

**కేటగిరి (ఆ) భూములు:**

1) నిరుపయోగమైన పోరంబోకు భూములు

2) అవసరానికిమించి విస్తీర్ణం కలిగి వున్న, ప్రజోప యోగములోని పాక్షిక పోరంబోకు భూములు.

**కేటగిరి (ఇ) భూములు:**

1) ప్రజలందరికీ – ఉపయోగపడే ఉమ్మడి భూములు

2) నిషేదించిన (పి ఓ బి) ప్రభుత్వ భూములు

3) రిజర్వు కాబడిన భూములు

**5.ఆక్రమణలు నమోదు చేయు విధానము:**

ఆక్రమణలు గుర్తించి అడంగలు లేక పహాణీలో నమోదు చేసిన వెంటనే బి.మెమొలో ఆక్రమించిన భూమి వివరములు, ఆక్రమణ దారు వివరములు, ఆక్రమణ విధానము, ఆక్రమణ స్వభావము, ఆక్రమణ వయస్సు, గతఫసలీలో విధించబడిన ఆక్రమణ పన్ను వివరములు పూరించి, ఆక్రమణదారుకి చట్టములోని సెక్షన్ 7 ప్రకారము ఆక్రమణ భూమి నుండి తొలగి పోవలసినదిగాను లేదా ఎలా తొలగించరాదో తెలియపర్చ వలసినదిగా సంజాయిషీనోటీసు (బి ఎస్ ఓ లోని Appendix-(XXXII) డూప్లికేటులో తయారుచేసి మండల రెవెన్యూ అధికారి సెక్షన్ 7 నోటీసులు సంతకం చేసి పంపిన వెంటనే నోటీసు ప్రతి ఆక్రమణదారుపై అమలు జరపాలి.

తీవ్ర అభ్యంతరకరమైన ఆక్రమణల నుండి ఆక్రమణదారులను తొలగించుటకు సెక్షన్ 6 తొలగింపు ఉత్తర్వుల నోటీసులు డూప్లికేటులో తయారు చేసి మండల రెవెన్యూ అధికారి వార్కి ఆమోదము నిమిత్తం పంపాలి. అట్టి తొలగింపు నోటీసు జారీ చేస్తూ "Evict & Confiscate" అని ఉత్తర్వులు ఇస్తారు. ఆ ఉత్తర్వుల లోగల నోటీసు ప్రతిని ఆక్రమణ దారుపై తప్పనిసరిగా అమలు జరిపి, ఆక్రమణ భూమిలో తొలగించని పంటను లేదా కట్టడమును, లేదా వస్తువులను, ప్రభుత్వ పరంచేయాలి.

ఐతే ఆక్రమణ భూమిలో వరిసస్యం నిల్చి ఉన్నట్లైతే, ఆసస్యం తీసుకొని, భూమి నుండి తొలగి పోవుదునని ఆక్రమణదారు లిఖిత పూర్వకంగా విన్నవిస్తే, పంటతీసుకొనిపోయి, ఆక్రమణ విడిచిపెట్టుటకు అనుమతించవచ్చును.

గ్రామ పంచాయితీకి లేదా మున్సిపాలిటీకి వారి చట్టముల ప్రకారము దఖలు పడిన భూముల విషయంలో సెక్షన్7 మరియు సెక్షన్ 6 నోటీసులు జారీ చేయనక్కరలేదు. వారివారి చట్టముల ప్రకారం ఆక్రమణదారుపై ఆక్రమణ పన్ను విధింపు, ఆక్రమణలతొలగింపు వారే చేసుకొనవలసియున్నది. వారు కోరినచో ఈ చట్ట ప్రకారము చర్యతీసుకొనవచ్చును.

**6.మూకుమ్మడిగా చేయు ఆక్రమణలు తొలగింపు విధానం:**

భూ ఆక్రమణల చట్టంలోని సెక్షన్ 7–ఎ ప్రకారము, హక్కు అనుమతి లేకుండ ప్రభుత్వ భూమిని మూకుమ్మడిగా, ఆక్రమించుటకు ఉపక్రమించిన, ముందుగా నోటీసు ఇవ్వవలసిన అవసరం లేకుండ, జిల్లా కలెక్టరువారు అట్టి ఆక్రమణ దారులను మూకుమ్మడిగా తొలగించుటకు ఉత్తర్వులు జారీ చేయవచ్చును. అట్టి ఉత్తర్వులను ఏ సివిల్ కోర్టులోను సవాలు చేయుటకు వీలు లేదు. కలెక్టరు వారి ఉత్తర్వులను అమలు జరుపుటలో పోలీసువారి సహకారముపొంది, ఆక్రమణదారులను మూకుమ్మడిగా తొలగించి, ఆక్రమించిన భూమిలోని సస్యము లేదా కట్టడములను తొలగించవచ్చును.

**7.ఆక్రమణ పన్ను వసూలు:**

సెక్షన్ 9 ప్రకారము ఆక్రమణలపై విధించిన ఆక్రమణ పన్ను ల్యాండు రెవెన్యూగా పరిగణించి రెవెన్యూ రికవరీ చట్ట ప్రకారము వసూలు చేయదగును.

**8.అప్పీలు/రివిజను:**

సెక్షన్ 10 ప్రకారము ఈ చట్ట ప్రకారము జారీ చేయబడిన మండల రెవెన్యూ అధికారి ఉత్తర్వులపై రెవెన్యూ డివిజన్ అధికారివారికి ఉత్తర్వులు జారీచేసిన 60 రోజులులోగా అప్పీలుచేసుకోవచ్చును. సదరు అప్పీలు ఉత్తర్వులపై జిల్లా కలెక్టరు వద్ద రివిజను దాఖలు చేసుకోవచ్చును. జిల్లా కలెక్టరు వారి రివిజను ఉత్తర్వులపై ప్రధాన కమీషనరు భూ పరిపాలన వద్ద రివిజను దాఖలు చేసుకోవచ్చును. రివిజనులో జిల్లా కలెక్టరు వారు గాని, ప్రధాన కమీషనరు భూ పరిపాలన వారు గాని ఉత్తర్వులను సవరించవచ్చును.

**9.చట్టధిక్కారము-శిక్ష**

ఆక్రమణదారు సెక్షన్ 6(1) ఉత్తర్వుల ప్రకారం తొలగిపోనట్లైతే, లేదా ఉత్తర్వులు అమలు చేయుటలో అడ్డుకున్నట్లైతే, అతనిని సెక్షన్ 6(2) ప్రకారం 30 రోజులు మించకుండ కలెక్టరు కార్యాలయములోగాని, మండల రెవిన్యూ కార్యాలయములోగాని నిర్బంధములో ఉంచవచ్చును. లేదా అదే కాలమునకు వారంటుతో సివిల్ జైలుకు తరలించవచ్చును.

తొలగింపబడిన ఆక్రమణదారు మరల భూమిలో ప్రవేశించినట్లైతే సెక్షను 6(3) ప్రకారము 6 మాసముల జైలు శిక్ష లేక రూ.1000/-లు ఫైను లేదా రెండూ విధించవచ్చును.

సెక్షన్ 14 ప్రకారం ఈ చట్ట పరిధిలో జారీ చేసిన ఉత్తర్వులను ఏ సివిల్ కోర్టుకు ప్రశ్నించు అధికారము లేదు.

# 5. ఆంధ్రప్రదేశ్ భూ కబ్జా (నిషేధ) చట్టము 1982

(Act 12 of 1982)

**1. ఉద్దేశ్యము:**

ఒక వ్యక్తి గాని లేదా గుంపులుగా వ్యక్తులు గాని, ఎట్టి హక్కు అధికారము లేకుండ దౌర్జన్యముగా, దురుద్దేశముతో ప్రభుత్వము యొక్క, స్థానిక సంస్థల యొక్క, దేవాదాయ దర్మాదాయ సంస్థల యొక్క , ధార్మిక సంస్థల యొక్క , విద్యా సంస్థల యొక్క , వాక్పు బోర్డు యొక్క లేదా ప్రై వేటు వ్యక్తుల యొక్క భూములను కబ్జా చేయు ఉద్దేశముతో జరిగే ప్రయత్నాలను నిరోధించడానికి ఈ చట్టం చేయబడినది. ఈ చట్టం 29-6-1982 నుండి అమలులోనికి వచ్చునది.

**2. చట్టం పరిధి:**

ఈ చట్టం అర్బను అగ్లామరేషను మరియు మునిసిపలు ఏరియాల నందలి భూములకు వర్తించును. ఈ ప్రాంతములు కాకుండా అర్బను యేరియాలు గా ప్రాముఖ్యత సంతరించుకొన్న మరియు పారిశ్రామికంగా, వ్యాపార సంబంధంగా వృద్ధి చెందుచున్న ప్రాంతము నందలి భూములకు కూడా వర్తించును.

**3. భూ కబ్జా మరియు దాని పర్యావసానములు:**

సెక్షన్ 3 ప్రకారము భూకబ్జా శిక్షించ దగు నేరముగా పరిగణింపబడుతుంది. సెక్షన్ 4 ప్రకారము: ఈ చట్టం అమలులోనికి వచ్చినప్పటి నుండి ఎవ్వరు భూకబ్జాకు పాల్పడరాదు. కబ్జాచేసిన వ్యక్తి నేరస్థుడుగా పరిగడింపబడతాడు. అట్టి భూకబ్జాదారు 6 మాసములకు తక్కువ కాకుండా 5 సంవత్సరముల వరకు కారాగార శిక్ష మరియు రూ. 5,000/- లు వరకు జరిమానాతో శిక్షింపబడాలి. సెక్షన్ 5 ప్రకారం ఎవరైనా కబ్జా చేసిన భూమిని స్వలాభంకొరకు అమ్మడం, అమ్మకానికి ప్రకటించడం, లేదా వ్యక్తులకు కేటాయించడం, లేఅవుటుచెయ్యడం, ప్లాట్లుగా అమ్మడం, లేదా అమ్మజూపడం, భవనాలు నిర్మంచి అమ్మడం, అద్దెకు యివ్వడం, అద్దెలు వసూలు చేయడం, మొదలైన కార్యక్రమాలు చేసే వ్యక్తి, లేదా వ్యక్తులు, అందుకు ప్రోత్సహించే, పెట్టుబడి పెట్టే వ్యక్తి లేదా వ్యక్తులు భూకబ్జా దారులవుతారు. అట్టి భూకబ్జా దారులు 6 మాసములకు తక్కువ కాకుండ 5 సంవత్సరముల వరకు కారాగార శిక్ష మరియు రూ.5,000/- లు వరకు జరిమానాతో శిక్షింపబడతారు.

సెక్షన్ 6 ప్రకారం వ్యక్తి కాకుండ ఏదైన కంపెనీ భూకబ్జాకు పాల్పడినట్లయితే, ఆ కంపెనీ తరపున బాధ్యుడైన కంపెనీ వ్యవహారములు చూసే వ్యక్తిని బాధ్యునిగా గుర్తించి పై విధంగా శిక్షించబడతారు.

**4. చట్టం అమలు విధానం:**

సెక్షన్ 7 మరియు 9 ప్రకారం: భూకబ్జా కు సంబంధించిన కేసులు త్వరగా పరిష్కరించుటకు స్పెషల్ కోర్టులు నిర్వహించె భూమిపై హక్కుదారులు, అనుమతి పొందిన అనుభవదారులు, దౌర్జన్యముగా భూ కబ్జా

జరిగినదా లేదా, ఎవరెవరు భూ కబ్జా దారులు, కబ్జా వల్ల భూస్వామికి సంభవించిన నష్టం మొదలైన అంశములపై విచారణచేసి, తీర్పు వెలువరించాలి. ఈ తీర్పు అమలుచేయుటలో ప్రభుత్వము నియమించిన ప్రత్యేక అధికారి లేదా రెవెన్యూ డివిజినల్ అధికారి కబ్జా చేసిన భూమిని స్వంత దారుకు అప్పగించుటకు, తీర్పు ప్రకారం కబ్జాదారులనుండి భూయజమానికి నష్ట పరిహారంగా రావలసిన సొమ్ము యిప్పించాలి. ఏకారణము చేతనైనా భూ యజమానికి స్వాధీన పరచ లేనపుడు దానిని స్వాదీనంలో ఉంచుకొని మేనేజిమెంటు చేస్తూ, తర్వాత భూస్వామికి స్వాధీనం చేయవచ్చును. స్పెషల్ కోర్టు ఉత్తర్వులు సివిల్ కోర్టు ఉత్తర్వులులాగా అమలు జరపాలి.

## 6. ఆంధ్రప్రదేశ్ షెడ్యుల్డు ప్రాంతాల భూమి బదిలీ నిబంధనలు 1959

**1.ముఖ్యోద్దేశము:-**

ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు, పశ్చిమ గోదారి, విశాఖ పట్నం శ్రీకాకుళం, అదిలాబార్, వరంగల్, ఖమ్మం మరియు మహబూబ్‌నగర్ జిల్లాలలోగల షెడ్యూల్డ్ (ఏజెన్సీ) ప్రాంతాలలో భూముల బదిలీలను క్రమబద్దీకరించుటకై ఈ నిబంధనలు ప్రవేశపెట్టబడినాయి. ఈ నిబంధనలు 04-03-1959 తేదీ నుండి అమలులోనికి వచ్చునవి. తదనంతరం 1970 లో రెగ్యులైషన్ నెం.1/70 ద్వార ఈచట్టము సవరిచబడినవి. ఈ నిబంధనల ప్రకారం ఏజెన్సీ ఏరియాలో ని ప్రభుత్వేతర భూములు (రైత్వారీ భూములు) “బదిలీ” అనగా అమ్మకం, దానం, భూమి మార్పిడి, తనఖా వంటివి భూమి బదిలీ కార్యక్రమాలు క్రమబద్దీకరించబడతాయి.

**2.భూమి బదలాయింపు నిబంధనలు:-**

సెక్షన్3 (1) ప్రకారం 1)గిరిజనలు, గిరిజనేతరులు వార్కి గల భూములు, గిరిజనులకు లేదా గిరిజనులు సభ్యులుగా ఉన్నచో- కోపరేటివ్ సొసైటీలకు “బదలీ” చేయవచ్చుగాని, ఎట్టిపిరస్థితులలోను గిరిజనేతరులకు, గిరిజనేతరుల సంస్థలకు “బదిలీ” చేయరాదు. ఈ నిబంధనకు విరుద్ధముగా చేసిన “బదిలీ”లు చెల్లవు. (2) తాము సెటిల్మెంటు సమయములో దైత్వారీ పట్టా పొంది వారసత్వ రీత్యా స్వాదీన భుక్తముల కలిగియున్నట్లు గిరిజనేతరులు ఋజువు చేసుకొనే పర్యంతం, వారి అదీనంలోగల భూములు గిరిజనుల నుండి ‘బదిలీ’ పొందిన భూములుగానే పరిగణింపబడతాయి. (3)గిరిజనుడుగాని, గిరిజనేతరుడుగాని భూమిని అమ్మదలచుకొన్నప్పుడు ఏ గిరిజనుడు, ఏ గిరిజనులకో ఆపరేటివ్ సోసైటీ ముందుకురానిచో, అమ్మదలచుకొన్న వ్యక్తి ఏజెంటు (జిల్లా కలెక్టరు)కు గాని, ఏజెన్సీ డివిజినల్ అధికారి (సంబంధిత రెవెన్యూ డివిజినల్ అధికారి)కి గాని తన భూమిని ప్రభుత్వ పరంగా సేకరించవలసినదిగా రూలు. 15 ప్రకారం ఫారం ‘జి’లో దరఖాస్తు చేసిన మీదట అట్టి భూమికి వ్యవసాయ భూముల గరిష్ట పరిమితి చట్టంలోని నిబంధనల ననుసరించి నిర్ధారించిన భూమి విలువ చెల్లించి, అట్టి భూమిని స్వాదీన పర్చుకోవాలి. అట్టి భూమిని గిరిజనులకు లేదా గిరిజనుల కో- ఆపరేటివ్ సొసైటీకి క్రయపర్చవచ్చు, లేదా భూమి లేని పేద గిరిజనునకు పట్టాపై మంజూరు చేయవచ్చును.

**3. భూమి బదలాయింపుపై చర్య:**

సెక్షన్ 3(2) ప్రకారం (1) పై నిబంధనలకు విరుద్ధముగా ఏవ్యక్తి అయినా గిరిజనేతరునికి ‘బదిలీ’ చేసినచో రూలు 7(2) ప్రకారం ఫారం “ఇ”లో షోకాజ్ నోటీసు బదిలీ పొందిన గిరిజనేతరునిపై అమలు జరిపిన పిదప, ‘బదలీ’ పొందిన గిరిజనేతరుని తొలగిస్తూ డిక్రీయిచ్చి, భూమిని స్వాధీన పర్చుకొని ‘బదిలీ’ చేసిన గిరిజనునికి లేదా అతని వారసులకు అప్పగించాలి. (2) ‘బదిలీ’ చేసిన గిరిజనుడు లేదా అతని వారసులు భూమిని తీసుకొనుటకు అంగీకరించకపోయినా లేదా వారు ఎక్కడ ఉన్నదీ తెలియకపోయినా, లేదా బదిలీ చేసిన వ్యక్తి గిరిజనేతరుడైనా అట్టి భూమిని ప్రభుత్వ భూమిగా గిరిజనులకు, గిరిజన సహకార సంస్థలకు విక్రయించుటగాని, పట్టాపై యిచ్చుగాని చేయచ్చును.

**4. అప్పీలు:**

సెక్షన్ 3(3) ప్రకారము:-సెక్షన్ 3(2) ప్రకారము జారీచేయబడిన తొలగింపు ఉత్తర్వులు (Ejectment Decree) ఏజెన్సీ డివిజినల్ అధికారి లేదా స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (ట్రైబల్ వెల్ఫేర్) జారీ చేసినచో - ఏజంటు (కలెక్టరు వారి) వద్ద, ఏజెంటు (కలెక్టరు) జారీచేసినచో - ప్రభుత్వవు వారి వద్ద ఉత్తర్వుల తేదీ నుండి రెండు మాసములలోగా అప్పీలు చేసుకోవచ్చును.

**5.కుదువ పెట్టుట.**

సెక్షన్ 3ఎ ప్రకారం, ఏ వ్యక్తియైనా తన భూమిని స్వాధీన పర్చకుండా గిరిజన వ్యక్తికి గాని, సహకార సంఘమునకుగాని, భూమి తనఖా బ్యాంకు, స్టేటు బ్యాంకు, ప్రభుత్వ ఆధీనములో పనిచేసే ఆర్థిక సంస్థలకు "కుదవ" పెట్టవచ్చును (Mortgage).

**6.'బదిలీ' దస్తావేజులు రిజిస్ట్రర్:**

సెక్షన్ 3-బి ప్రకారము -బదలీ పొందే వ్యక్తి లేదా సంస్థ తాను గిరిజనుడని, లేదా గిరిజన సహకార సంస్థ అని సబ్ రిజిస్ట్రారు ఎదుట డిక్లరేషను దాఖలు చేయనిదే "బదిలీ" కి సంబంధించిన ఎట్టి దస్తావేజులు రిజిస్టరు చేయరాదు.

**7.గిరిజనులపై దావాలు:**

సెక్షన్ 4 ప్రకారం - గిరిజనులపై దావాలు ఏజెన్సీ పరిధి కలిగిన కోర్టులో మాత్రమే వేయాలి.

**8.గిరిజన భూములజప్తు, వేలం:**

సెక్షన్ 5 ప్రకారం - డిక్రీ బాకీకి, గిరిజనును కుటుంబానికి (జీవనోపాదికి) కావలసిన భూమికంటే ఎక్కువ ఉంటే తప్ప జప్తు చేయడం, వెలం వేయడం చేయరాదు.

**9.ప్రభుత్వాధికారములు:**

సెక్షన్- 6 ప్రకారం:- ప్రభుత్వమువారు ఏజెంటు, ఏజెన్సీ డివిజినల్ అధికారి లేదా స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (ట్రైబల్ వెల్ఫేర్) వారి ఉత్తర్వులను (అందుకు సంబంధమున్న వ్యక్తుల వాదనలు విన్న తరువాత) సవరించవచ్చును.

**10.భూమి బదలాయింపుపై శిక్ష:**

సెక్షన్-6ఎ - ఈ నిబంధనలు అమలులోనికి వచ్చిన తరువాత, నిబంధనలను అతిక్రమించి ఏగిరిజనేతర ఏ వ్యక్తి అయినా భూమిని 'బదిలీ' పొందినా, తొలగింపు ఉత్తర్వులు ((Ejectment Decree) ఇచ్చిన తరువాత భూమిలో తన స్వాధీన భుక్తములు కొనసాగుచున్నా ఒక సంవత్సరం, వరకు జైలు శిక్ష రెండువేల రూపాయిల వరకు జరిమానా లేదా రెండు విధించవచ్చును.

సెక్షన్-6బి - ఈ నిబంధనల ప్రకారం నేరములను "కాగ్నిజిబుల్" నేరములుగా పరిగణించాలి. అనగా వారెంటు లేకుండ అరెస్టు చేయు అధికారము పోలీసు అధికారులకు కలదు.

## 7. ఎ.పి.ఆక్యుపెంట్స్ ఆఫ్ హోమ్ స్టెడ్సు - కన్ఫర్మేంట్ ఆఫ్ ఓనర్‌షిప్ చట్టం 1976

**1. ముఖ్య ఉద్దేశ్యము:**

గ్రామీణ ప్రాంతాలలోని వ్యవసాయ రంగంలో పనిచేసే భూమి లేని రైతుకులీలు, షెడ్యూలు కులాల వారు, బలహీన వర్గాల వారు, చేతి వృత్తుల పనివారు భూస్వాముల పట్టా భూములలో నివాస గృహాలు నిర్మించుకొని నివాసమున్నచో అట్టి స్థళాలనుండి అనుభవదారులను, భూస్వాములు తొలగించకుండ నిరోధించుటకు, అట్టి ఇండ్ల స్థళాలపైన హక్కులను కల్పిస్తూ వారికి తగు రక్షణ కల్పించుటకై ఈ చట్టము రూపొందించబడినది. ఈ చట్టం తే.14-8-1975 నుండి అమలులోనికి వచ్చినది. ఈ చట్టం అమలు చేయుటకు మండల రెవెన్యూ అధికారి "ఆథరైజ్డు ఆఫీసరు" గా వ్యవహరిస్తారు.

**2. నివాస స్థలంపై హక్కు**

ఈ చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం:- పై కేటగిరీ వ్యక్తులు 6-10-1971 నాటికి నివాసము ఏర్పరచుకుంటే భూస్వామి అట్టి వారిని తోలగించరాదు. 6-10-1971 తేది నాటికి ఆ స్థళంలో ఇల్లు కట్టుకొని నివశించుచుండగా ఈ చట్టం అమలులోనికి వచ్చేలోగా భూ స్వామి అట్టి వారిని తొలగించినచో, తొలగింపబడిన అనుభవదారుని పునః ప్రవేశపెట్టి, ఆ స్థళంపై యాజమాన్య హక్కు కల్పించవలసి ఉంది.

సెక్షన్ - 5 ప్రకారం చట్టం అమలు తేదీ నాట్కి నివశించుచున్న లేదా సెక్షన్ 4(3) ప్రకారం పునః ప్రవేశపెట్టబడిన నివాసి ఆ నివాస స్థళమునకు హక్కు దారు అవుతారు. ఐతే నివాసస్థళం విస్తీర్ణం యం. 05 సెంట్లకు మించరాదు. హక్కు పొందిన నివాస స్థలం వంశపారంపర్యముగా అనుభవించాలి. కాని అన్యాక్రాంతచేయరాదు.

**3. హక్కు పొందు విధానము**

సెక్షన్ - 6 ప్రకారం - నివేశ్న స్థళంపై హక్కును పొందగోరు నివాసి రూలు - 3 ప్రకారం ఫారం - 1 లో దరఖాస్తుచేసినచో, లేదా మండల రెవెన్యూ అధికారి తనంతటతాను (Suo-motu) గా రూలు - 4 లోని సూచనల ప్రకారం దర్యాప్తు నిర్వహించి చట్టం అమలులో వచ్చే నాట్కి దరఖాస్తు దారు భూమిలో నివశించుచున్నదీ లేనిదీ, నివశించుచున్నచో ఆక్రమించిన విస్తీర్ణం, ఆ విస్తీర్ణానికి నివాసి చెల్లించవలసిన విలువ శిస్తు రేటు ప్రకారం ఆ విస్తీర్ణానికి లెక్క కట్టిన శిస్తుపై 50 రెట్లు మొత్తం నిర్ధారించి, స్థళం విలువ ఒక్క సారిగా చెల్లించ లేనట్లైతే 15 సంవత్సరాలలో సంవత్సరానికి 1/15 వంతు విలువచోప్పున చెల్లించేలా ఉత్తర్వులు జారీచేయాలి. స్థళం విలువ చెల్లించిన పిదప "ఓనర్‌షిప్" సర్టిఫెకెట్టు జారీ చేయాలి. సర్టిఫికెట్టు ఫారం 2 లో యివ్వాలి.

**4. హక్కుపై వివాదము**

సెక్షను - 7 ప్రకారం: నివాస స్థళం గురించి భూస్వామి - అనుభవ దార్ల మధ్యగల వివాదము లేదా

నివాసి వ్యవసాయ, వ్యవసాయకూలీ లేదా చేతి వృత్తుల పనివారు కారని గాని, నివాస గృహ నిర్మాణ విషయంలో గాని వివాదము ఉన్నచో, అట్టి వివాదముపై మండల రెవెన్యూ అధికారి సమగ్ర విచారణ జరిపి తగు ఉత్తర్వులు జారీచేయాలి.

**5. అప్పీలు:**

భూ స్వామిగాని, నివాసిగాని మండల రెవెన్యూ అధికారివారి తీర్పు, ఉత్తర్వులకు సంతృప్తి చెందనిచో సెక్షన్-8 ప్రకారము ఉత్తర్వులు తేదీ నుండి 60 రోజులలోగా రెవెన్యూ డివిజినల్ అధికారి వద్ద అప్పీలు చేసుకొవచ్చు. అప్పీలు పిటీషనుపై రూ. 2/- ల కోర్టు ఫీజు బిళ్ల అతికించాలి. రెవెన్యూ డివిజినల్ అధికారి రూల్ 7 (5) ప్రకారం అప్పీలు పై విచారణ జరిపి ఉత్తర్వులు జారీచేయాలి.

**6. రివిజను:**

సెక్షను 9 ప్రకారము - అప్పీలు తీర్పుపై భూస్వామి గాని, నివాసిగాని జిల్లా కలెక్టరు వారి వద్ద రివిజను దాఖలు చేసేకోవచ్చు. లేదా కలెక్టరువారు తనంతట తానుగా దిగువ అధికార్ల రికార్డులు పరిశీలించి, తగు విధముగా రివిజను ఉత్తర్వులు జారీ చేయవచ్చును.

**7. సివిలు కోర్టుల పరిధి నుండి మినహాయింపు:**

సెక్షను 11 ప్రకారము- ఈ చట్ట పరిధిలో తీసుకొను చర్యలకు ప్రభుత్వముపైగాని, అమలు చేయు అధికార్లపై గాని, నివాసిపై గాని ఏ సివిల్ కోర్టు ప్రశ్నించు అధికారము లేదు.

## 8. ఆంధ్రప్రదేశ్ ఎస్చీట్స్ మరియు బోనా వేకెంటియా చట్టం 1974

### (క్లైము చేయని మరియు వారసులు లేని ఆస్థి)

న్యాయ పరమైన వారసులు లేని, లేదా క్లైముచేయని స్థిర చరాస్తులు పై చట్ట ప్రకారము ప్రభుత్వమునకు దఖలు పడతాయి.

కావున, వారసులెవరూ లేకుండా ఎవరైనా వ్యక్తి చనిపోతే అతని యొక్క వ్యక్తిగత స్థిర చరాస్తులు (క్లైముదారులు లేనప్పుడు) చనిపోయిన వ్యక్తి వివరములు, అతని యొక్క స్థిర చరాస్తుల వివరములు, ప్రస్తుతము ఎవరి ఆధీనములో ఉన్నవి తెలియ జేస్తూ పంచాయితీ కార్యదర్శి, మండల రెవెన్యూ అధికారి వార్కి నివేదిక పంపాలి.

ఈ చట్టములోని సెక్షన్ 14 ప్రకాము, ఏదైనా బహిరంగ ప్రదేశంలో వస్తువు దొరికితే దాని యజమాని ఎవరో తెలియనప్పుడు, ఎవరికి దొరికిందో ఆవ్యక్తి ఆ వస్తువును పొందడానికి అర్హుడౌతాడు. అతడు ఆవస్తువు అవసరం లేదనుకుంటే సమీప పోలీసు స్టేషనులో స్వయంగాగాని, పంచాయితీ కార్యదర్శి ద్వారాగాని అప్పగించాలి. వెంటనే స్టేషన్ హౌస్ ఆఫీసరు వస్తువు ఎవరి వల్ల అప్పగించబడినది, వస్తువు వివరములు, విలువ తెలియజేస్తూ పరిధిగల జుడీషియల్ మెటిస్ట్రేటు వార్కి నివేదిక పంపుతారు. ఆ వస్తువుకు సంబంధించిన యజమాని క్లైమెంటు ఉన్నచో, విచారణ జరిపి, అతనిని యజమానిగా గుర్తిస్తే వస్తువును అతనికి అప్పగించాలి.

ఈ చట్టములోని సెక్షన్ 3 ప్రకారము క్లైముచేయని లేదా వారసులు లేనట్టి చనిపోయిన వ్యక్తి యొక్క స్థిరచరాస్తులు రాష్ట్రప్రభుత్వానికి చెందుతాయి. ఆ విధంగా దాఖలుపడిన ఆస్థులు సాధారణంగా ప్రధాన భూ పరిపాలన కమీషనరు (కాంపిటెంటు ఆధారిటీ) ఆధీనంలో వుంటాయి. (సెక్షన్4)

సెక్షన్ 5(1) మరియు (2) అనుసరించి జి.ఒ.యమ్.ఎన్.నెం.1426 రెవిన్యూ తేది-31-10-1977ఉత్తర్వు ల ప్రకారం జిల్లా పరిధిలో జాయింటు కలెక్టరు "లోకల్ ఆఫీసరు" గాను మండల పరిధిలో మండల రెవిన్యూ అధికారి "సహాయ అధికారి" గాను వ్యవహరిస్తారు.

క్లైమ్ చేయని, వారసులులేని ఆస్థి హక్కు, అధికారము లేని వ్యక్తి ఆధీనములో వుండి, అతడు లోకల్ ఆఫీసరుకొరిన వెంటనే ఆస్థిని అప్పగించుటకు నిరాకరిస్తే సెక్షన్ 8 ప్రకారం పరిధి కలిగిన సివిల్ కోర్టులో ఆస్థి స్వాధీనం చేయించవలసినదిగా కొరుచూ దావా వేయాలి. కోర్టు సదరు ఆస్థి బేవార్సు ఆస్థిగా గుర్తించి, స్వాధీనంపొందుటకు ఉత్తర్వుచేస్తే, లోకల్ ఆఫీసరు ఆఆస్థిని స్వాధీనపర్చుకోవాలి.

సహాయ అధికారి నివేదిక అందిన వెంటనే అట్టి ఆస్థి గురించి కాంపిటెంటు అధారిటీ అయిన ప్రధాన భూ పరిపాలన కమీషనరు ఫారం 1 లో "లోకల్ ఆఫీసరు" (జాయింటు కలెక్టరు) నివేదిక పంపాలి. వారసులు లేనట్టి, క్లైమ్‌చేయనట్టి ఆస్థి గురించి క్లైమెంట్సు ఎవరైనా ఉంటే 3 నెలలలోగా క్లైమ్ చేసుకోవలసినదిగా లోకల్ ఆఫీసరు ఫారం 2 లో నోటీసు జారీచేయాలి. (సెక్షన్ 7 మరియు 16) క్లైము దారు లేకుంటే "క్లైముచేయని/ వారసులు లేని బేవార్సు ఆస్థి"గా డిక్లేరుచేయాలి. క్లైమెంటు క్లైము ఫారం 3 లో దాఖలు చేస్తే

అట్టి క్లైమును పరిధి కలిగిన సివిల్ కోర్టుకు సెక్షన్ 11-(3)(ఎ) క్రింద రిఫర్ చెయ్యాలి. కోర్టు క్లైమెంటు వాదన, లోకల్ ఆఫీసరు వాదన విన్న పిదప, క్లైమెంటు తాను వారసుడు, హక్కు దారుడనని ఋజువు చేసుకుంటే, అట్టి ఆస్థిని క్లైమెంటుకు అప్పగించుటకు ఉత్తర్వులు జారీ చేయాలి. సెక్షన్ 11-(3) (బి) ప్రకారం, క్లైము ఋజువు కానిచో "క్లైము ఋజువుకాని, వారసులు లేని బేవార్సు ఆస్థి" గా డిక్లేరు చేయాలి.

ఫారం-2 నోటీసు కలెక్టరు కార్యాలయంలోను మండల రెవెన్యూ కార్యాలయంలోను, గ్రామ పంచాయితీలోను ప్రచురించి, గ్రామంలో దండోరా మూలముగా ప్రకటన చేయించాలి.

ఆ విధంగా సెక్షన్ 11-(2) లేదా 11-3 (బి) ప్రకారము డిక్లేరు చేసిన బేవార్సు ఆస్థి గురించి ఆంధ్రప్రదేశ్ గెజిట్‌లోను స్థానిక దిన పత్రికలోను ప్రకటన (Notification) చేయించాలి. నోటిఫికేషను వివరములు గ్రామంలో కూడ సెక్షన్12 ప్రకారం ప్రకటింపజేయాలి.

బేవార్సు ఆస్థి స్థిరాస్థి అయినచో సెక్షన్ 13 ప్రకారము Notification ప్రకటించిన 12 సంవత్సరముల వరకు వేలం వేయరాదు/క్రియ పర్చరాదు.

ప్రభుత్వ ఆధీనములో ఉన్న బేవార్సు ఆస్థిని సెక్షన్ 6లో గల పరిమితులకు లోబడి లోకల్ ఆఫీసరు సెక్షన్ 10 ప్రకారం ఆస్థి విషయంలో 5 పెద్ద మనుష్యులతో "ఫంచనామా" నిర్వహించి ఆస్థి వివరములు, విలువలతో కూగిన నివేదిక తయారుచేసి కాంపిటెంటు అధారిటీ (రెవెన్యూ బోర్డు)కి పంపాలి. స్థిరాస్థి విషయంలో ఆ ఆస్థిని శాశ్వితంగా పరిష్కరించే పర్యంతం కౌలు హక్కులు లీజుకు యివ్వాలి. బేవార్సు ఆస్థి స్థిరాస్థి కాకుండ నశించే స్వభావంగల (Perishable) ఆస్థి అయినచో అట్టి ఆస్థిని వెంటనే వేలంవేయించి, పాట ఖాయపరచి, సొమ్ము వసూలు చేసి డిపోజిట్టులో ఉంచాలి. ఇట్టి ఆస్థి విషయంలో వెంటనే కాంపిటెంటు ఆధారిటీకి నివేదికపంపాలి. ఆస్థి చరాస్తి అయినచో దాని విలువ రూ- 50/-లు మించనిచో అట్టి ఆస్థిని వేలంద్వారా విక్రయించి, సొమ్ము డిపోజిట్ చేయాలి.

సెక్షన్ 6 ప్రకారు క్లైము చేయని/వారసులు లేని (బేవార్సు) ఆస్థి.

1.విలువతో సంబంధం లేకుండ ప్రభుత్వమువారు

2.విలువ రూ.10,000/-లు మించనిచో కాంపిటెంటు అధారిటీ.

3.విలువ రూ,2,000/-లు మించనిచో లోకల్ ఆఫీసరు (జిల్లా జాయింటు కలెక్టరు)

పై పరిమితులకు లోబడి పరిష్కరించవచ్చును.

# 9. ఆంధ్రప్రదేశ్ రైట్సు ఇన్ లాండ్ మరియు పట్టాదార్ పాస్ బుక్కు చట్టం 1971

**(సవరణచట్టములు ఆక్టు 11/80, 1/89 24/89 9/94 మరియు 16/2001)**

**1.ముఖ్యోద్దేశ్యము - ప్రాముఖ్యత:**

గ్రామ రెవెన్యూ రికార్డులు అవసరం లేకుండా రైతులకు ఋణసదుపాయములు చేకూర్చుటకు ప్రభుత్వేతర భూములు, హార్టి కల్చర్ భూములకు సంబంధించిన హక్కు దారుల వివరాలను తయారుచేసి, వాటిని ఎప్పటి కప్పుడు సరిచేసి/ తాజా పరచి, వాటి ఆధారంగా పట్టాదారు పాసుపుస్తకాలను జారీచేయు విధానము ఈ చట్టంలో నిర్వచించబడినది. ఈ చట్టం సమగ్రముగా తయారు కాబడి తే09.6.1989 దీ నుండి కార్యరూపందాల్చినది. ఈ చట్టపరిధిలో ప్రతి గ్రామంలో హక్కుల రికార్డులను తయారుచేసి, సెక్షన్ 3 ప్రకారం హక్కుదారులకు పట్టాదారు పాసుపుస్తకాలను, టైటిల్‌డీడ్ (హక్కు పత్రాలు)లను రైతులకు యివ్వడం జరిగింది.

2. రూలు 15(3) ప్రకారం సెక్షన్3(3) ప్రకారం హక్కుల రికార్డు ఫైనలైజ్ చేసిన సంవత్సరంలోగా రికార్డులో గల తప్పులను సవరించవచ్చు.

**3.హక్కుల రికార్డు కొనసాగించుప్రక్రియ:**

చట్టంలోని 5వ సెక్షన్ ప్రకారం, హక్కుల రికార్డులు ఎప్పటికప్పుడు తాజా పరుస్తూ, మారిన పరిస్థితులు, హక్కుల దృష్ట్యా సరిచేసి కొత్తగా హక్కులు సంక్రమించిన హక్కు దారుల వివరాలను రికార్డులలో నమోదుచేయవలసి ఉంటుంది. ఈ నిర్వహణ విధానము నిరంతరాయం కొనసాగే ప్రక్రియ మార్పులకు దారితీసే పరిస్థితులు.

1.పట్టాదారు మృతిచెందినచో - వారసత్వరీత్యా హక్కుదారులు

2.జాయింటు పట్టాల విభజనవల్ల

3.సమిష్టి హక్కుదారులు - వేరుపడుటవల్ల - విభజన

4.ఇనాముల రద్దు చట్టం ప్రకారం జారీకాబడిన రైత్వారీ పట్టా హక్కుల ధృవీకరణ పత్రం

5.కౌలు చట్టంలోని సెక్షన్ 38 క్రింద జారీ చేయబడిన ధృవీకరణ పత్రం

6.భూమి లేని పేదలకు డి-ఫారం పట్టా జారీచేయుటవల్ల

7.రిజిష్టర్డు విల్లులు, విక్రయ పత్రాలు ద్వారా ఆస్తుల బదిలీ

8.దాన పత్రములు

9.కోర్టు డిక్రీ

10.భూసేకరణ జరిగిన సందర్భములో

సెక్షన్ 3 ప్రకారం రాష్ట్రంలో అన్ని గ్రామాలలో హక్కుల రికార్డులు తయారుచేయడం జరిగింది. వాటి ఆధారంతో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు, హక్కుల పత్రం (టైటిల్ డీడ్)లు చాల వరకు జారీ కాబడ్డాయి. ఐతే దర్మిలా సంభవించే భూ యాజమాన్య మార్పుల ప్రకారం హక్కుల రికార్డులలో మార్పుచేస్తూ తాజా పర్చుకుంటూ ఉండాలి. పైన తెల్పిన పరిస్థితుల దృష్ట్యా, హక్కులు సంక్రమించిన వ్యక్తి చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం హక్కులు సంక్రమించిన 90 రోజులలోగా ఫారం 6-ఎలో మండల రెవెన్యూ అధికారి వార్కి తెలియజేస్తూ, హక్కులు ఏ విధంగా సంక్రమించాయో తెలిపే డాక్యుమెంట్ల యొక్క నకలు, తనకు గల పట్టాదారు పాసుపుస్తకం, టైటిల్ డీడ్, హక్కులు కోల్పోయిన పట్టా దారు యొక్క పట్టాదారు పాసుపుస్తకం, టైటిల్ డీడ్ జతపర్చాలి. హక్కులు సంక్రమించిన వ్యక్తికి ఆ భూమి తప్ప గతంలో భూమి లేని కారణంగా పట్టాదారు పాసుపుస్తకం, టైటిల్ డీడ్ యిచ్చి ఉండకపోతే 3 పాసు పోర్టు సైజు ఫోటోలు జతపర్చాలి.

సెక్షన్ 4 ప్రకారము హక్కులు సంక్రమించిన వ్యక్తి నుండి ఫారం-6-ఎలో ఇంటిమేషను అందిన తరువాత సెక్షన్ 5 లో నిర్ధేశించిన విధముగా మండల రెవెన్యూ అధికారి దర్యాప్తు చేసి, హక్కుల రికార్డులలోను పట్టాదారు పాసుపుస్తకములలో తగు మార్పులుచేయుటకు ఆదేశించాలి. మార్పులు చేయుటకు తిరస్కరించు సందర్భములో హక్కులు సంక్రమించినట్లు తెలియజేస్తూ ఫారం 6-ఎ దాఖలుచేసిన వ్యక్తికి, మార్పుల వల్ల హక్కులకు భంగం వాటిల్లే యితర పట్టాదార్లకు తగు అవకాశం కలుగజేసి, వారి వాదనలు, రుజువుల, సాక్ష్యాలు పరిశీలించిన తరువాత మాత్రమే తిరస్కరిస్తూ ఉత్తర్వులు జారీ చేయవచ్చు. మండల రెవెన్యూ అధికారి వారి ఉత్తవ్వులకు సంతృప్తి చెందనిచో ఉత్తర్వులు అందిన 60 రోజులలోపు రెవెన్యూ డివిజినల్ అధికారి వద్ద అప్పీలు చేసుకోవచ్చును.

### 4.రిజిష్టరు కాని క్రయ దస్తా వేజుల క్రమబద్ధీకరణ:

సెక్షన్ 5-ఎ ప్రకారం రిజిష్టరు కాని క్రయ దస్తా వేజు ప్రకారం అనుభవించుచున్న కొనుగోలు దారు స్టాంపు డ్యూటీ మరియు రిజిస్ట్రేషను ఫీజు మండల రెవెన్యూ అధికారి వద్ద డిపోజిట్టు చేసినచో సెక్షన్ 5-(4) ప్రకారం అట్టి క్రయాన్ని క్రమబద్ధీకరిస్తూ సర్టిఫికెట్టు జారీచేస్తారు.

సెక్షన్ 6 ప్రకారం: సెక్షన్ 3 ప్రకారం తయారు చేయబడిన హక్కుల రికార్డులోని వివరములు, తప్పని లేదా సక్రమముగా లేవని నిరూపణ అయ్యే వఱకు, సక్రమమైనవనే భావించాలి.

తాజాపర్చిన హక్కుల రికార్డుల ననుసరించి, పట్టాదారు పాసుపుస్తకములలో హక్కు బదిలీ చేసిన వ్యక్తి పట్టా దారు పాసుపుస్తకం, టైటిల్ డీడ్‌లలో తొలగించి లేదా తగ్గించి, బదిలీ పొందినవ్యక్తి యొక్క పట్టాదారు పాసుపుస్తకములోను, టైటిల్ డీడ్‌లోను చేర్చాలి. రిమార్కుల కాలంలో మండల రెవెన్యూ అధికారి ఉత్తర్వులను పొందుపరచాలి.

**5.డూప్లికేటు పాసు బుక్కులు, టైటిల్ డీడ్సు పొందు విధానం:**

1.రూల్31 (1) ప్రకారం పట్టాదారు తన పాసుపుస్తకం జారవిడుచుకున్నా, లేదా తన పాసు పుస్తకంలోగల వివరములు లేకుండా పోయినా, మండల రెవెన్యూ అధికారి వార్కి డూప్లికేటు పట్టాదారు పాసుపుస్తకం కొరకు అర్జీ దాఖలు చేస్తూ, రూ. 15/-లు రుసుము చెల్లించి, 3 పాసు పోర్టు సైజు ఫోటోలు జతచేయాలి. తన వద్దగల వినియోగించుటకు వీలుగాని పట్టాదారు పాసు పుస్తకం (తడిసి నందువల్ల, కాలినందువల్ల లేదా చెదలు పట్టి నందువల్ల) మండల రెవెన్యూ అధికారి వార్కి రద్దు పరచుటకు/ తగుల పెట్టుట కొరకు సరెండరు చేయాలి. మండల రెవెన్యూ అధికారి డూప్లికేటు పట్టాదారు పాసుపుస్తకం తయారుచేసి, తన సంతకం చేసి, సీలువేసి యిస్తారు.

2.రూల్ 31(2) ప్రకారం పట్టాదారు తన వద్దగల టైటిల్ డీడ్ తడిసి నందువల్ల, కాలినందువల్ల, లేదా చెదలు పట్టడంవల్ల అందుండే వివరములు లేకపోయి నిరపయోగమైనచో, అట్టి పుస్తకాన్ని సరెండరు చేస్తూ రూ.100/- లు చెలానాతో రెవెన్యూ డివిజినల్ అధికారి వార్కి దరఖాస్తు చేయాలి. అందుపై డూప్లికేటు టైటిల్ డీడ్ తయారు చేయుటకు ఉత్తర్వులు చేస్తారు. అట్టి ఉత్తర్వుల ప్రకారము మండల రెవెన్యూ అధికారి డూప్లికేటు టైటిల్ డీడ్ తయారు చేసి, అందుపై రెవెన్యూ డివిజిన్ అధికారి వారి ఆమోదం, సీలు పొంది, పట్టాదారుకు అందజేస్తారు.

సరెండరుచేసిన టైటిల్ డీడ్ కేన్సిల్ చేసి, పట్టా దారు ఎదురుగా రెవెన్యూ డివిజినల్ అధికారి తగుల బెట్టించాలి.

3.టైటిల్ డీడ్ జారవిడుచుకున్నచో (పోయినచో) తక్షణం పట్టాదారు పోలీసు స్టేషనుకు, రెవెన్యూ డివిజినల్ అధికారి, మండల రెవెన్యూ అధికార్లకు పరిధి కలిగిన క్రెడిట్ ఏజెన్సీలకు (బ్యాంకు/ పి.ఎ.సి.ఎస్ మొదలైనవి) లిఖిత పూర్వకంగా తెలియజేసి, తెలియజేసినట్లు ఎకనాలెడ్జిమెంట్లు పొందాలి. అలాగే టైటిల్ డీడ్ పోయినట్లు స్థానిక దిన పత్రికలో ప్రకటన చేయించి, "ప్రకటన" క్లిప్పింగు జాగ్రత్త పరచాలి. డూప్లికేటు టైటిల్ డీడ్ పొందుటకై రూ.1000/- వెయ్యి రూపాయిలు చలానా కట్టి, చలానా, పై అధికార్ల టైటిల్ డీడ్ పోయిన విషయం తెలియజేసినట్లు పొందిన ఎకనాలెడ్జి మెంట్లు, ప్రకటన క్లిప్పింగు జతపర్చి డూప్లికేటు టైటిల్ డీడ్ జారీచేయవలసినదిగా కోరుచూ చేసేదరఖాస్తుతో జతపర్చి, 2పాసుపోర్టు సైజు ఫొటోలతో రెవెన్యూ డివిజినల్ అధికారి వారి వద్ద దాఖలు చేయాలి. వారి ఎదురుగా పట్టాదారు రూ- 100/- లు విలువగల నాన్‌జ్యుడీషియల్ స్టాంపుపై ఇన్ డెమినిటీ బాండు (పోయిన టైటిల్ డీడ్ ఆధారంతో చేసిన ఋణాల విషయంలో ప్రభుత్వానికి, క్రెడిట్ ఏజెన్సీలకు కలిగే నష్టంకు తాను బాధ్యత వహిస్తానని, దర్మిలా పోయిన టైటిల్ డీడ్ దొరికితే దుర్వినియోగ పర్చకుండ ప్రభుత్వానికి సరెండరుచేస్తానని హామీ పత్రం) వ్రాసియివ్వాలి. పై విధంగా పట్టాదారు రూలు 31(2) ప్రకారం నిర్వహించ వలసిన

విధులు రెవెన్యూ డివిజినల్ అధికారి వారి సంతృప్తి మేరకు నిర్వహించినచో, రెవెన్యూ డివిజినల్ అధికారి వారు డూప్లికేటు టైటిల్ డీడ్ తయారుచేసి ఆమోదమునకు పంపవలసినదిగా మండల రెవెన్యూ అధికారి వార్కి ఉత్తర్వులు ఇస్తారు. అట్టి ఉత్తర్వుల ప్రకారం మండల రెవెన్యూ అధికారి టైటిల్ డీడ్ డూప్లికేటు తయారు చేసి, అందుపై ఎర్రసిరాతో "డూప్లికేటు" అనివ్రాసి, 1 B రిజిస్టరులో కూడ డూప్లికేటు టైటిల్ డీడ్ నెంబరు నమోదుచేసి, రెవెన్యూ డివిజినల్ అధికారి వారి ఆమోదము, సీలు పొంది, డూప్లికేటు టైటిల్ డీడ్ పట్టా దారుకు నె.17 రు రిజిస్టరులో సంతకం చేయించుకొని అందజేస్తారు.

**6.సెక్షన్ 9 ప్ర కారం:**

కలెక్టరు వారు దరఖాస్తు పై గాని తనంతట తానుగాగాని మండల రెవెన్యూ అధికారి, రెవెన్యూ డివిజనలు అధికారి లేదా, యితర దిగువ అధికార్లు ఫైల్సు హక్కుల రికార్డులు తెప్పించి, పరిశీలించి, చట్ట పరంగాను సక్రమంగాను లేనిచో, దిగువ అధికార్ల ఉత్తర్వులను రద్దు పర్చుట, మార్పు చేయుట లేదా పునర్విచారణకు ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేయ వచ్చును.

**7.హక్కు పత్రములు:**

I. <u>విధిగా రిజిస్టరు చేయించవలసినవి.</u>

1. దాన పట్టా (Gift Deed)
2. హక్కు బదిలీ(Trasfer of Title in Land)
3. లీజు పట్టా(Lease of Immovable Property)
4. డిక్రీ ప్రకారం హక్కులు సంక్రమించిన సందర్భములో(Transfer on account of a decree of a court or any award)

II. <u>రిజిస్టరు చేయనవసరం లేనివి,</u>

1. విల్లు (Will)
2. వార సత్వ రీత్యా హక్కు సంక్రమించిన సందర్భములో(Succession by heirship)
3. వాటాల జాబితా (స్టాంపులపై వ్రాసి ఉండాలి)(Partition Deed need not be registered but sufficiently stamped)
4. డి-ఫారం పట్టా (D.Form Patta for assigned Land)

## 10. ఆంధ్రప్రదేశ్ భూ సంస్కరణలు (వ్యవసాయ కమతాలపై గరిష్ట పరిమితి) చట్టం 1973

### 1.ఉద్దేశ్యము:

వ్యవసాయ కమతాలపై గరిష్ట పరిమితి నిర్ణయించి, గరిష్ట పరిమితికి మించియున్న మిగులు భూమిని ప్రభుత్వము స్వాధీన పర్చుకొని అట్టి భూమిని భూమిలేని నిరుపేదలకు సాగుకుగాని, నివాసస్థలములుగా గాని మంజూరు చేసి వారియొక్క సాంఘిక మరియు ఆర్థిక స్థితిని మెరుగు పరిచే ఉద్దేశ్యంతో ఈ చట్టం చేయబడింది. ఈ చట్టం 01-01-1973 తేది నుండి అమలులోనికి వచ్చినది.

### 2. కుటుంబము నిర్వచనము:

ఈ చట్ట ప్రకారం (1) కుటుంబం (Sec 3(6) అనగా భార్య, భర్త ముగ్గురు మైనర్లు గల కుటుంబం, (2) వివాహము కాని మేజరు కుమారుడు, (3)భర్త చనిపోయిన కోడలు ఆమె మైనర్లు, (4) వివాహమైన మేజరు 1 మైనరు కుమార్డు, అతని భార్య, వారి మైనర్లు గల ఒక్కొక్క కుటుంబమునకు సెక్షన్ 5 ప్రకారము ప్రామాణికా కమతములకు అర్హత ఉంటుంది. వివాహమైన కుమార్తెలు (మైనరైనా, మేజరైనా) కుటుంబములోని సభ్యులుగా పరిగణింపబడరు.

### 3. ప్రామాణిక కమతములు వర్గీకరణ:

ప్రామాణికములను తరం, భూసార వర్గీకరణ, సాగునీటి సౌకర్యాల అందుబాటు, భూమిని వినియోగించే విధానం ఆధారంగా (సీలింగు యూనిట్‌లు) నిర్ణయించడం జరిగి (చట్టంలో సెక్షన్-5 లో) పల్లపునేలను ఒక పంట పల్లపునేల, రెండు పంటల పల్లపు నేలలుగా వర్గీకరించబడి ఒక్కొక్క రకం పల్లపునేల ఆరు తరగతులుగా విభజింపబడినవి. అట్లే మెట్టనేల 5 తరగతులుగా విభజింపబడినది. ఈ దిగువ ప్రామాణిక కమత విస్తీర్ణములను గమనించదగును.

పంటనేల తరగతి ప్రామాణిక కమతము యొక్క పరిమాణము (విస్తీర్ణము)

| పల్లపునేల (వెట్) | రెండు పంటల పల్ల (తర) పు నేల | | ఒక పంట పల్ల (తర) పు నేల | |
|---|---|---|---|---|
| | హెక్టార్లు | ఎకరములు | హెక్టార్లు | ఎకరములు |
| ఎ తరగతి | 4.05 | 10.00 | 6.07 | 15.00 |
| బి తరగతి | 4.86 | 12.00 | 7.28 | 18.00 |
| సి తరగతి | 5.46 | 13.50 | 8.09 | 20.00 |
| డి తరగతి | 6.07 | 15.00 | 9.11 | 22.50 |
| ఇ తరగతి | 6.68 | 16.50 | 10.12 | 25.00 |
| ఎఫ్ తరగతి | 7.28 | 18.00 | 10.93 | 27.00 |

| మెట్ట (ఖుష్కి) నేల | హెక్టార్లు | ఎకరములు | |
|---|---|---|---|
| జి. తరగతి | 14.16 | 35.00 | ఒక మనిషికి భిన్న తరగతులు పంటనేలలు ఉన్నచో, కమతము గణించునపుడు ఆయా తరగతుల సరైన ప్రామాణికాకమతముల విస్తీర్ణముల సాపేక్ష నిష్పత్తిలో గుణించగా వచ్చిన నిష్పత్తుల మొత్తం ఆ కుటుంబ యూనిట్ యొక్క పరిమిత విస్తీర్ణమునకనుగుణమగు కమతముగా పరిగణించవలెను. |
| హెచ్.తరగతి | 16.19 | 40.00 | |
| ఐ.తరగతి | 18.21 | 45.00 | |
| జె.తరగతి | 20.23 | 50.00 | |
| కె.తరగతి | 21.85 | 54.00 | |

**4. ఐదుగురు సభ్యులకు మించేయున్న కుటుంబ ప్రామాణిక కమతము:**

సెక్షన్ 4 ప్రకారం 5 సభ్యులు (భార్య భర్త, ముగ్గురు మైనరు పిల్లలు) గల కుటుంబమును ఒక యూనిట్‌గా పరిగణించాలి. ముగ్గురు మైనర్ల కంటే ఎక్కువుగా ఉన్న ప్రతిమైనరుకు 1/5 వంతు ప్రామాణికా కమతము చొప్పున కలుపుచూ, రెండు యూనిట్లకు కుదించవలెను (మాగ్జిమమ్ 2 యూనిట్లు) పై రెండవ పేరాలో తెలియజేసిన కుటుంబములకు ఒక్కొక్క యూనిట్ చోప్పున కమతములు కలిగియుండవచ్చును.

**5. డిక్లరేషను దాఖలు:**

పై పరిధులను దృష్టిలో ఉంచుకొని, భూస్వామి తనకుగల భూ కమతముల వివరములతో సెక్షన్ 8 ప్రకారం డిక్లరేషను భూ సంస్కరణల ట్రిబ్యునల్ లేదా రెవెన్యూ డివిజినల్ అధికారి (ప్రిసైడింగ్ అధికారి) వద్ద దాఖలుచేయాలి.

**6. డిక్లరేషను పై విచారణ:**

డిక్లరేషను చేరిన పిదప ట్రిబ్యునల్ వారు సెక్షన్ 9 ప్రకారము డిక్లరేషను లో గల కమతముల వివరములు ప్రకటించి, వాటి వినియోగముపై సమగ్ర విచారణ జరిపి అట్టి భూస్వామి సీలింగు పరిమితికి మించి కలిగియున్న భూమిని నిర్ధారించాలి.

**7. మిగులు భూమిని స్వాధీనపరు చుకొనుట:**

సీలింగు భూస్వామి సెక్షన్ 10 ప్రకారం ప్రభుత్వానికి (మిగులు భూమిని) అప్పగించాలి. అప్పగించదలచుకున్న మిగులు భూమి వివరములు ట్రిబ్యునల్‌కు అందజేయక పోయినా, అందజేసిన వివరములు పరిశీలించిన మీదట అట్టి భూమి సాగుకుగాని, నివాసమునకుగాని యోగ్యము కాదని తలచినా, ట్రిబ్యునలు తనంతటతానుగా మిగులు భూమిని ఎంపికచేసి, ఆ భూమిని సరెండరు చేయవలసినదిగా డిక్లరెంటుకు తెలియపర్చ వచ్చును. సరెండరు చేసిన లేదా ఎంపిక చేసిన మిగులు భూమి వివరములతో

మిగులు భూమిని ప్రకటించాలి. సెక్షన్ 11 ప్రకారం మిగులు భూమిని రెవెన్యూ డివిజినల్ అధికారి (ట్రిబ్యునలు) స్వాధీనపర్చుకోవాలి లేదా స్వాధీన పర్చుకొనుటకు మండల రెవెన్యూ అధికారి వార్కి ఉత్తర్వులు యివ్వవచ్చును.

**8. మిగులు భూములకు సొమ్ము చెల్లింపు:**

సెక్షన్ 15 ప్రకారము స్వాధీనపర్చుకొన్న భూములకు ఈ క్రింది (రెండవ షెడ్యూలు) విధంగా విలువ కట్టి సరండరుచేసిన డిక్లరేంటుకు సొమ్మును రొఖ్ఖ రూపంలోగాని బాండ్ల రూపంలోగాని యివ్వడం జరుగుతుంది.

| స్వాధీనం పొందిన భూమి యొక్క (యక్రి) శిస్తు రేటు ఈ క్రింది విధంగా ఉంటే య 1 కి | ఎన్ని రెట్ల భూమి శిస్తు భూమి విలువగా నిర్ధారించబడుతుది య 1 కి | ఈ దిగివ మొత్తానికి తక్కువ కాకుండ య 1 కి ఎంతైతే అంత |
|---|---|---|
| ఎ) రూ. 50/- అయినచో | 100 రెట్లు | రూ.5,000/- |
| బి) రూ. 50/- లు రూ.150/- మధ్య | 50 రెట్లు | రూ.7,500/- |
| సి) రూ. 150/- లు రూ.500/- మధ్య | 20 రెట్లు | రూ.10,000/- |

పై విలువతోబాటు రూలు 11 ప్రకారం చెట్లకు, కట్టడములకు నిర్ణయించిన విలువకూడ చెల్లించడం జరుగుతుంది. సెక్షన్ 16 ప్రకారం డిక్లరంటుతో బాటు మిగులు భూమి విలువను పొందే హక్కు గల వారిని నిర్ధారించి, వారికిగల హక్కుల ప్రకారం విలువను విభజించి, చెల్లించాలి.

**9. అప్పీలు:**

సెక్షన్ 20 ప్రకారము ట్రిబ్యునల్/రెవెన్యూ డివిజినల్ అధికారి ఉత్తర్వులకు సంతృప్తి చెందనిచో అట్టి ఉత్తర్వులపై 30 రోజులలోగా అప్పిలేట్టు ట్రిబ్యునల్‌లో అప్పీలు దాఖలు చేసుకోవచ్చు. ప్రభుత్వం తరపున ఆథరైజ్డు ఆఫీసరు కూడ అప్పీలుకు వెళ్లవచ్చు, (రూలు - 15)

**10. రివిజను:**

సెక్షన్ 21 ప్రకారము వ్యక్తి గాని ప్రభుత్వముగాని అప్పిలేట్ ట్రిబ్యునల్ ఉత్తర్వులకు సంతృప్తి చెందనిచో అట్టి ఉత్తర్వులపై 90 రోజులలోగా (రూల్17) హైకోర్టులో రివిజన్ను ఫైలు చేయవచ్చు. (రూలు17)

**11. మిగులు భూమి పంపిణీ:**

సెక్షన్ 14 ప్రకారం: ప్రభుత్వం స్వాదీన పరచుకొన్న మిగులు భూమిని వ్యవసాయ కూలీలకు, వృత్తి పనివారలకు, భూమి లేని పేదలకు, బడుగు బలహీన వర్గాల వారికి సాగుకుగాని, ఇండ్ల స్థలములుకుగాని కేటాయించాలి. మిగులు భూమిలో కనీసం సగం భూమి షెడ్యూలు కులములు, షెడ్యూలు తెగల వార్కి,

మిగతా సగంలో కనీసం 2/3 వవంతు వెనుకబడిన తరగతుల వార్కి మిగతా 1/3వంతు ఇతర భూమి లేని పేదలకు కేటాయించాలి.  ఏజెన్సీ ఏరియా (షెడ్యూల్డు ఏరియా) లో స్వాదీన పర్చుకొన్న మిగులు భూమిని పూర్తిగా గిరిజనులకే కేటాయించాలి.

## 12. <u>లబ్ధిదార్లు చెల్లించవలసిన సొమ్ము, నిబంధనలు:</u>

కేటాయింపు పొందిన లబ్దిదారు కేటాయించిన భూమిపై చెల్లించదగు భూమిశిస్తుకు 50 రెట్ల సొమ్ము (చెల్లు, కట్టడముల విలువతో కలిపి) భూమి విలువగా ప్రభుత్వానికి ఒక్క సారిగాగాని, 15 సంవత్సరములలో సమాన సాలీనా వాయిదాలలో గాని చెల్లించాలి.

మిగులు భూమిని పొందిన లబ్దిదారు అట్టి భూమిని వంశ  పారంపర్యముగా అనుభవించ వలసినదేగాని, అన్యాక్రాంతము  చేయరాదు.

భూమి విలువ చెల్లించక పోయినా, కేటాయింపు షరతులను ఉల్లంఘించినా లబ్దిదారు కేటాయింపు పొందిన భూమిని కోల్పోతాడు. రెవెన్యూ డివిజినల్ అధికారి అట్టి భూమిని రెజ్యూమ్ చేయాలి.

## 11. ఆంధ్రప్రదేశ్ (ఆంధ్రప్రాంతం) కౌలుదారిచట్టము 1956

**1. ముఖ్యఉద్దేశ్యము:-**

కౌలుదారుల హక్కులకు రక్షణ కల్పించు ఉద్దేశ్యముతో ఈ చట్టము, రూపొందించబడినది. కౌలు దారి హక్కులకు సంబంధించి మన రాష్ట్రములో రెండు శాసనములు కలవు. ఆంధ్రప్రాంతములోని కౌలుదారులకు సంబంధించి ఒక శాసనము, తెలంగాణా ప్రాంతములోని కౌలు దారులకు సంబంధించి మరొక శాసనముకలవు.

1. కౌలు దారుని అక్రమమగా తోలగించకుండా రక్షణ
2. హేతుబద్ధమైన కౌలు నిర్ధారించుట.
3. కౌలు ఒప్పందము కనీస కౌలు వ్యవధి నిర్ధేశింపబడుట.
4. యజమాని తన కౌలు భూమి విక్రయించదలచినప్పుడు, కౌలుదారునకు ప్రథమ హక్కుకల్పించుట.

**2. నిర్వచనములు:-**

**వ్యవసాయసంత్సరము:-** జూన్ 1వ తేదీతో ప్రాంరంభమై మరుసటి సంవత్సరము మే నెల 31వ తేదీతో అంతమగు 12 నెలల కాలవ్యవధి వ్యవసాయం సంవత్సరముగా పరిగణించబడుతుంది.

**వ్యవసాయదారులు:-** ఎవరైన భూ స్వామికి చెందిన భూమిని కౌలుకు తీసుకుని తాను స్వయముగా లేక తన కుటుంబ సభ్యుల సహకారముతో వ్యవసాయము చేయుచున్నట్లయితే ఆ వ్యక్తి వ్యవసాయదారుడు లేక కౌలుదారు అవుతాడు.

**స్పెషల్ ఆఫీసర్:-** డిస్ట్రిక్టు మునిసిఫ్ హోదా తగ్గకుండా వున్న న్యాయాధికారి (1-7-1980కు ముందు తాహసీలుదారు స్పెషల్ ఆఫీసరుగా వుండేవారు).

**3. కౌలు విధానము:-**

నీటి పారుదల ద్వార పండు పంటల విషయములో గరిష్ట కౌలు 30 శాతం, యితర భూములలో పండు పంట విషయములో మొత్తం పంటలో గరిష్ట కౌలు 25 శాతం వ్యవసాయ ఖర్చులన్నింటినీ కౌలు దారు భరించవలెను. పన్నులు వగైరా యజమాని భరించవలెను. కౌలు ధాన్యరూపములో కాని లేక రొక్కము రూపములో గాని ప్రతి సంవత్సరము ఇరువురు అంగీకరించిన ప్రకారం కౌలు దారు యజమానికి చెల్లించవలెను.

కౌలు కాల వ్యవధి ఆ సంవత్సరములు తదుపరి కౌలు పొడిగించుకొనవచ్చును. అట్టి పొడిగించిన గరిష్ట కాలవ్యవధి కూడ 6 సంవత్సరములు.

కౌలు భూములపై కౌలుదారుడు ఎప్పటికప్పుడు ప్రభుత్వం నిర్ధేశించిన విధముగా వడ్డీ కౌలు దారుడు యజమానికి చెల్లించవలసి వుంటుంది. కౌలు ఒప్పందము వ్రాతపూర్వకముగా వుండాలి.

**4.కౌలుదారు హక్కులు మరియు విధులు:**

కౌలు భూమికి ప్రభుత్వమునకు గాని లేక సహకార బ్యాంకులకు యితర బ్యాంకులకు తనఖా పెట్టివ్యవసాయ ఋణములు పొందవచ్చును.

కౌలు హక్కు అన్నీ వంశపారంపర్యంగా కొనసాగుతాయి.

భూమి యాజమాన్య హక్కులు మారిన కౌలు హక్కులకు బంగము ఉండదు.

యజమాని కౌలుకిచ్చిన భూమిని విక్రయం విషయంలో కౌలు దారునకు ప్రథమ హక్కు కలదు.

క్రయ విషయం నోటీసు ద్వార కౌలు దారునికి తెలియ జేయవలెను. సదరు భూమి కొనుగోలు చేయుటకు కౌలుదారుడు అంగీకరించినట్లైతే యజమానికి కౌలుదారునకు ఒప్పందము కుదిరినట్లయితే సదరు భూమిని కౌలు దారుకు అమ్మవలెను.

అంగీకారము కుదరనట్లైతే, వివాదమును న్యాయస్థానమునకు నివేదించవచ్చును.

అయితే సదరు భూమికి చెల్లింపబడుచున్న కౌలుకు 5 రెట్లు మించని విధముగా సదరు భూమి విలువను న్యాయస్థానము నిర్ధారించవలెను.

న్యాయస్థానముచే నిర్ధారించబడిన మొత్తం 10 సమాన వార్షిక వాయిదాలలో చెల్లించవలెను. మొదటి వాయిదా మొత్తము చెల్లించబడిన వెంటనే విక్రయము జరిగినట్లుగా పరిగణింపడుతుంది.

నిబంధనలకు విరుద్దముగా యజమాని తన కౌలు భూమిని విక్రయించినపుడు ఆ విక్రయము చెల్లదని ప్రశ్నించు అధికారము కైలు దారునికి ఉంటుంది.

కౌలు దారుడు స్వచ్ఛందముగా కౌలును, యజమానికి 3 నెలలు వ్యవధితో కూడిన నోటీసులిచ్చి వదలుకొన వచ్చును.

**5. యజమాని హక్కులు:-**

యజమాని తాను స్వయముగా ఆ భూమిని వ్యవసాయముచేయదలుచుకున్న సందర్భములో కౌలు కాల వ్యవధి ముగిసిన నాలుగు నెలల వ్యవధిలో లేదా నోటీసు ద్వార భూమిని స్వాధీనపర్చుకొన వచ్చును. అట్లు స్వాధీన పరుచుకొనిన సొంతముగా సాగుచేయనట్లయితే, సదరు కౌలుదారుకే కౌలుకు యివ్వవలయును.

**6.ఈ క్రింది పరిస్థితులలో కౌలు రద్దు అగును:**

1 కౌలుదారుడు కౌలు నిర్ణయించుకొనిన ప్రకారము చెల్లించనట్లయితే.

2. నిర్ధారింపబడిన తేది నుండి ఒక నెలలోజులలోపల కౌలుదారుడు కౌలు చెల్లింపకపోవుట.

3. కౌలు దారుడు నిర్లక్ష్యముగా, భూమి శాశ్వతముగా నిస్సారమైన

4. మరోకరికి సదరు భూమి కౌలుకిచ్చినట్టయితే (Sub-lease)

5. ఒప్పందము నిబంధనలు ఉల్లంఘించినట్లయితే.

**7. కౌలు వివాదములు పరిష్కారము:**

భూ యజమానికి, కౌలుదారునికి చట్ట పరిధిలోని ఏదైనా అంశమునకు సంబంధించి వివాదము ఏర్పడినప్పుడు, యజమాని, కౌలుదారు, దరఖాస్తు మేరకు వివాదమును ప్రత్యేక న్యాయస్థానము విచారించి తీర్పుచెప్పును.

**8. అప్పీలు:**

స్పెషల్ ఆఫీసరు యిచ్చిన ఉత్తర్వులపై 30 రోజులలోపల జిల్లా జడ్జికి అప్పీలు చేసుకొన వచ్చును. జిల్లా జెడ్జి తీర్పు పై అప్పీలు లేదు.

**9 చట్ట పరిధి నుండి మినహాయింపులు:**

(ఎ) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భూములు

(బి) కాఫీ, తేయాకు, రబ్బరు, సర్వీతోటలు

(సి) దేవదాయ, ధర్మాదాయ సంస్థల భూములు.

## 12. ఆంధ్రప్రదేశ్ (తెలంగాణ ప్రాంతము) కౌల్దారీ మరియు వ్యవసాయ భూముల చట్టము 1950

ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణా ప్రాంతములో భూ యాజమానులకు, కౌలుదారులకు మధ్యగల సంబంధములను క్రోడీకరించి కౌలుదారుల హక్కులకు రక్షణ కల్పించు సంకల్పముతో ఈ చట్టము రూపొందించబడినది.

**ఈ చట్టములో రెండు కౌలు పద్ధతులున్నవి -**

1) రక్షితకౌలుదారు

2) సామాన్య కౌలుదారు

చట్టములోని 34 & 37–ఎ సెక్షన్‌ల ప్రకారము అర్హులైన కౌల్దార్లందరకు రక్షిత కౌల్దార్ల సర్టిఫికెట్లను గతములో తహసీల్దారులు (ప్రస్తుత యం.ఆర్.ఓలు) జారీ చేయధికారము కలదు. అయితే మైనర్లు, నేవీ, మిలటరీ మరియు వాయు సేనలో పనిచేయు వారి భూములకు మాత్రము కొంతమేరకు మినహాయింపు ఇవ్వబడినది. పై సర్టిఫికెట్లు కలిగియున్న రక్షిత కైలుదారులో ఒకవేళ అట్టి భూములపై ఖబ్జా లేనితీరుకు సెక్షన్ 36లో పొందు పరచిన మేరకు మాండల రెవెన్యూ అధికారులు అట్టి భూమిని తమ స్వాధీనములో తీసుకొని, సర్టిఫికెటు కలిగియున్న కౌల్దారు స్వాధీనములో ఇవ్వవలయును.

సెక్షన్ 40 ప్రకారము రక్షిత కౌల్దారు హక్కులు వారసత్వంగా సంక్రమించవలసినదేకాని, అన్యాక్రాంతము చేయరాదు. మరణించిన రక్షిత కైల్దారు యొక్క వారసులు అతని యొక్క రక్తసంబంధీకులుగాని, పెంపుడు పిల్లలుగాని, భార్య (పునర్వివాహము కాకుండ యున్నంతకాలము) గాని మాత్రమే అయియుండవలెను.

రక్షిత కౌల్దారు భూమిపై 60% హక్కులు కలిగియుండును. మిగత 40%కు మాత్రమే భూస్వామి హక్కుదారుడు సెక్షన్ 31 రక్షిత కౌల్దారుల భూముల కోర్టు డిక్రీ ద్వారా జప్తుకిగాని, అమ్మకానికిగాని వీలు లేదు.

### సెక్షన్ 38 ఇ.

ఈ సెక్షన్‌లో పొందుపరచిన నిబంధనల మేరకు రక్షిత కౌల్దారు తనకు సర్టిఫికెటు ద్వారా సంక్రమించిన భూములపై పూర్తి యాజమాన్య హక్కులను పొందు వీలు కల్పించనైనది. ఇందుకు సంబంధించి ప్రభుత్వము వారు తేది.22.02.1973న జి.ఓ.ఎమ్.యస్.నెం.125 (జి) శాఖ ద్వారా అదేశాలు జారీ చేసినారు. ఈ ఉత్తర్వు తేది.01.01.1973 నుండి అమలుకు తేబడినది. పై సూచిత ప్రభుత్వ ఉత్తర్వు మేరకు అర్హుడైన రక్షిత కౌల్దారు తాను పొందిన యాజమాన్య హక్కులకు ప్రతిఫలంగా ఖుష్కి భూమి అయినచో 60 రెట్లు, తరి అయినచో 24 రెట్లు భూమి శిస్తు చెల్లించవలసియుండును. యాజమాన్య ధృవీకరణ పత్రాన్ని గతములో అదనపు రెవిన్యూ డివిజనల్ అధికారి (భూ సంస్కరణలు) జారీ చేసేవారు. ప్రస్తుతము ఈ అధికారాన్ని

సంబంధిత రెవిన్యూ డివిజనలు అధికారి/సబ్ కలెక్టరు/అసిసెటంటు కలెక్టరు గారికి బదిలీ చేయబడినది.

అయితే సర్టిఫికెటు జారీ చేయుటకు ముందు, డివిజనలు అధికారి, యాజమాన్య హక్కులు కోరు రక్షిత కౌల్దారుకు ఒక ఫ్యామిలీ హోల్డింగుకన్న ఎక్కువ భూమి యుండకుండా, భూస్వామికి రెండు ఫ్యామిలీ హోల్డింగుకన్న ఎక్కువ భూమి యుండకుండా, భూస్వామికి రెండు ఫ్యామిలీ హోల్డింగులకన్నా తక్కువ యుండకుండా జాగ్రత్త పడవలెను. ఈ షరతుకు లోబడి మాత్రమే సర్టిఫికెటు జారీ చేయవలెను.

రక్షిత కౌల్దారు హక్కులు చట్టములోని 19వ సెక్షన్‌లో పొందుపరచబడిన షరతులకు లోబడి మాత్రమే అనుభవించవలెను. అందుకు ఏ మాత్రము భిన్నంగా జరిగినచో మండల రెవిన్యూ అధికారి, తగు విచారణానంతరము రక్షిత కౌల్దారు హక్కులను రద్దు చేయవీలు కల్పింబడినది.

ఎం.ఆర్.ఓ. మరియు ఆర్.డి.ఓ. గారల చర్యలపై కలెక్టరుకు అప్పీలు చేయవచ్చు. సెక్షన్ 91 క్రింద హైకోర్టులో రివిజను పిటిషన్ చేసుకొను ఏర్పాటు చట్టములో కల్పించబడినది.

సెక్షన్ 99 క్రింద ఈ చట్టములో పొందు పరచిన విధంగా కాకుండా మండల రెవిన్యూ అధికారి, ట్రిబ్యునలు, కలెక్టరు, చీఫ్ కమీషనరు భూపరిపాలన లేక ప్రభుత్వము వారు ఇచ్చిన ఉత్తర్వులను ఏ సివిలు మరియు క్రిమినలు కోర్టులలో సవాలు చేయ వీలులేదు.

# 13. ఆంధ్రప్రదేశ్ (ఆంధ్రా ఏరియా) ఇనాముల (రద్దు మరియు రైత్వారీగా మార్పు) చట్టం 1956.

**1.ఉద్దేశ్యము:-**

దేవాలయములకు, ధార్మిక సంస్థలకు, విద్యా సంస్థలకు, ప్రభుత్వానికి, లేదా ప్రజానీకమునకు అందించే సేవలకు గాను వ్యక్తులకు (చాకలి, మంగలి, వడ్రంగి, పౌరహిత్యం మొదలగు వృత్తి పనివారలకు) భూమి శిస్తు చెల్లించనవసరం లేకుండా జమిందారులు/ రాజులు/ ప్రభువులు బహుమతిగా యిచ్చిన భూములను "ఇనాంభూములు" అంటారు. ఇనాం దార్లు తమభూములను కౌలుకు యిచ్చేవారు. ఇనాందారుల హక్కులను కుదిస్తూ, కౌలుదారుల హక్కులకు రక్షణ కల్పిస్తూ యీ చట్టం తీసుకు రావడమైనది.

**2.రైత్వారీ పట్టా మంజూరు:-**

సెక్షన్ 3 ప్రకారము గ్రామంలోగల యినాంభూములను నిర్ధారణ చేసిన తరువాత, సెక్షన్ 4 ప్రకారము ఇనాంభూమికి శిస్తు నిర్ధారణచేసి, రైత్వారీ పట్టా జారీ చేయబడుతుంది. ఐతే, 7-1-1948 తేదీ నాటికి కౌలుదారు అనుభవములోనున్నట్లు నిర్ధారించి ఉన్నట్లయితే, అట్టి భూమిలో 1/3వ వంతు భూమిని ఇనాందారుకు, 2/3వ వంతు భూమిని కౌలుదారుకు మంజూరు చేస్తూ రైత్వారీ పట్టాలు జారీచేయబడతాయి. ఇనాంభూమి ఏదైనా సంస్థకు చెందినదైతే, యీవిభజన నియమము వర్తించదు. రైత్వారీ పట్టా జారీచేయు అధికారము మండల రెవెన్యూ అధికారికి కలదు.

**3.కౌలుదారు హక్కుల రక్షణ అప్పులు అవకాశము:-**

చట్టంబారి నుండి తప్పించుకొని, తన యినాంభూములను రక్షించుకొనే ఉద్దేశంతో ఇనాందారు 7-1-1948 నాటి నుండి గల కౌలు దారుని తప్పించి ఉన్నట్లైతే, తప్పించబడిన కౌలుదారుకు కౌలు హక్కుల రక్షణ కల్పిస్తూ సెక్షన్ 5 ప్రకారం కౌలు దారుకు 2 వంతు భూమిని రైత్వారీ పట్టాపై మంజూరు చేయవచ్చును. మండల రెవెన్యూ అధికారి జారీచేసిన ఉత్తర్వుల 60 రోజులలోగా రెవెన్యూ కోర్టునకు అప్పీలు చేయు అవకాశము గలదు. రెవెన్యూ కోర్టు తీర్పు వెలువరించిన 60 రోజులలోపల జిల్లా కలెక్టరుకు అప్పీలు దాఖలు చేసుకోవచ్చు. సెక్షన్ 14-ఎ ప్రకారం, స్వయంగాగాని లేదా దరఖాస్తుపైనగాని ముఖ్య భూమి పరిపాలన కమీషనుకు రివిజను అధికారమున్నది.

**4.కౌలుదారు ఇనాందార్ల తగాదాలు, పరిష్కారములు:-**

కౌలుకు యివ్వబడిన భూమి విషయంలోను, నిష్పత్తి విషయములోను ఇనాందురు కౌలుదారుకు

మధ్య ఏకాభిప్రాయము కుదరని సందర్భములో సెక్షను 6ప్రకారము మండల రెవెన్యూ అధికారి వారు వివాదాస్పదమైన ఇనాం భూమి లేదా నిష్పత్తి విషయంలో తను విచారణ చేసి, ఇనాం దారుకు కౌలుదారుకు గల వివాదమును పరిష్కరిస్తూ తీర్పు వెలువరించాలి. అట్టి తీర్పుపై 60 రోజులలోగా రెవెన్యూ కోర్టులోను, రెవెన్యూ కోర్టు తీర్పుపై 60 రోజులలోగా జిల్లా కలెక్టరు వార్కి అప్పీలు చేసుకోవచ్చును.

**5.సంస్థలకు చెందిన ఇనాంభూములలో కౌలుదార్ల హక్కుల పరిరక్షణ:-**

సంస్థలకు చెందిన ఇనాంభూములలో 7-1-1948 తేదీ నాట్కి గాని, చట్టం అమలులోనికి వచ్చిన తేదీనాటికి గాని, కౌలు దారు ఉన్నచో, అతని కౌలు హక్కులు సెక్షను 8,9 మరియు 10 ద్వారా రక్షింపబడి, అతనిని శాశ్వత కౌలుదారుగా గుర్తించవలసి ఉంది. ఆ కౌలుదారీ హక్కు మాత్రము వంశపారంపర్యముగా కొనసాగుతుంది. ఐతే, కౌలుదారు కౌలు బకాయిని బకాయి పడిన 60 రోజులలోగా చెల్లించనిచో, లేదా ఇనాం భూమిని విలువ తగ్గే విధంగా నిర్వీర్యం చేసినా, సంస్థ అట్టి కౌలుదారుని తొలగించే హక్కు కలిగి ఉంటుంది.

**6.ఇనాందారు భూములను క్రమంపొందిన వారికి హక్కులు:-**

సెక్షన్ 10-బి ప్రకారము ఇనాందారు తన ఇనాంభూమిని అప్పటి విలువ ప్రకారం పూర్తి క్రియ ధనం పొంది మరియొకరికి విక్రయించి ఉన్నట్లైతే, అట్టి భూమిని క్రియంపొందిన కొనుగోలు దారుని ఇనాందారుగా పరిగణించి, రైత్వారీ పట్టా మంజూరు చేయవచ్చును.

**7.భూమి శిస్తు చెల్లింపు:-**

సెక్షన్12 ప్రకారం ఇనాం భూములు రైత్వారీ భూములుగా మార్పు చెంది, రైత్వారీ పట్టాలు పొందిన వ్యక్తులు లేదా సంస్థలు ప్రభుత్వానికి భూమి శిస్తు చెల్లించవలసి ఉంటుంది.

**8.సివిల్ కోర్టు పరిధి నుండి మినహాయింపు:-**

సెక్షన్ 14 ప్రకారము చట్ట పరిధిలో మండల రెవెన్యూ అధికారి, రెవెన్యూ కోర్టు (రెవెన్యూ డివిజినల్ అధికారి) లేదా కలెక్టరు వారు వెలువరించు తీర్పులను ఏ సివిల్ కోర్టులోను సవాలుచేయు అవకాశము లేదు.

**9.ప్రభుత్వ భూములు:-**

1975వ సంవత్సరములో మార్పు చేయబడిన చట్టము నందలి సెక్షను 2-ఎ ప్రకారం, సామాజిక ప్రయోజనములకు ఉపకరించే భూములు, సమస్త పోరంబోకు భూములు పూర్తి హక్కులతో ప్రభుత్వమునకు చెందును.

## 14. ఆంధ్రప్రదేశ్ (తెలంగాణ ప్రాంతము) ఇనాం భూముల రద్దు చట్టము, 1955

ఈ చట్టము ద్వారా తెలంగాణా ప్రాంతములో యున్న రకరకాల ఇనాముల తేది. 20.07.1955న రద్దు కాబడి ప్రభుత్వ పరమైనవి. పర్యవసానంగా ఇతర పట్టా భూములపై వసూలు చేయబడు భూమి శిస్తు పూర్తిగా ఇట్టి రద్దయిన భూములపై కూడా వసూలు చేయబడినది. ప్రభుత్వము వారు ఇట్టి రద్దు చేయబడిన ఇనాము భూములలో గ్రామ అవసరాలకు, పశువుల మేతకు, గనులు, క్వారీలు, చెరువులు మరియు ఇతర జలాధారాలు, చెరువు షికాలు, వాగులు, వరదలుగా ఉపయోగించని భూములకు మాత్రమే పట్టా సర్టిఫికెట్లు ఇచ్చుటకుగాను, తేది. 27.06.1975న జి.ఓ.ఎమ్.ఎస్. నెం-870 (రెవిన్యూ) ద్వారా ఆదేశాలు జారీ చేసినారు.

ఎట్టి పరిస్థితులలోను చట్ట ప్రకారము ఎవరికైనను 4 1/2 ఫ్యామిలీ హోల్డింగులకన్న ఎక్కువ భూమిని పట్టా చేయుటకు వీలు లేదు. పట్టా పొందిన వ్యక్తులు చట్టములో పొందుపరచిన మేరకు ప్రతిఫలము చెల్లించవలసియుండును. అయితే పట్టాలు పొందుటకు అర్హులైన వారు, సెక్షన్ 4 క్రింద ఇనాందారులు సెక్షన్ 5 క్రింద ఖాబిజ్ ఖదీము సెక్షన్ 6 క్రింద శాశ్వత కౌలుదారులు, సెక్షన్ 7 క్రింద రక్షిత కైలుదారులు మరియు సెక్షన్ 8 క్రింద అరక్షిత కౌల్దార్లు (Non-Protected tenants) వీరు చెల్లించవలసిన ప్రతిఫలము దిగువ సూచించిన మేరకు యుండగలరు.

| | | |
|---|---|---|
| 1. ఇనాందారు | - | భూమిశిస్తు మరియు మాఫీరకానికి మధ్యయున్న భేదమునకు 25 రెట్లు |
| 2. ఖాబిజ్ ఖరీదు | - | |
| 3. శాశ్వత కౌల్దారు | - | ఖుష్కి భూమి అయిన 25 రెట్లు, తరి అయినచో 9 రెట్లు భూమి శిస్తు. |
| 4. రక్షిత కౌల్దారు | - | ఖుష్కి భూమి అయినచో 40 రెట్లు, తరి అయినచో 13 రెట్లు భూమి శిస్తు |
| 5.అరక్షిత కౌల్దారు | - | ఖుష్కి భూమి అయినచో 60 రెట్లు, తరి అయినచో 25 రెట్లు భూమి శిస్తు. |

చట్టము క్రింద పట్టాలు పొందుటకు వ్యక్తులు తేది01.11.1973న, వారు ఏ ఇనాం భూములపై పట్టా హక్కులు కోరుచున్నారో అట్టి భూములపై ఖబ్జా కలిగియుండవలెను. ఫారం నెంబరు - 1 పై, పట్టాకోరు వ్యక్తులు, సంబంధిత రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలమయులో దరఖాస్తు చేసుకొనినచో, జి.ఓ. ఎమ్.యస్.నెం - 870 (రె- తేది. 27-06-1975 ద్వారా జారీ చేయబడిన నిబంధనలలో పొందు పరచిన మేరకు విచారణ జరిపి ఫారం నెంబరు పైన అట్టి ఇనాం భూమిని స్వాధీన పరచినట్లు సర్టిఫికెటు (Occupancy Right Certificate) జారీ చేయును.

పై సర్టిఫికెటు ద్వారా పొందిన స్వాధీన హక్కులు తేది. 01. 11. 1973 నుండి ఇవ్వబడినట్లుగా పరిగణించబడునని, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వారు కేసు నెం. 1995(2) An.W.R.116లో నిర్ణయించినారు.

చట్టములోని (15)వ సెక్షన్ ప్రకాము ఇనాం భూములు ప్రభుత్వ పరమైన తేది అనగా 20. 07. 1955 నుండి ఇనాందారు ప్రతిఫలము పొందు హక్కు కలిగియుండును. ఇట్టి ప్రతిఫలముపై సంవత్సరానికి నూటికి రూ. 2. 75ల వడ్డీ కూడ పొందుటకు హక్కు కలిగియుండును.

# 15. ఆంధ్రప్రదేశ్ నీటి పన్ను చట్టం 1988

## 1.పరిచయము:

ఆంధ్రప్రదేశ్ "ఆంధ్రా ఏరియా" లో 1395 ఫసలీ వరకు నీటి తీర్వా విధించుటలో గల వ్యత్యాసములు గమనించి, నీటి తీర్వా విధింపు క్రమబద్ధీకరించు నిమిత్తం నీటి పారుదల వనరులను రెండు ప్రధాన తరగతులుగా విభజించారు. మొదటి తరగతిగా మేజర్ మరియు మీడియం జలాధారముల (భారీ మధ్య తరహాజలాధారముల ద్వారా జరిగే నీటి పారుదల వనరులున్నూ, రెండవ తరగతిగా మైనరు (చిన్న తరహా) 4 మాసములపైబడి ప్రభుత్వ జాలాధారముల నుండి నీటి పారుదల జరిగే నీటివనరులు గుర్తించి వాటి క్రింద స్థిరీకరించిన ఆయకట్టు భూములపై నీటి పన్ను విధింపు క్రమబద్ధీకరించుటకుగాను ఆంధ్రప్రదేశ్ నీటి పన్ను చట్టం 1988 చేయబడింది. ఈ చట్టము తే. 1. 7. 1986దీ నుండి అమలులోనికి వచ్చినది.

## 2.కలెక్టరు లేక సి.సి.యెల్.ఎ. జారీ చేయు నోటిఫికేషను:

ఈ చట్టములోని సెక్షన్ 4 ప్రకారముపై తరహా నీటి వనరులను జిల్లా పరిధిలో జిల్లా కలెక్టరు వారు స్థిరీకరించిన ఆయకట్టు ఒకటి కంటే ఎక్కువ జిల్లాలో వ్యాపించి ఉన్నచో చీఫ్ కమీషనరు ల్యాండు ఎడ్మినిస్ట్రేషను వారు ఎప్పటికప్పుడు (ఆయకట్టు విస్తీర్ణములు వ్యత్యాసములకు లోనైనప్పుడల్లా) ఫారం 1 లేదా 2 లో నోటిఫై చేయాలి.

## 3.మండల రెవెన్యూ ఆఫీసరు జారీ చేయునోటిఫికేషను, విచారణ, నీటిపన్ను నిర్ణయం:

పై విధంగా నోటిఫై చేయబడిన నీటి వనరుల తరగతులనుబట్టి సెక్షన్ 5లోని అధికారమును పురస్కరించి, మండల రెవెన్యూ అధికారి ప్రతి గ్రామంలోను రైతులు చెల్లించవలసిన నీటి తీర్వా (సెక్షన్ 3) ప్రకారము నిర్ధారణచేసి, ఒక్కొక్క వనరు క్రింద గల భూముల వివరములు వారు చెల్లించవలసిన నీటి తీరువా వివరములతో నోటిఫికేషను ఫారం-3లో జారీచేస్తూ రూలు 4(1) ప్రకారము గ్రామచావిడి, (పంచాయితీ) నోటీసు బోర్డులో, మండల రెవెన్యూ కార్యాలయము, నోటీసు బోర్డులలో ప్రచురించాలి. అట్లు ప్రచురించిన 30 రోజులలోగా ఆక్షేపణలున్న భూకామందు తన ఆక్షేపణలు తెలియజేయాలి. అట్టి ఆక్షేపణలు పరిశీలించి, మండల రెవెన్యూ అధికారి తగు ఉత్తర్వులు జారీచేయాలి. ఆక్షేపణలు రానిచో నిర్ణయించిన నీటి పన్ను ఖాయమౌతుంది.

## 4.అప్పీలు:

సెక్షన్ 6 ప్రకారము, మండల రెవెన్యూ అధికారి జారీ చేసిన ఉత్తర్వులపై గాని, నిర్ణయించి ఖాయపర్చిన నీటి తీర్వా నోటిఫికేషనుపైగాని 30 రోజులలోగా రెవెన్యూ డివిజినల్ అధికారి వద్ద అప్పీలు దాఖలు చేసుకోవచ్చు. అప్పీలులో రెవెన్యూ ఇవిజినల్ అధికారి మండల రెవెన్యూ ఆఫీసరు వారి ఉత్తర్వులను ఖాయపర్చవచ్చు, లేదా మార్చవచ్చు, లేదా రద్దు పర్చవచ్చు.

**5.భూమి శిస్తు బకాయిగా వసూలు:**

సెక్షన్ 7 మరియు 8 ప్రకారం నీటి తీర్వా విధించిన ఫసలీ అంతమయ్యేలోగా చెల్లించకపోతే, ల్యాండురెవెన్యూ బకాయిగా రెవెన్యూ రికవరీ చట్ట ప్రకారం వసూలు చేయవచ్చు.

**6.రివిజను:-**

సెక్షన్ 9 ప్రకారము జిల్లా కలెక్టరు వారు, దరఖాస్తు పైగాని, తనంతట తానుగాగాని మండల రెవెన్యూ అధికారి లేదా రెవెన్యూ డివిజనల్ అధికారి వారి ఉత్తర్వుల అమలు తేదీ నుండి 60 రోజులలోగా దిగివ ఆధికార్ల రికార్డులను నివేదికను పరిశీలించి, వారి ఉత్తర్వులపై తగు విధముగా రివిజన్ ఉత్తర్వులు జారీచేయవచ్చు.

**7.న్యాయస్థాన పరిధి మినహాయింపు:**

సెక్షన్ 11 ప్రకారం ఈ చట్ట పరిధిలో నిర్ణయించిన నీటి గురించి ఏ న్యాయస్థానము ప్రశ్నించుటకు అధికారము లేదు.

**8.నీటి పన్ను రేట్లు:**

ఈ చట్ట ప్రకారము నిర్ణయించిన నీటి పన్ను రేట్లు ఈ క్రింది విధంగా ఉంటాయి.

| క్రమ సంఖ్య | పంటవివరణ | ఎకరము ఒక్కంటికి నీటి తీర్వా | |
|---|---|---|---|
| | | మొదటి తరగతిజలాధారము | రెండవ తరగతి జలాధారము |
| | | రూ. | రూ. |
| 1. | మొదటి లేక ఒకే మాగాణీపంట | 200.00 | 100.00 |
| 2. | రెండవ, మూడవ మాగాణీ పంట | 150.00 | 100.00 |
| 3. | మొదటి పారుదల మెట్ట పంట | 100.00 | 60.00 |
| 4. | రెండవ, మూడవ పారుదల మెట్ట పంట | 100.00 | 60.00 |
| 5. | ఫసలీలో డొఫసల్–పంట (చెరకు, అరటి వ॥) | 350.00 | 350.00 |
| 6. | సంవత్సరంనకు చేపల చెరువులకు | 500.00 | 500.00 |

9. మెరక భూమిగా పరిగణన నీటి తీర్వా విధించవలసిన మాగాణీ (నంజ/పల్ల (తరి)) మరియు మెరక (పుంజ/మెట్ట(ఖుష్కి)) భూములను మెరక భూములుగానే పరిగణించాలి.

**<u>గమనిక:</u>**

| క్రమ.సంఖ్య | రద్దుకాబడిన/ వసూలు చేయరాని అయిటములు | ప్రభుత్వ ఉత్తర్వులు తేదీ |
|---|---|---|
| 1. | గతంలో విధించే సెస్సులు వసూలుచేయనవసరం లేదని వివరించపబడినది | Govt.Memo.No.956/LR3/97-3 Revenue Dt.29-01-1997. |

| క్రమ.సంఖ్య | రద్దుకాబడిన/ వసూలు చేయరాని అయిటములు | ప్రభుత్వ ఉత్తర్వులు తేదీ |
|---|---|---|
| 2. | ల్యాండు సెస్సు (లోకల్ సెస్సు, విద్యా సెస్సు) వసూలు చేయన వసరం లేదని వివరింపబడినది. | G.O.Ms.No.267/Rev Dt.18-04-98. |
| 3. | ల్యాండు సెస్సు (లోకల్ సెస్సు, విద్యా సెస్సు) రద్దు చేసినారు. | G.O.Ms.No.559/Rev Dt.31-07-98. |
| 4. | డ్రైనేజి సెస్సు, మైంటెనెన్సు ఫీజు రద్దు చేసారు. | G.O.Ms.No.267/Rev Dt.18.04.98 |
| 5. | వాణిజ్య పంటలపై ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక సెస్సు విధింపు లేదు. | |
| 6. | బాకీ దారుల జాబితాను నీటిని వినియోగ దారుల సంఘము వార్కి తెలియజేయాలి. | G.O.Ms.No.175/Rev. Dt.10.03.98 |
| 7. | గ్రామ పంచాయితీకి జమ చేయవలసిన నీటి తీర్వా (వసూలైన మొత్తంలో) 10% | G.O.Ms.No.347/Rev. Dt.21.04.99 |

భూమి శిస్తు, సెస్సులు, డ్రైనేజి సెస్సు, మైన్‌టెనెన్సు ఫీజు రద్దుకాబడినందున, ప్రభుత్వ జలవనరుల నుండి పారుదల నీటి సౌకర్యం పొందే భూములపై నీటి పన్ను మాత్రమే విధించి, వసూలు చేయవలసివున్నది.

ప్రభుత్వ జలవనరుల నుండి ఆక్రమణదారు దిగువ ఆయకట్టు దార్లకు అసౌకర్యం నీటి సరఫరాకు అంతరాయం కలుగజేయ కుండా, నీటి వనరులను పాడు చేయకుండా, నీటి ప్రవాహములకు అడ్డు కట్ట వేయకుండ, నీటి పారుదల పొందినచో నీటి పన్ను చట్ట ప్రకారము విధించవచ్చును.

10. వసూలైన నీటి తీరువా కేటాయింపు:

వసూలైన నీటి తీరువా ఈ క్రింది విధముగా విభజింపబడి నీటి పరుదల శాఖకు నీటి పారుదల యాజమాన్య సంస్థలకు కేటాయిస్తూ, వారి వారి పద్దులకు మండల రెవెన్యూ అధికారి జమచేయాలి.

| **క్రమ సంఖ్య** | **జలాధారము తరగతి** | **రేటు రూ.** | **నీటి వినియోగ దారుల సంఘములు రూ.** | **డిస్ట్రిబ్యూటరీ కమిటీలు రూ.** | **ప్రాజెక్టు కమిటీలు రూ.** | **గ్రామ పంచాయితీలు రూ.** | **నీటి పారుదల శాఖ రూ.** |
|---|---|---|---|---|---|---|---|
| 1. | మేజరు ఇరిగేషన్ సోర్సులు | 200 | 50 | 20 | 20 | 10 | 100 |
| 2. | మీడియం ఇరిగేషన్ సోర్సులు | 200 | 60 | – | 30 | 10 | 100 |
| 3. | మైనరు ఇరిగేషన్ సోర్సులు | 100 | 90 | – | – | 10 | – |

## 16. ఎ.పి.రెవెన్యూ రికవరీ చట్టం 1864

**1.ముఖ్యోద్దేశ్యము:-**

రాష్ట్ర ప్రభుత్వానికి రావలసిన పన్నులు, ప్రభుత్వ గ్యారంటీతో బ్యాంకులు, ప్రభుత్వ సంస్థలు, కార్పోరేషన్‌లు ఇచ్చిన అప్పులు ప్రభుత్వానికి లేదా ఆయా సంస్థలకు సకాలంలో సక్రమంగా చెల్లించని సందర్భములలో బకాయి పడిన మొత్తములను ఈ చట్ట ప్రకారము వసూలు చేయవలసియుండును.

**2.వసూలు చేయగలిగిన అధికారులు సెక్షను 5 ప్రకారం:-**

ప్రభుత్వానికి బకాయి పడ్డ భూమి శిస్తు, నీటి తీర్వా లేదా శిస్తులాగానే వసూలు చేయదగిన బకాయిలను వసూలు చేసే అధికారం జిల్లా కలెక్టరుకు లేదా ఆయన అనుమతి పొందిన అధికారులకు ఉంటుంది.

**3.బకాయి సొమ్ము వసూలు విధానము:-**

రెవెన్యూ రికవరీ చట్ట ప్రకారం ఏ భూమిపై పన్ను బకాయి వుందో ఆ భూమి అందుపైగల కట్టడములు బకాయికి హామీగా ఉంటాయి. (సెక్షన్-2) భూస్వామి తాను చెల్లించవలసిన పన్ను కిస్తీ సమయములో విధిగా చెల్లించాలి. (సెక్షన్-3) కిస్తీ సమయములో చెల్లించ నట్టి సొమ్ము ల్యాండు రెవెన్యూ బకాయిగా పరిగణింపబడుతుంది (సెక్షన్-4) బకాయి పడిన తేదీ నుండి సంవత్సరమునకు 6% చొప్పున వడ్డీతో బకాయి లెక్కించాలి (సెక్షన్ 7) బకాయిదారుకు, ఫారం-I డిమాండు నోటీసులో బకాయి సొమ్ము బకాయి పడిన తేదీ, బకాయిపై 6% చొప్పున వడ్డీ (సాలుకి) తెలియజేస్తూ డిమాండు నోటీసు జారీ చేయాలి (సెక్షన్-8)

**4.జప్తు:-**

డిమాండు నోటీసుకు బకాయిదారు స్పందించకపోతే, బకాయి, అందుపై వడ్డీ జప్తు ఖర్చులు, బేటా, మొత్తము రాబట్టుటకు అవసరమైనంత చరాస్థిని ( to the arrears) లేదా స్థిరాస్థిని మాత్రమే (సెక్షన్-14) జప్తు చేయాలి. స్థిరాస్థులున్నను, చరాస్తులు జప్తు చేయుటకే మొగ్గుచూపాలి.

**5.జప్తు చేయు విధానము:-**

సూర్యోదయం తరువాత సూర్యాస్తమయమునకు ముందు మాత్రమే జప్తు చేయాలి. (సెక్షన్-15) జప్తుచేయుటకు వీలు లేకుండ బకాయిదారు చరాస్తిని వేరొకచోటకు తరలిస్తే సెక్షన్ 424 ఐ.పి.సి ప్రకారం బకాయి దారు శిక్షార్హుడౌతాడు (సెక్షన్.16) జప్తు చేసిన ఆస్థిని బకాయిదారు దౌర్జన్యముగా జప్తు చేసిన అధికారి ఆధీనము నుండి తప్పించినచో సివిల్ కోర్టు ద్వారా జప్తు ఆస్తిని జప్తు చేసిన అధికారి పొందాలి. ఈ నేరమునకు బకాయి దారు ఐ.పి.సి లో గల శిక్షకు గురికావచ్చును. (సెక్షను.18) సెక్షన్ 19,20 మరియు 21 ప్రకారం జప్తు చేయు అధికారి బకాయిదారు పశువులశాల, గాదె, గోడౌను, వెలుపలి తలుపులు తెరిచియున్న నివాస గృహములోనికి ప్రవేశించి బకాయిదారు చరాస్థులు జప్తు చేయవచ్చును. ఘోషా స్త్రీలు నివశించే గదులలోనికి ప్రవేశించరాదు. తలుపులు తెరిచి లేని గృహంలో ప్రవేశించాలన్నా, లేదా ఘోషా స్త్రీలు ఉండే గదిలో బకాయిదారు ఆస్తులు

ఉన్నట్లు రూఢిగా తెలిసినా, పోలీసు వారి సహాయంతో తలుపులు తెరచి, ఘోషా స్త్రీలను వారు ఉంటున్న గది నుండి తప్పుకోవలసినదిగా కోరి, వారు తప్పుకున్న తర్వాత బకాయి దారు చరాస్తిని జప్తుచేసి, స్వాధీన పర్చుకోవాలి. ఘోషాస్త్రీలు ఉండగా ప్రవేశించే అధికారి సెక్షన్ 21 ప్రకారం రూ.500/-లు జరిమానా లేదా 6 మాసముల వరకు కారాగార శిక్షకు పాత్రులవుతారు.

**6.చరాస్తి జప్తు, వేలం విధానము:-**

సెక్షన్ 8 ప్రకారము జారీ చేసిన ఫారం I నందలి నోటీసులో తెల్పిన వడ్డీతో బకాయి, బేటా చెల్లించుటకు స్పందించకపోతే బకాయి దారు చరాస్తిని సెక్షన్ 9 ప్రకారము జప్తుచేసి ఫారం II లో జప్తు నోటీసులో జప్తుచేయబడిన చరాస్థి వివరాల, అంచనా విలువ తెలియ పరుస్తూ బకాయిదారు పై ఒక ప్రతి అమలు జరపాలి. జప్తు ఆస్తిని జప్తు చేయు అధికారి స్వాధీన పర్చుకోవాలి. ఆవిధంగా చరాస్తి జప్తు చేసినా బకాయి, వడ్డీ, జప్తు ఖర్చులు చెల్లించి జప్తు ఆస్తి విడుదల పొందుటకు బకాయిదారు స్పందించకపోతే అమలు జరిపిన డిమాండ్ నోటీసు (ఫామ్-I) మరియు జప్తు నొటీసు (ఫామ్-II) జతచేసి మండల రెవెన్యూ అధికారికి పంపించాలి. మండల రెవెన్యూ అధికారి సెక్షన్ 22 ప్రకారం ఫామ్-III వేలం నోటీసులో జప్తు చేయబడిన చరాస్తి వివరములు, వేలం వేయుటకు నియమించిన అధికారి, వేలంవేయు స్థలము, తేదీ సమయము నిర్ణయిస్తూ నోటీసు జారీ చేస్తారు. నోటీసు ప్రచురించిన 15 రోజుల తరువాత మాత్రమే వేలం నిర్వహించాలి. కాబట్టి వేలం నోటీసులో తేదీ, సమయం నిర్ణయించుటలో మండల రెవెన్యూ అధికారి జాగ్రత్తవహించాలి. వేలంనోటీసు ప్రతులు బకాయిదారుపై అమలు జరిపి, గ్రామ పంచాయితీ నోటీసు బోర్డులో ప్రకటించి, అందలి వివరములు దండోరామూలముగా గ్రామస్తులకు తెలియజేయాలి. సెక్షన్ 10 ప్రకారం వేలం తేదీకి ముందు రోజు సాయంత్రం 5 గంటలలోగా బకాయిదారు బకాయి, వడ్డీ, జప్తు ఖర్చులు పూర్తిగా చెల్లిస్తే, జప్తు ఆస్తిని విడుదల చేయాలి. కానిచో వేలం తేదీన, వేలం అధికారి జప్తు ఆస్తిని వేలం వేసి హెచ్చు పాటదారు నుండి వేలం సొమ్ము వసూలుచేసి, జప్తు ఆస్తిని హెచ్చు పాటదారుకు అప్పగించాలి. వడ్డీతో బకాయి, జప్తు ఖర్చులు రికవరు చేసుకోగా, మిగిలిన సొమ్ము బకాయి దారుకు చెల్లించి రశీదు పొందాలి. (సెక్షన్.23) ఏ కారణముచేతనైనా హెచ్చు పాటదారు పాటసొమ్ము పూర్తిగా నిర్ణీత గడువులోగా చెల్లించనిచో, జప్తు ఆస్తి అప్పగించకుండా, తిరిగి పాటపెట్టినచో సంభవించు నష్టమునకు ముందు హెచ్చు పాటదారు, నష్ట పోయిన సొమ్ము చెల్లించుటకు బాధ్యుడగును. (సెక్షన్24)

**7.స్థిరాస్తి జప్తు వేలం విధానము:-**

బకాయి దారువద్ద జప్తు చేయదగు చరాస్తి లేకున్నా లేదా బాకీ రాబట్టుటకు సరిపడు చరాస్తి లేకున్నా, జప్తు చేసిన చరాస్తి వల్ల బకాయి, వడ్డీ, జప్తు ఖర్చులు పూర్తిగా వసూలు కాకున్నా, రాబట్టవలసిన బకాయికి సరిపడు బకాయిదారు స్థిరాస్తిని జప్తుచేయవలసి ఉంటుంది.

సెక్షన్ 25 ప్రకారం ఫారం 4 లో మండల రెవెన్యూ అధికారి వారు బకాయి దారుకు అతను బకాయి పడిన బాకీ, వడ్డీ, ప్రోసెస్ ఖర్చులు తెలియజేస్తూ, నిర్ణయించిన గడువులోగా చెల్లించనిచో స్థిరాస్తి

జప్తుకు చర్య తీసుకోబడునని తెలియజేస్తూ డిమాండు నోటీసు జారీచేసి, బకాయి దారుపై అమలుజరపాలి.

సెక్షన్ 26 మరియు 27 ప్రకారం బకాయిదారు పై డిమాండు నోటీసుకు స్పందించకపోతే, ఫారం 5 లో బకాయి దారు భూమి లేదా అందలి భాగం (సబ్ డివిజను చేయబడాలి) వివరములు, హద్దులు పొందుపరచి, భూమి జప్తుచేస్తూ జప్తు నోటీసు, జప్తుచేయబడిన భూమిలో ప్రకటించాలి, బకాయి దారుపై అమలు జరపాలి. జిల్లా గెజిట్‌లో ప్రకటన చేయించాలి. ప్రకటించిన తరువాత జప్తు చేయబడిన భూమి ప్రభుత్వాధీనములో ఉంటుంది. సెక్షన్ 28 ప్రకారం జప్తుకాబడిన భూమిని మేనేజి చేయుటకు ఏజెంటును ఫారం 6 లో నియమించాలి. సెక్షన్ 30 ప్రకారం మేనేజి చేయు జప్తు ఆస్తికి సంబంధించిన ఆదాయములు అద్దెలు శిస్తులు వసూలుచేయడం, లేదా అవసరమైన ఖర్చులు పెట్టి సక్రమమైన జమాఖర్చులు వ్రాయాలి. బకాయి దారు జమా ఖర్చులు పరిశీలించుకొనే హక్కు కలిగి ఉంటారు. సెక్షన్ 34 ప్రకారం ఏజెంటు జప్తు కాబడిన భూములపై వసూలైన అద్దెలు, శిస్తులలో మెయింటెనెన్సు ఖర్చులు పోగా, మిగిలిన ఆదాయం బకాయిదారు నుండి రాబట్టవలసిన వడ్డీతో బకాయి, జప్తు ఖర్చులకు పూర్తిగా సరిపోయినచో, భూమిని జప్తు నుండి రిలీజ్ చేయవచ్చును. ఏజెంటును విత్‌డ్రాచేయవచ్చును. సెక్షన్-35 ప్రకారం జప్తు చేయబడిన భూమిలో ఇంటరెస్టు, గల ఏవ్యక్తియైనను, వడ్డీతో బకాయి, జప్తు ఖర్చులు, మేనేజ్‌మెంటు ఖర్చులు పూర్తిగా చెల్లించి, జప్తు నుండి భూమిని విడుదల పొందవచ్చును.

సెక్షన్ 36 ప్రకారం:- జప్తు చేసిన స్థిరాస్తిని వేలం వేయుటకు తగిన స్థలము, సమయమును వేలం నోటిఫికేషను జారీకాబడి ప్రచురింపబడిన నెల తరువాత తేదీని ముందుగా నిర్ధారణచేసుకొని ఫారం 7 భూమి జప్తు నోటిఫికేషనులో డిఫాల్టరు వివరములు, వేలంచేయబడు భూమి వివరములు, విస్తీర్ణము, హద్దులు, బకాయి దారునుండి రాబట్టవలసిన బాకీ, వేలంవేయు అధికారి వివరములు, వేలం వేయు స్థలము, తేదీ, సమయము తెలియజేస్తూ నోటిఫికేషను జారీ చేయాలి. అట్టి నోటీసు వేలం తేదీకి ఒక నెల ముందుగానే కలెక్టరు కార్యాలయంలోను, మండల కార్యాలయంలోను, పోలీసు స్టేషనులోను, జప్తు కాబడిన భూమిలోను ప్రకటించాలి. వేలం గురించి బహుళ ప్రచారం జరిగేలా దండోరా మూలముగా ప్రకటించాలి. వేలం రోజున హెచ్చు పాటదారు పాటసొమ్ములో 15% సొమ్ము చెల్లించి, మిగతా 85% ముప్పై రోజులలోగా చెల్లించాలి. లేనిచో 15% డిపాజిట్టు సొమ్ము కొల్పోవలసి ఉంటుంది. హెచ్చు పాటదారు మిగతా 85% సొమ్ము చెల్లించని కారణముగా అదే భూమి మరల వేలం వేయవలసివస్తే, అట్టి వేలంవల్ల వచ్చే నష్టమునకు మొదటి హెచ్చు పాట దారే బాధ్యుడౌతాడు. నష్టపోయిన సొమ్మును అతని నుండి ల్యాండు రెవెన్యూ బకాయిగా వసూలు చేయవలసి ఉంటుంది.

స్థిరాస్తి వేలం తేదీకి ముందు రోజు సూర్యాస్తమయానికి ముందు, వడ్డీతో బకాయి, జప్తు ఖర్చులు, మేనేజిమెంటు ఖర్చులు, వేలానికి తీసుకురావడానికి అయిన ఖర్చులతో కలిసిన మొత్తం బకాయి దారుగాని, అతని తరపునగాని, తణఖాదారుగాని, కౌలు దారుగాని చెల్లించినచో వేలం నిలిపివేయవచ్చు.

సెక్షన్ 37– ఎ ప్రకారం: వేలంవేయబడిన తరువాత భూమిపై హక్కులుగల బకాయిదారు, తణఖాదారులలో ఎవరైన వేలం నిర్వహించిన 30 రోజులలోగా వేలం సొమ్ములో 5% న్నూ, వడ్డీతో బకాయి, జప్తు, మేనేజిమెంటు, వేలం ఖర్చులు యావత్తు మొత్తం ట్రజరీలో డిపోజిట్టుచేసి, వేలం ఖాయపర్చకుండ, రద్దు పరచవలసినదిగా కోరుచూ అర్జీతో చలానా జతపర్చాలి. చలానా దాఖలా సొమ్మును హెచ్చు పాటదారుకు రిఫండ్ చేస్తూ, వేలం రద్దు పర్చాలి.

సెక్షన్ – 38 ప్రకారము: వేలం వేసిన 30 రోజుల అనంతరం హెచ్చు పాట దారు పేర్న వేలం ఖాయపర్చి హెచ్చు పాట దారుకు ఫారం 8 లో వేలం సర్టిఫికెట్టు మంజూరు చేయాలి.

సెక్షన్ – 39 హెచ్చు పాటదారునికి సేలు సర్టి ఫికెట్టు యిచ్చిన తరువాత వివరములు జిల్లా గెజిట్‌లో అతడు వేలంలో కొనుక్కున్నట్లు, అతనికి కొన్న భూమిపై అన్ని హక్కులు సంక్రమించినట్లు ప్రచురించాలి. కలెక్టరు కార్యాలయంలోను, మండల రెవెన్యూ కార్యాలయంలోను, గ్రామంలోను ఎల్లరకు తెలియులాగున ప్రకటనచేయించాలి.

సెక్షన్ 40 ప్రకారం – వేలంలో కొన్న భూమితో వేలంపాట దారుకు సేలు సర్టిఫికెట్ ఆధారముగా ప్రవేశింపచేయాలి. వేలంపాట దారుకు స్వాధీనం కాకపోతే లేదా అతనిని స్వాధీనం పొందకుండ అటకాయిస్తే కోర్టు ద్వారా స్వాధీనం పొందవచ్చును.

**8.బకాయి దార్ల నిర్బంధము:**

సెక్షన్ 48 ప్రకారం భూమి వేలం వేసినా, బకాయి, వడ్డీ, జప్తు ఖర్చులు, మేనేజి మెంటు ఖర్చులు, వేలం ఖర్చుల మొత్తం, వేలం వల్లరాకపోతే, బకాయిదారు, అతని హామీ దారులు ఉద్దేశ పూర్వకంగా చెల్లించుటకు నిరాకరించినా, కాలయాపన చేసినా, అట్టిబకాయి దారు అతని హామీదార్లను రూ 500/ – లు మించినచో 2 సంవత్సరముల వరకు, రూ.50/– మించనిచో 3 నెలల కారాగార శిక్ష విధించవచ్చును.

**9.భూమి శిస్తు కాకుండా రాష్ట్ర ప్రభుత్వమునకు చెందిన మిగిలిన బకాయిల వసూలు:**

భూమి శిస్తు కాకుండా రాష్ట్ర ప్రభుత్వమునకు చెందిన యితర బకాయిలు అనగా వ్యవసాయమునకు సంబంధించిన అడ్వాన్సులు, సెస్సులు, కాంట్రాక్టు ఉల్లంఘన వలన జరిగిన నష్టములు, మరియు యితర రెవెన్యూ బకాయిలు కూడా యీ చట్టమునందలి 52వ సెక్షను ప్రకారం వసూలు చేయవచ్చును.

**10. బ్యాంకులు, యితర పబ్లిక్ సంస్థలకు రావలసిన బకాయిల వసూలు:**

సెక్షన్ 52–ఎ ప్రకారము – ప్రభుత్వము గ్యారంటీగల బ్యాంకు రుణాలు, సంక్షేమ కార్యక్రమాల క్రింద మంజూరు చేసిన బ్యాంకు రుణాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలోని కార్పోరేషన్ల బాకీలు, ప్రధాన మంత్రి రోజ్‌గార్ యోజన వగైరా బకాయిలు వసూలు చేయవలసి ఉంటుంది.

## 17. జమాబందీ నిర్వహణ (బి.ఎస్.ఓ.12)

**1. జమాబందీ నిర్వహణ విధానమును బి.ఎస్.ఒ.12లో వివరణ యివ్వబడినది.**

**2.** **"జమాబందీ"** అంటే స్థూలంగా గ్రామ లెక్కలు తత్సంబంధమైన మండల స్థాయి లెక్కలు క్షుణ్ణంగా పరిశీలించడం, భూమి శిస్తుకు సంబంధించిన అన్ని అంశాలు - శాశ్వత శిస్తు విధానానికిలోనైన ఎస్టేట్లు మైనరు యినాంలు పరిగణలోనికి తీసుకొని పన్ను శిస్తు సక్రమంగా నిర్ణయించారా, పరిపాలనా సౌలభ్యం కొరకు తయారు చేసే గణాంకాలు సరిగా పొందు పరిచారా అనేది పరిశీలించడం.

**3. ముఖ్యంగా జమాబందీ యీప్రధానాంశములతో ముడిపడి ఉంటుంది.**

ఎ) పంటల సాగుబడి పంటల పరిస్థితి, పంటల దిగుబడి అంచనాలు సాగుబడి, నీటి పారుదల కమ్మీ (Concealment)

బి) పంట నష్టం సంభవించినచో, అందుకుగల, కారణాలు, రెమిషన్ మంజూరు.

సి) ప్రభుత్వ నీటి వనరుల నీరు పొందిన భూములపై విధించిన చార్జీలు, అక్రమ పద్దతిలో నీటి పారుదల పొందినందుకు పెనాల్టీలు, నీటి వనరుల పరిస్థితి.

ఇ) పట్టాపై మంజూరు చేయవలసిన ప్రభుత్వ భూములకు సంబందించిన ఫైళ్ల పరిశీలన, పట్టా షరతుల ఉల్లంఘనకు, అన్యాక్రాంతమైన డి-పట్టా భూముల విషయంలో తీసుకున్న చర్య.

ఎఫ్) ప్రభుత్వ భూములలోను, రైత్వారీ భూములలోను ఫసలీలో సంభవించిన మార్పులు, యాజమాన్య బదిలీలు రికార్డులలోను గ్రామ లెక్కలలోను మార్పు చేయుటకు తీసుకున్న చర్య.

జి) అన్ని గ్రామ లెక్కల పరిశీలన, చార్జికావలసిన యావత్తు నీటి తీర్వా కేసులు చార్జి కాబడినవా? ఆక్రమణలపై పన్ను విధించబడినదా? ట్రీపట్టాలు, లీజు భూములపై రాబట్ట వలసిన సొమ్ము చెట్ల ఫలసాయంపై వచ్చు రాబడులు సక్రమంగా వసూలు చేయబడుచున్నాయా అన్నది పరిశీలించడం.

ఇ) కిస్తీబంది ప్రకారం పన్నులు వసూలు చేసి, సక్రమంగా రశీదులు, బెతాలు వ్రాసి, సకాలంలో ప్రభుత్వ ఖజానాకు జమ చేయబడిందా, శాశ్వతంగా కాని/ తాత్కాలికంగా కాని వసూలైన పన్నులు.

ఎఫ్) రైతాంగం దాఖలుచేసే అర్జీల సత్వర పరిష్కారం.

**4. జమాబందీ నిర్వహించే అధికార్లు:-**

| | | |
|---|---|---|
| 1.ఐదు సంవత్సరములకు ఒకసారి | - | జిల్లా కలెక్టరు |
| 2.జాయింటు కలెక్టరు | - | జిల్లా కలెక్టరు ఆదేశములతో |
| 3.జిల్లా రెవెన్యూ అధికారి | - | డిటో |
| 4.రెవెన్యూ డివిజినల్ అధికారి | - | ఫసలీకి - రెండు మండలాలు |
| 5.స్పెషల్ డిప్యూటీ కలెక్టరు | - | జిల్లా కలెక్టరు ఆదేశములలో |

**5.** **<u>జమాబందీ నిర్వహించే కేంద్రము:-</u>** సాధా రణముగా మండల రెవెన్యూ కార్యాలయములో నిర్వహించబడుతుంది. జమాబందీకి విధిగా పంచాయితీ సెక్రటరీలు, వారి గ్రామ నౌకర్లతోను, గ్రామ లెక్కలు, రికార్డు లతోను, సర్వే పరికరములతోను హాజరయ్యేలా చూడాలి.

**6.** **<u>జమాబందీ నిర్వహణ:-</u>** ప్రతి ఫసలీలోను ఫసలీ సంవత్సరం ముగిసేలోగా అన్ని మండలాల్లోను అన్ని గ్రామాల జమాబందీ (సెటిల్మెంట్ ఆఫ్ ఎక్కౌంట్సు) ముగించాలి. గ్రామాల సెటిల్డు డిమాండు వివరములు జూలై 15 లోగా జిల్లా కలెక్టరు వారి కార్యాలయానికి పంపాలి. జూలై 31 లోగా జిల్లా కలెక్టరువారు రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లా మొత్తం సెటిల్డు డిమాండు వివరాలు పంపవలసి ఉన్నది.

**7.** **<u>జమాబందీ ఆఫీసరు:-</u>** పై రెండవ పేరాలో తెల్పిన గ్రామ లెక్కలు యావత్తు క్షుణ్ణంగా పరిశీలించి, రేట్లు క్యాలిక్యులేషన్లు సక్రమంగా పరిశాలించుటకు తనకార్యాలయ సిబ్బందిని వినియోగించుకొన్నను, తనంతటతానుగా పరిశీలన చేయాలి. గ్రామ లెక్కలతోబాటు ఈ దిగువ రికర్డులు తాజా పరచినది, లేనిదీ పరిశీలించాలి.

1.మండల రెవెన్యూ అధికారి వారు – బి.మెమోల (ఆక్రమణల) పై ఆక్రమణ పన్ను సక్రమంగా విధించారా లేదా? మండల ఎక్కౌంటు నెం.4రు (భూముల పంపిణీ) రిజిస్టరు, నెం.5 (హక్కు విడుదల (Relinquish) రిజిస్టరు, నెం.6 రు (పట్టా భూముల యాజమాన్య బదిలీ) రిజిస్టరు తాజా పరచారా? లేదా? ఫైళ్లు తెప్పించి అందుపై మండల రెవెన్యూ అధికారి వారి ఉత్తర్వులు పరిశాలించాలి. ప్రతి గ్రామంలోను పంటలు హెచ్చు శాతం (Fair Per Centage) తణిఖీ చేసారా? లేదా? పరిశాలించాలి.

2.రెవెన్యూ ఇనస్పెక్టర్లు – ప్రతి గ్రామమంలోను సాగుబడి, పంటల సరిస్థితి, దిగుబడులు సకాలంలో అజమాయిషీ చేసారా లేదా? అజమాయిషీ సమయంలో పంచాయితీ కార్యదర్శి బుక్ చేయమని (Concealment) సాగుబడి ఆక్రమణలు కనుగొన్నారా, లేదా? అతడు గ్రామం సందర్శించినపుడు రశీదులు, చీఠాలు, ఇర్సాల్లు పరిశీలనచేసి, ల్యాండు రెవెన్యూ సక్రమంగా ప్రభుత్వ ఖజానాకు పంపినట్లు గమనించారా? నిధుల దుర్వినియోగం (Misappropriation) జరిగినట్లు కనుగొన్నారా? వారిడైరీతో వెరిఫై చేయాలి.

3.మండల రెవెన్యూ అధికారి నుండి దిగువస్థాయి అధికారులందరు వారివారి విధులను సక్రమంగా సకాలంలో నిర్వహిస్తున్నారో లేదో పరిశీలించాలి.

4.జమాబందీలో డిమాండు ఖాయపర్చే ముందు, గ్రామ లెక్కలు 4ఎ, 4బి,4సి, మరియు 4 డిమాండు లెక్కల ప్రకారము మండల లెక్క 11 (Misappropriation Revenue) గ్రామ వారీ ఇతర రాబడులు, నెం12రు గ్రామ వారీ డిమాండు సక్రమంగా నమోదైనవి, లేనివి పరిశీలించి, గ్రామలెక్క నెం.4 రు తోబాటు మండల నెం. 11 మరియు 12 లెక్కల ఖాయపర్చాలి.

5.రైతులు కోరినచో పట్టాలలో సవరణలు (మార్పులు), కొత్త పట్టాలు వ్రాయించి వారికి అందజేయాలి.

6.ఆర్థిక మరియు పరిపాలనా పరమైన లక్ష్యాల సాధనకు అవసరమైన గణాంకాలు ఖచ్చితంగా సేకరించి క్రోడీకరించారా లేదా పరిశీలించాలి.

7.గ్రామ స్థాయి సిబ్బంది ఇబ్బందులను అవసరాలను అడిగి తెల్సుకోవాలి.

8.జమాబందీకి హాజరైన రైతాంగాన్ని ప్రభుత్వ జలవనరుల పరిస్థితిని, నీటిసరఫరా గురించి అడిగి తెల్సుకోవాలి.

9.పంచాయితీ కార్యదర్శులు చూపిన గ్రామ పతం, ఫీల్డు పుస్తకములు, ఎ-రిజిస్టరు, సర్వే పరికరాలు (గొలుసు, క్రాస్ స్టాప్, మేకులు, 10 లింకుల కర్ర, స్కేలు, బిట్టు) సక్రమంగా ఉన్నాయో, లేదో పరిశీలించాలి.

10.కరువు నివారణా కార్యక్రమములు పరిశీలించి, కరువు పనులు కొనసాగించ వలసిన అవుసరం ఉందో, లేదో పరిశీలించాలి.

8. **జమాబంది - చెక్‌మెమో:** గత ఫసలీ జమాబందీ చెక్ మెమోలో సూచించిన లోపములు సవరించబడి ఉండాలి. జమాబందీ చెక్ మెమోలో 52 అయిటములు నాల్గు భాగాలలో ఉంటాయి. మొదటి భాగంలో గ్రామం యొక్క భౌగోళిక వివరములు తెలియజేయాలి, రెండవ భాగంలో గ్రామ లెక్కల నిర్వహణ గురించి తెలియజేయాలి. మూడవ భాగంలో పంచాయితీ కార్యాదర్శి విధినిర్వహణకు సంబంధించినవి, నాల్గవ భాగంలో ల్యాండు రెవెన్యూ, నాన్ ఎగ్రికల్చరల్ ఎసెస్మెంటు డిమాండు, వసూలు నిల్వల వివరాలు, గ్రామ చావిడి నిర్వహణ, బాటిన్ ల్యాండ్సు మిగులు భూముల వివరాలు పొందుపరచాలి.

9. **డిమాండు:** గ్రామ డిమాండు సక్రమంగా ఉందని భావించినచో, గత ఫసలీ డిమాండు కంటే పెరిగినదో తగ్గినదో పరిశీలించాలి. తగ్గినచో డిమాండు తగ్గుటకు (Short Demand) కు కారణములు 8-ఎ ఫారములపైన, డిమాండు రిజిస్టరులోను నమోదుచేసిన పిదప, జమాబందీ ఆఫీసరువారు గ్రామ లెక్క 4 (డిమాండు), 8-ఎ (జలాధారముల గోష్వారా), మండల లెక్క 11 (మిస్లేనియస్ రెవెన్యూ) మరియు 12 (సెటిల్డు డిమాండు)లపై సంతకం చేసి, వి.ఎ.నెం.4పై సీలు వేయాలి. ఆ ఫసలీ జమాబందీ చెక్ మెమో సంతకం చేయాలి.

10. **అర్జీలు**: జమాబంది కి హాజరైన రైతాంగం, ప్రభుత్వ భూములు పట్టాపై కోరుచూ, లేదా లీజుకు కోరుచూ దరఖాస్తులు చేయవచ్చు, పంటలు పాడైపోయిన వారు రెమెషన్ కొరకు దరఖాస్తులు చేయవచ్చు, ఆక్రమణదారులు తమ ఆక్రమణలు క్రమబద్దీకరించవలసినదిగా కోరవచ్చు, పట్టా దారు పాసుపుస్తకముల కొరకు అర్జీలు రావచ్చు.

క్షేత్ర పరిశీలన, సర్వే నిర్వహణ అవుసరంలేని కేసులలో, అర్జీలు జమాబందీ సమయంలో పరిష్కరించవచ్చును. క్షేత్ర పరిశీలన, సర్వేనిర్వహణ అవుసరమైన కేసులలో అర్జీదారులకు సంతృప్తి కరముగా సమాధానమిచ్చి, అట్టి కేసులు సత్వర పరిష్కారానికి మండల రెవెన్యూ అధికారికి (రశీదుపొంది) అప్పగించాలి.

## 18. ప్రభుత్వ భూములు - పంట భూములు

### అజమాయిషీ

అజమాయిషీ అంటే భూముల వినియోగం, పంటలు, పంట కాలువలు, మురుగు కాలువలు, చెరువులు, భూముల హద్దులు, సర్వేదార్లు ప్రభుత్వ భూములలో ఆక్రమణలు, చెట్లు, చెట్ల ఫలసాయం, తణఖీ చేసి, గ్రామ లెక్క నెం.3 అడంగలులో నమోదు చేయడం. ఈ ప్రక్రియ నిరంతరాయంగా ప్రతినెలలో 20-25 తేదీల మధ్య విధిగా నిర్వహించాలి.

**<u>1.భూమిని గుర్తించే విధానం:-</u>** గుర్తించవలసిన భూమి యొక్క సర్వే నెంబరు/లెటరు దానివిస్తీర్ణం, భూ యజమాని పేరు, తండ్రి పేరు అడంగలు ఆధారంతో తెల్సుకోవాలి. గ్రామ పఠం ఎదురుగా ఉంచుకొని గుర్తించవలసిన సర్వే నెంబరు గ్రామానికి ఏదిశలో ఎంత దూరంలో ఉందో, అక్కడకు చేరేమార్గాలు ఏమిటో గుర్తించాలి. తర్వాత F.M.B లో ఆ సర్వే నెంబరు పరిశీలించి, గుర్తించవలసిన భూమికి హద్దులలోను సర్వే/ సబ్ డివిజను నెంబర్లు, వాటి విస్తీర్ణములు, వాటి యజమానుల వివరములు పరిశీలించాలి. గ్రామపఠం సహకారంతోగాని, ఐ.స్కె చ్ (Identification Sketch) సహాయంతోగాని భూమి వద్దకుచేరి, అక్కడ ఉండే రైతాంగాన్ని కూడ అడిగి, హద్దులలో గల వ్యక్తుల వివరములు, గుర్తించిన భూమి యొక్క యజమాని వివరములు, సరిచూసుకొవాలి. F.M.B లోని స్కెచ్ ఆధారముగా భూమి యొక్క ఆకారము, కొల్తలు పరిశీలించుకొని, గుర్తించిన భూమి సరియైనదనే నిర్ధారణకు రావాలి.

**2. <u>అజమాయిషీలో పరిశీలించవలసిన అంశములు:-</u>**

1. సర్వేదార్లు, సరిహద్దులు సక్రమంగా ఉన్నాయా? లేదా?
2. పట్టాదారు/ కౌలు దారు వివరాలు 11 నుండి 15 కాలములతో సరిపోయాయా? లేదా?
3. ఏ పంట ఏ సీజనులో ఏ నెలలో విత్తారు? పంట పరిస్థితి పంట దిగుబడి అంచనా ఏవిధంగా ఉంది?
4. పండించిన పంటకు ప్రభుత్వ జలవనరుల నుండి నీటి పారుదల పొందుచున్నారా? లేదా? ఆయకట్టులో చేర్చబడినదా? లేదా? అక్రమ పద్ధతిలో నీటి పారుదల పొందుచున్నారా?
5. పంట నష్టం జరిగితే - అందుకు గల కారణాలు - ప్రకృతి వైపరీత్యము (తుఫానులు/వరదలు) వల్లనా? అనావృష్టి, చీడపీడల వల్లనా? దిగుబడి ఎలా ఉంది?
6. పోరంబోకు భూమి అయినచో లేదా బంజరు/ ప్రభుత్వ భూమి అయినచో ఆక్రమణకు గురైనదా? ఆక్రమించబడితే ఆక్రమణ ఎంతకాలం నుండి, ఏవిధంగా, ఆక్రమించబడింది? ఆక్రమణ స్వభాము (ఆక్షేపణకరమైనదా? కాదా?) ఆక్రమణదారు పేరు, సాంఘిక/ ఆర్థిక స్థితి, అర్హుడా? అనర్హుడా?).
7. పోరంబోకు భూములలోగల చెట్ల వివరములు, వాటి వయస్సులు, కాచేవి, కాయనివి, చెట్ల ఫలసాయం

**ఎవరు, ఏవిధంగా అనుభవిస్తున్నారు?**

8. పట్టాపై యిచ్చిన, ప్రభుత్వసాగు భూములు/ నివేశన స్థలములు లబ్ధిదార్లు/ వారి వారసులే అనుభవిస్తున్నారా? అన్యాక్రాంతమైనవా? అన్యాక్రాంతమైనచో ఎవరి స్వాధీన భుక్తములలో ఉన్నాయి? ఏవిధంగా? అన్యాక్రాంతముకానిచో పట్టా షరతుల ఉల్లంఘన ఏమైనా జరిగినదా?

9. ట్రీ పట్టాదారులు – ట్రీ పట్టా షరతులు ఉల్లఘించి ప్రభుత్వ భూమిని అన్యాధా వినియోగించుచున్నారా?

10. ప్రభుత్వ భూములు సాగుకు/ అనుభవమునకు లీజుకు యిచ్చి యున్నచో లీజుదారు లీజు షరతులకు లోబడి అనుభవించుచున్నారా? షరతుల ఉల్లంఘన జరిగినదా?

11. స్థానిక సంస్థలకు, కంపెనీలకు, ఫ్యాకర్టరీలకు, రిజిస్టర్డు కో–ఆపరేటివ్ సొసైటీలకు అన్యాక్రాంతము (alienate) చేసిన భూములు అన్యాక్రాంత నిబంధనలకు లోబడి అనుభవించుచున్నారా? షరతుల ఉల్లంఘన జరిగినదా?

12. ప్రొహిబిటివ్ ఆర్డరు బుక్ (నిషీధపు ఉత్తర్వుల రిజిష్టరు)లో పొందుపరచిన ప్రభుత్వ భూముల ఆక్రమణలకు గురికాకుండా, లీజుకుగాని, పట్టాపై మంజూరుకుగాని సిఫార్సు చేయబడకుండా పరీరక్షించ బడుచున్నాయా?

13. చెరువులు, కుంటలు, మురుగు కాల్వలలో పెరిగే మత్స్య సంపద ఎవరు ఏ విధంగా అనుభవిస్తున్నారు? పంచాయితీకి గాని/ ప్రభుత్వానికి గాని అట్టి మత్స్య సంపదపై ఆదాయం వస్తోందా?

పై అంశములు జాగ్రత్తగా పరిశీలించి, సంబంధింత గ్రామ లెక్కలలో నమోదు చేయాలి. ఎప్పటి కప్పుడు తాజా పరుస్తూ ఉండాలి. అజమాయిషీకి సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లు 1.ఎ–రిజిష్టరు డైగ్లటు/ శెత్‌వారు రిజిష్టరు 2.గ్రామపటం 3.ఐ.స్కెచ్చి 4.ఫీల్డు పుస్తకం 5.గ్రామ లెక్క నెం.1,. 3., 4సి., 5.పి.ఓ.బి, 6 డి. ఫారం పట్టా దార్ల రిజిష్టరు 7.నివేశన స్థలముల పట్టాల రిజిష్టరు 8.ట్రీ పట్టా దార్ల రిజిష్టరు 9.ఆయకట్టు రిజిష్టరు 10.అన్యాక్రాంతముల రిజిష్టరు 11.ఆక్రమణ రిజిష్టరు 12.లీజుల రిజిష్టరు.

ప్రభుత్వ భూములలో ఆక్రమణలు చేసినా, పాత ఆక్రమణల విస్తీర్ణములు పెంచినా, కుదించినా కొల్తలతో పఠం తయారుచేయాలి. ఆక్రమణలకు బి.మెమో తో బాటు సెక్షన్ 7 నోటీసులు (డుప్లికేటులో) విధిగా తయారు చేసి మండల రెవెన్యూ అధికారి వార్కి ఆమోదముకొరకు పంపాలి.

# 19. వ్యవసాయ గణాంకాలు

ప్రతి మాసంలోను సాగుచేసిన పైరుల వివరాలను దీర్ఘకాలపు పంటలు, తోటల క్రింద ఉన్న విస్తీర్ణాన్ని వివిధ జలాధారాల క్రింద పారుదలైన విస్తీర్ణాన్ని సర్వే/సబ్‌డివిజన్ నెంబరు వారీగా తనిఖీ చేసిన అడంగలు/పహాణిలో సంబంధిత గడువులలో నమోదు చేయాలి. ప్రతి మాసంలో కోత కోసిన పైరుల దిగుబడులను అంచనావేసి సర్వే/సబ్‌డివిజన్ నెంబరు వారీగా నమోదు చేయాలి. సంవత్సరాంతమున భూమి వినియోగ వివరాలను 9 భాగాల క్రింద వర్గీకరించి వ్రాయాలి. అడంగల్/పహాణీ గడులు నింపేందుకు సూచనలు జతపచడమైనది.

అడంగల్/పహాణీలో నమోదు చేసిన పంటల వివరాల ఆధారంగా గ్రామమునకు పైరువారీ సాగు మరియు పారుదల విస్తీర్ణాన్ని ప్రతి మాసానికి మరియు ఆ మాసాంతం వరకు మాసవారీ లెక్క తయారు చేయాలి. ఈ మాసవారీ లెక్కలో ఆ నెలాఖరు వరకు కోత కోయబడిన వివిధ పైరుల విస్తీర్ణం, దిగుబడి అంచనా తరగతులలో విభజించి గడులలో వ్రాయాలి. ఆ నెలాఖరుకు మొత్తం సాగైన విస్తీర్ణంలో మొదటి పంట మరియు రెండవ పంట విస్తీర్ణం కూడా చూపాలి. ఈ మాసవారి లెక్క మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టరు ద్వారా మండలాధికారికి నెలాఖరుకు పంపాలి.

ప్రతి సంవత్సరం ఖరీఫ్/రబీ సీజనులో అర్థగణాంక శాఖ వారు వ్యవసాయ గణన నిర్వహిస్తారు. ఈ వ్యవసాయ గణనను నిర్ధేశించిన గ్రామ గోష్వారాలో పంటల వారీ విస్తీర్ణం, జాలాధారం క్రింద పారుదలైన విస్తీర్ణం మరియు పైరుల వారీ, జలాధారాల వారీ పారుదల విస్తీర్ణం, జలాధారాల సంఖ్య, భూమి వినియోగ వివరాలను తెలియజేయాలి. ఈ గ్రామ గోష్వారాలను నిర్ణీత తేదీలలో ఖరీఫ్/రబీ సీజన్‌లకు మండల రెవిన్యూ అధికారికి పంపాలి.

ప్రతి మాసానికి వర్షపాత వివరాలు, జలాధారంలో నీటి నిల్వలు, నాటిన పైరులకు ఆ నీరు ఎన్ని రోజులకు సరఫరా అవుతుంది. పంటల పరిస్థితి మొదలైన వివరాలతో తయారుచేసిన వాతావరణ పంటల పరిస్తితిపై నివేదికను మండల రెవిన్యూ కార్యాలయానికి పంపాలి.

సకాలంలో పైర్ల విస్తీర్ణం, ఉత్పత్తులను, అంచనా వేసేందుకు భారత ప్రభుత్వం వారు నిర్ణీత కాలంలో పంటల అంచనా నివేధిక పథకం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అమలు చేయుచున్నారు. ఈ పథకం క్రింద ఎంపిక చేసిన గ్రామాలలో పంటల విస్తీర్ణాన్ని సకాలంలో నమోదు చేసి నిర్ణయించిన కార్డుల ద్వారా విస్తీర్ణ వివరాలను నిర్ణీత తేదీలో అర్థగణాంక శాఖ వారికి పంపవలసి ఉన్నది. కానీ ఎంపిక చేసిన గ్రామాలలో పైరులు సాగుచేసిన వెంటనే పొలాలను సందర్శించి విస్తీర్ణాన్ని అడంగలు/పహాణీలో నమోదు చేయాలి. వీటి ఆధారంగా పైరు వారీ విస్తీర్ణం వివరాలను కార్డుల ద్వారా అర్థగణాంక శాఖ వారికి పంపాలి.

ప్రకృతి వైపరిత్యాలు అంటే అనావృష్టి, వరదలు, తుఫాను, వడగండ్లు మొదలగునవి సంభవించినపుడు జరిగిన నష్టం వివరాలను అంచనా వేయవలసి ఉన్నది. ముఖ్యంగా పైరుల విస్తీర్ణంలో తగ్గుదల మొదలగునవి అంచనా వేసి ప్రత్యేక నివేధికను పంపాలి. దిగుబడి వివరాలను అంచనా వేసేందుకు ప్రత్యేకంగా పంట కోత ప్రయోగాలను నిర్వహించాలి.

పంటల ఉత్పత్తిని అంచనా వేసేందుకు అర్థగణాంక శాఖ ఆధ్వర్యంలో ప్రధాన పంటలపై పంటకోత ప్రయోగాలు జరుపబడుచున్నవి. ఈ పంటకోత ప్రయోగాల ఫలితాలను పంటల భీమా పథకం అమలులో ఉపయోగిస్తున్నారు. కావున ఎంపిక చేసిన గ్రామాలన్నిటిలోను పంటకోత ప్రయోగాలు సక్రమంగా నిర్వహించేందుకు గ్రామ కార్యదర్శి సర్వే నెంబరు/క్షేత్రములను సక్రమంగా తెలియపరచడంలోను, ఈ ప్రయోగాలను నిర్వహించేందుకు రైతుల సహకారం చేకూరుటలోను, గ్రామ కార్యదర్శి గణాంకులకు తోడ్పడాలి. అంతేకాక, ఒక పర్యాయంలో కాకుండా వివిధ కాలాలలో కోతకు/తీతకు వచ్చే పంటలకు అంటే, ప్రత్తి, ఆముదం, పొగాకు, మిరప మొదలగు పంటలపై ప్రయోగాలను గ్రామ కార్యదర్శులు నిర్వహించవలసి యున్నది. మరియు ఈ ప్రయోగాలు నిర్వహించేందుకు గ్రామానికి వచ్చిన వ్యవసాయ శాఖ, రాష్ట్ర గణాంక శాఖ జాతీయ నమూనా సంస్థ (ఎన్.ఎస్.ఎస్). అధికారులకు గ్రామ రికార్డులు అందజేసి వారు ప్రయోగాలను సక్రమంగా నిర్వహించేదుకు తోడ్పడవలసియున్నది.

## ౨౦. ప్రకృతి వైపరీత్యాలలో, పంచాయితీ సెక్రటరీ చేపట్టవలసిన చర్యలు

ప్రకృతి వైపరీత్యాలు సంభంవించినప్పుడు ప్రాణాలను, జీవరాశులను, ఆస్తిని కాపాడు కొనేలా గ్రామం తన స్వంత అత్యవసర ప్రణాళిక తయారు చేసుకోవటంలో కొన్ని మార్గదర్శక సూత్రాలను ఇవ్వటం చాలా అవసరం. పంచాయితీ సెక్రటరీ ఈ పనుల్లో ఇతరుల సహాయంతో చాలా చురుకుగా చేయగలడు.

**గ్రామ అత్యవసర ప్రణాళిక అంటే ఏమిటి?**

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఆస్తినష్టం, జీవరాశుల నష్టం, ప్రాణనష్టం తగ్గించటానికి తీసుకోవలసిన చర్యలజాబితాను గ్రామ అత్యవసర ప్రణాళిక అంటారు.

ఆ గ్రామం ప్రజలు, భౌగోళిక పరిస్థితులు, వనరులు, కలిసి నిర్ణయం తీసుకునే విధానాలు ఒక్కోగ్రామానికి ఒక్కోరకంగా ఉంటాయి. కాబట్టి గ్రామ అత్యవసర ప్రణాళిక ఒక్కొక్క గ్రామానికి ఒక్కొక్క రకంగా ఉంటుంది.

పొలాలను, ఇళ్ళను ముంపునకు గురి చెయ్యగల చెరువులు, కాలువలు, మొదలైన వాటిని గుర్తించాలి. గత అనుభవాల ఆధారంగా ఏ ప్రాంతం వరదకు గురవుతుందో ప్రజల చెప్పగలుగుతారు. ఇటువంటి ప్రాంతంలో మట్టి ఇళ్ళు నష్టానికి గురవుతాయి. అటువంటి ప్రదేశములను గుర్తించాలి.

ఈ జాబితా ఆధారంగా గ్రామస్తులు తమ ఊరిలో భౌగోళికంగా బలహీన ప్రాంతాలు ఏవి, పల్లపు నివాస ప్రాంతాలు వాటివల్ల ఎవరు నష్టపోతారో, ఏమి నష్టపోతారో గుర్తించ గలుగుతారు. వీటిని 4వ దశలో ప్రస్తుతిస్తాము. ఈ బలహీనతలను సరిదిద్దటం పై అత్యవసర ప్రణాళిక ఎంతగానో ఆధారపడుతుంది.

అత్యంత నష్టానికి గురయ్యే ప్రజలెవరో, ప్రాంతాలేవో గుర్తించి వాళ్ళని రక్షించటానికి ఏమి చేయ్యాలో నిర్ణయించటం ఆ తరువాతి దశ.

గతంలో సంభవించిన తుఫాను అనుభవం ఆధారంగా ఎవరు ఎక్కువ నష్టానికి గురి అయ్యే అవకాశం ఉందో గ్రామ ప్రజలు గుర్తిస్తారు. ఎవరు నష్టానికి గురవుతారు. ఏమి నష్టానికి గురవుతాయి. అన్న జాబితా తయారు చేసి వాటిని మీద గుర్తించాలి. ఉదాహరణకు

| ఎవరు నష్టానికి గురవుతారు | ఎవరు నష్టానికి గురవుతారు |
|---|---|
| ➢ వృద్దులు, వికలాంగులు | ➢ పశువులు |
| ➢ పిల్లలు, గర్భిణీ స్త్రీలు | ➢ ఇంటిలో విలువైన వస్తువులు |
| ➢ జబ్బు పడ్డ వాళ్ళు | ➢ ఇళ్ళు, బలహీన నిర్మణాలు |
| ➢ వంటరి మహిళలు | ➢ పడవలు, వలలు, ఎండు చేప నిల్వలు |
| ➢ సముద్రానికి దగ్గరా నివసిస్తున్న కుటుంబాలు | ➢ మోటారు పంపులు, ఇతర సదుపాయాలు |
| ➢ పూరిళ్ళల్లో ఉంటున్న కుటుంబాలు | ➢ మగ్గాలు ఇతర ఆస్తులు |
| ➢ సముద్రంలోకి వెళ్ళిన బెస్తవారు | ➢ పంటలు, పండ్ల చెట్లు, తోటలు |
| ➢ ఇటువంటి ఇతర బృందాలు | ➢ గ్రామ మంచినీటి వనరులు |

ముందు జాగ్రత్త చర్యలు, అత్యవసర పనులు చేపట్టటానికి కావలసిన నిధులు ఎక్కడ నుండి వస్తాయి? ఉదాహరణకు

1. తూర్పు గోదావరి జిల్లాలోని శివకృష్ణ పల్లి అన్న గ్రామంలో ప్రతి కుటుంబం వంద రూపాయల చందా వేసుకుంది. ఈ నిధులతో తుఫానుల కాలానికి ముందే గ్రామానికి అవసరమయ్యే ధాన్యం, ఇందనం, బ్లీచింగ్ పౌడరు, అత్యవసర మందులు వంటివి కొని ఉంచుతారు.
2. తుఫాను కాలం రావటానికి ముందుగానే తుఫాను షెల్టర్ల నిర్మణం, మరమ్మత్తులకు, గాలిని నిరోధించే చెట్లు నాటటం వంటి పనులను ప్రభుత్వం చేపడుతుంది, లేదా నిధులు కేటాయిస్తుంది. ఈ పనులు జరిగేలా చూడాలి.

- అత్యవసర ప్రణాళిక పనులను అమలు చేయగల, పర్యవేక్షించగల ఉత్సాహపూరిత, బాధ్యతాయుత పురుషులు, స్త్రీలు, యువవాలంటీర్లు కార్యకర్తల ను గుర్తించాలి. **ఉదాహరణకు** – గ్రామ యువజన సంఘాల సభ్యులు, స్వయం సహాయక బృందాల మహిళా సభ్యులు, చదువుకున్నావారు, టీచర్లు వంటి వారు, కార్యకర్తలను గుర్తించిన తరువాత వాళ్ళు నెరవేర్చవలసిన బాధ్యతలలో శిక్షణ నివ్వాలి.
- నష్టాల పటం తయారు చేసే సమయంలో ఆస్తినష్టం, ప్రాణనష్టం తగ్గించటానికి గుర్తించిన ముందు జాగ్రత్త చర్యలు.

## ప్రణాళికను ఎప్పుడు, ఎవరు అమలు చేస్తారు

## (పని చేసే బృందాలు)

అయిదవ దశలో అవకాశాల పట్టిక తయారు చేస్తున్నప్పుడు గ్రామస్తుల తమలో నుంచి ఉత్సాహం, బాధ్యత గల పురుషులు, స్త్రీలు యువతను అత్యవసర ప్రణాళిక అమలు చేయటానికీ, గుర్తిస్తారు. ఉదాహరణకు – యువజన సంఘాల సభ్యులు, గ్రామ స్వయం సహాయక బృందాల మహిళా సభ్యులు, చదువుకున్న యువత, పాఠశాల టీచర్లు, మొదలైనవారు.

గ్రామ విస్తీర్ణాన్ని బట్టి, అప్పచేప్పే బాధ్యతను బట్టి ఎంపిక చేసిన 5–10 సభ్యులు గల చిన్న కార్యాచరణ బృందాలుగా చేస్తారు. ప్రతి బృందం తమకు ఇచ్చిన బాధ్యతలను ఉదాహరణకు హెచ్చరిక, సహాయం వంటి పనులను అమలు చేయాలి.

ఈ బృందాల నాయకులు అంతా కలసి ఒక సమన్వయ సంఘంగా ఏర్పడతారు. బృందం సభ్యులంతా కలసి తాము చేయాల్సిన పనులను నిర్ణయిస్తారు. సమన్వయ సంఘం బృందాల పనులను పర్యవేక్షిస్తుంది, తుఫాను ముప్పును ఎదుర్కోటానికి గ్రామం తయారుగా ఉండేలా చూస్తుంది.

ఏ కార్యాచరణ బృందాలు ఉండాలో, వాటి బాధ్యతలు ఏమిటో ప్రతి గ్రామం నిర్ణయించుకోవాలి. అయితే ప్రతి బృందానికి తుఫానుకు ముందు, తుఫాను సమయంలో ఆ తరువాత చేపట్టవలసిన ప్రత్యేక బాధ్యతలు ఉంటాయి.

**తుఫానుకు ముందు:** తుఫానుల కాలానికి అంటే ఏప్రిల్ – మే, అక్టోబర్ – డిసింబర్‌కు కొన్ని వారాల

ముందే తుఫానును ఎదుర్కోటానికి తీసుకోవలసిన చర్యలు తీసుకోవాలి. అన్ని బృందాలు తుఫాను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి.

**తుఫాను సమయంలో:** తుఫాను తాకబోయేటప్పుడు, అంటే హెచ్చరిక లభించగానే లేదా తుఫాను సమయంలో తీసుకోవలసిన చర్యలు. తుఫాను హెచ్చరిక వినగానే, తుఫాను సమయంలోనూ ప్రజలను, వారి వస్తువులను అవసరమైనపుడు సురక్షిత ప్రాంతాలకు తరలించాలి.

**తుఫాను తరువాత:** తుఫాను తాకిడికి నిలదొక్కుకుని, తిరిగి కోలుకునే చర్యలు.

**కొన్ని కార్యాచరణ బృందాల ఉదాహరణలు ఇక్కడ ఇచ్చాం**

**తుఫాను హెచ్చరిక బృందం:**

గ్రామంలోని 17-25 సంవత్సరాల యువతీ యువకులు ఈ బృందంలో సభ్యులుగా ఉండవచ్చు. రేడియో హెచ్చరికలను అర్థం చేసుకోవటంలోనూ, సమాచారాన్ని వేగంగా గ్రామ మంతటికీ చేరవేయటంలోనూ వీరికి శిక్షణ నిస్తారు.

**షెల్టరు యాజమాన్య బృందం:**

ఈ బృందంలో మహిళా సభ్యులు ఎక్కువగా ఉండవచ్చు. వాళ్ళు షెల్టర్లలో, పక్కా ఇళ్ళలో ఉంటూ తరలించబడిన వారి ఆహారం, నీరు, మందులు మొదలయిన అత్యవసర బాధ్యతలను చేపడతారు.

**తరలింపు రక్షక బృందం:**

ఈ బృందంలోని సభ్యులు బలంగా 20న-35 సంవత్సరాల మధ్య ఉండాలి. వీరికి తరలింపు, రక్షణ పద్ధతుల్లో శిక్షణ నివ్వాలి.

**ప్రథమ చికిత్స వైద్య సహాయ బృందం**

ఈ బృందంలో స్త్రీ, పురుషులు సమాన సంఖ్యలో ఉండాలి. ప్రథమ చికిత్స గురించి అవగాహన ఉన్నవారికి, నర్సింగ్‌లో శిక్షణ పొందినవారికి ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రథమ చికిత్సకీ వైద్య సహాయానికి పనికి వచ్చేలా బృందానికి పూర్తి శిక్షణ ఇవ్వాలి.

**పారిశుద్ధ్య బృందం:**

షెల్టర్లలోపల, బయట పారిశుద్ధ్య బాధ్యతలను స్త్రీ, పురుషులు ఉన్న బృందాలు చేపట్టాలి.

**సహాయ (రిలీఫ్) బృందం:**

ఇతర బృందాలన్నింటికి కావలసిన సహాయ, అవసరాను - ఆహారం, పాత్రలు, బట్టలు, కిరోసిన్, డీజిల్ మొదలైనవి ఈ బృంద సభ్యులు సేకరించి, సరఫరా చేసి, సమన్వయ పరచాలి. గ్రామానికి సరిపోయేటంత మోతాదులో వస్తువులు సకాలంలో సరఫరా కావటానికి బృందంలోని స్త్రీ, పురుష సభ్యులు స్థానిక అధికారులతో మాట్లాడ గలిగి ఉండాలి.

**ఇతర బృందాలు:**

గ్రామ ప్రజలు తమ అవసరాలు, సమస్యల ఆధారంగా ఇతర బృందాలను కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. ఉదాహరణకు

- పహరా లేదా గస్తీ బృందం: ఇళ్ళు వదిలి పెట్టి వెళ్ళిన వారి ఆస్తులను కాపాడుతుంది.
- ప్రభుత్వం, ప్రజల మధ్య సమన్వయ బృందం: గ్రామంలో తీసుకున్న ముందు జాగ్రత్త చర్యలు స్థానిక అధికారులకు తెలియ చేసి ప్రజల అవసరాలను వారికి తెలియ చేస్తుంది. గ్రామానికి అవసరమయ్యే మరమ్మత్తులు, ముందు జాగ్రత్తకు కావలసిన నిర్మాణాల కోసం దరఖాస్తులు వంటివి పూర్తి చేయటంలో సహాయ పడుతుంది.

**వ్యక్తులు, కుటుంబాల బాధ్యతలు:**

తుఫానును గ్రామం ఒక పద్ధతి ప్రకారం ఎదుర్కోవాలంటే వ్యక్తులు, వారి కుటుంబాలు తమకై తాముకొన్ని బాధ్యతలు చేపట్టటానికి సిద్ధం కావాలి.

తుఫాను రావటానికి కొన్ని నెలల ముందే కార్యాచరణ బృంద సభ్యులు మిగిలిన గ్రామస్తులతో సమావేశం జరపాలి. ఇందులో

- అత్యవసర కార్యక్రమాలను అమలు చేయటంలో వారి సహాయాన్ని కోరాలి.
- వివిధ కార్యాచణ బృందాలు ఏమి చేయవలెనో చెప్పి వ్యక్తులుగా కుటుంబాలుగా వాళ్ళు ఏమి చేయాలో చెప్పాలి.

ఉదాహరణకు: కుటుంబాలు చేయవలసిన పనులు

**తుఫానుకు ముందు:**

- తుఫానుకు తట్టుకోగల ఇళ్ళ నిర్మాణానికి ప్రణాళిక తయారు చేసుకోవాలి, ఉన్న ఇళ్ళకు కప్పులకు బలోపేతం చేసుకోవాలి.
- తుఫాను సమయంలో ఆధారపడటానికి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను తయారు చేసుకోవాలి.
- పక్కా ఇళ్ళు ఉన్న వాళ్ళ దగ్గర తమ విలువైన సామానులను దాచి ఉంచే ఏర్పాట్లు చేసుకోవాలి.
- కుటుంబంలోని మిగిలిన వాళ్ళకోసం చూడకుండా ఎవరికి వాళ్ళు షెల్టర్లకు చేరుకునేల ఏ షెల్టర్‌కు చేరుకోవాలో, ఏ మార్గంలో చేరుకోవాలో కుటుంబ సభ్యులందరికీ చెప్పాలి.
- ఆదాయాన్ని ఇవ్వని పశువులను అమ్మివేయాలి.

**తుఫాను సమయంలో (తుఫాను హెచ్చరిక అందిన తరువాత):**

1. ఇంటి కప్పులకు మేకులు దిగ కొట్టాలి, ఖాళీలుంటే సరిచేయాలి.
2. తుఫాను షెల్టరుకు వెళ్ళే మార్గం ఒక్కసారి చూసుకోవాలి.

3. ఇంటిలో వదులుగా ఉండే చెక్క ముక్కలు, కట్టెపుల్లలు, లేకుడా చూడాలి. ఇవి గాలికి ఎగిరిపోయే ప్రమాదానికి కారణమవుతాయి.

4. వరద కట్టలలో గండ్లు ఉన్నాయేమో చూసి సరిచేయాలి. లేకపోతే వాటి నుండి వరద నీళ్ళు లోపలికి వస్తాయి.

5. విలువైన వస్తువులను ప్లాస్టిక్ కాగితంలో చుట్టి దగ్గరలోనున్న పక్కా ఇళ్ళకు తరలించాలి. ఉదాహరణకు విత్తనం బస్తాలు, ఎరువుల బస్తాలు, ధాన్యం బస్తాలు, ఎండు చేపలు నిల్వలు.

6. పడవలు, వలలు, మగ్గాలు పంపుసెట్లు వంటి వ్యక్తిగత ఆస్తులు నష్టపోకుండా గట్టిగా కట్టివేయాలి. భద్రపరచాలి.

7. వస్తువులు, ఆస్తుల జాబితాను తయారు చేయాలి. దీనిని ప్లాస్టిక్ సంచిలో పెడితే తడవకుండా ఉంటుంది.

8. పశువులను మెట్ట ప్రదేశాలకు తరిలించి వాటికి తగినంత మేత ఉండేలా చూడాలి.

9. అధికారులెవరూ వ్యక్తిగతంగా సమాచారం అందించకపోయినప్పటికీ రేడియో పై ఆధారపడాలి.

10. కుటుంబానికి రెండు – మూడు రోజులు సరిపోయేలా నిల్వ ఉండే ఆహారాన్ని (గోధుమపిండి, మరమరాలు బెల్లం) కట్టుకోవాలి. నీళ్ళు, వస్తువులు తీసుకెళ్ళటానికి జెర్రి (ప్లాస్టిక్) క్యాన్లు, ప్లాస్టిక్ సంచులు సేకరించాలి.

11. నీటిని శుద్ధిపరిచే బిళ్ళలు, ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు, నీళ్ళు అవసరమయిన వస్తువులు, మందులు తీసుకెళ్ళాలి.

12. లాంతరు, అగ్గి పెట్టెలు, టార్చిలైటు వంటివి అందుబాటులో ఉంచుకోవాలి.

13. కుటుంబ సభ్యులు ఎక్కడున్నారో తెలుసుకుని తుఫాను వస్తే రక్షిత ప్రాంతానికి వెళ్ళటానికి తయారు కావాలి.

14. సమయానికి షెల్టరుకు వెళ్లటానికి సిద్ధంకావాలి. ఆలస్యం చేయవద్దు.

15. వాతావరణం తీవ్రంగా మారిన తరువాత లోపల ఉంటే బయటకు కదల వద్దు. పడిపోతున్న వాటివల్ల, గాలికి ఎగిరివస్తున్న వాటి వల్ల గాయాలు కావచ్చు. వరదలో కొట్టుకుపోవచ్చు.

16. మీ కుటుంబానికి వేరేగా వండుకోవడం కాకుండా సామూహిక వంట ఏర్పాట్లను ఉపయోగించుకోవాలి. దీని వల్ల పొగతగ్గటమే కాకుండా కట్టెపుల్లలు ఆదా అవుతాయి.

17. పుకార్లను ఎట్టి పరిస్థితులలోనూ నమ్మవద్దు. దీని వల్ల ప్రజలు అనవసరంగా భయాందోళనలకు గురవుతారు.

18. పక్కా ఇళ్ళల్లో పై అంతస్తులో ఉండేవారు క్రింది అంతస్తుకు మారాలి.

**తుఫాను తరువాత (తుఫాను తీరాన్ని దాటిన తరువాత):**

- కార్యాచరణ బృందాల సూచనలను పాటించాలి.
- సామూహిక వంటలో సహాయం, పారిశుద్ధ్యం పాటించడం, తప్పిపోయినవారి జాడకనుక్కోవటం వంటి పనులకు ముందుకు రావాలి.
- తాగునీటిని ఎలా శుద్ధి పరుచుకోవాలో తెలుసుకోవాలి.
- వ్యక్తిగత పారిశుద్ధ్యాన్ని పాటించాలి. కుటుంబ సభ్యులు పారిశుద్ధ్య సౌకర్యాలు ఉపమోగించేలా చూడాలి.
- కుటుంబ అవసరాలు, సమస్యలను శిబిర నిర్వాహకులకు చెప్పాలి.
- పరిష్కారాలు కనుక్కోటానికి చొరవ తీసుకోవాలి.
- తప్పిపోయిన వారి వివరాలు, ఎక్కడ తప్పిపోయి ఉండవచ్చో సంబంధిత అధికారులకు తెలియ చేస్తూ ఉండాలి.
- ప్రజలు చిక్కుకుపోయి ఉండటానికి అవకాశం గల ప్రదేశాలను రక్షణ బృందాలకు చూపించాలి. తప్పిపోయినవారు, వారిని ఆఖరుగా చూసిన ప్రాంతాలు తెలియచేయాలి.
- పడిపోయినచెట్లు, ఇళ్ళను తొలగించడంలో సహాయం చేయాలి.
- ఇళ్ళను వీలైనంత త్వరగా తిరిగి కట్టుకోవడం, మరమ్మత్తులు చేయడం ప్రారంభించాలి.

**పునర్నిర్మాణ, పునరావాస బృందం**

తుఫాను వల్ల జరిగిన నష్టం నుంచి గ్రామం కోలుకునేందుకు చేపట్టే చర్యలను ఈ బృందం పర్యవేక్షిస్తుంది. ప్రణాళిక తయారు చేయటంలో అనుభవం గల స్వయం సహాయ బృంద సభ్యులు, రైతు సంఘం సభ్యులు, ఇతర బృంద సభ్యులు ఈబృందంలో సభ్యులు కావచ్చు. గ్రామంలో పున:నిర్మాణ పనులకు ప్రభుత్వ సహాయం అందేలా చూడటం ఈ బృందం యొక్క ప్రధాన బాధ్యత.

**వీళ్ళ బాధ్యత:**

- పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్ళు, పూర్తిగా దెబ్బతిన్న ఇళ్ళు, ప్రాణనష్టానికి ప్రభుత్వం నుంచి సహాయం లభించేలా చూడాలి.
- గ్రామ పునర్నిర్మాణానికి కావలసిన సామగ్రిని గ్రామానికి చేర్చటంలో ప్రభుత్వ అధికారులకు సహకరించాలి.
- మంచి నీటి వనరులను పరీక్షించి బాగు చేసుకోవాలి.
- దెబ్బతిన్న రోడ్లు, పడిపోయిన కరెంటు స్తంభాలు, దెబ్బతిన్న రైలు మార్గాలు వంటి మౌళిక సదుపాయాలు బాగుచేయ్యటానికి ప్రభుత్వ సహాయం పొందాలి. అవి బాగు అయ్యేవరకు శ్రద్ధవహించాలి.

- ఇళ్ళ మరమ్మత్తుకు అవసరమయ్యే సామగ్రి, ఆదాయం ఇచ్చే పనులు ప్రారంభించటానికి అవసరమయ్యే డబ్బు కుటుంబాలకు అందేలా చూడాలి. ప్రభుత్వం, బ్యాంకులు, స్వచ్ఛంద సంస్థల నుండి డబ్బులు పొందవచ్చును.
- ఆర్థిక కార్యక్రమాలు తిరిగి చేపట్టటానికి ఎవరికి ఏం కావాలో జాబితా తయారుచేయాలి. ఉదాహరణకు చిన్న వ్యాపారస్తులకు తిరిగి సరుకు అందాలి. చేపలు పట్టే వాళ్ళకు వాటిని అమ్ముకోటానికి మార్కెట్టు కావాలి, కొత్త ఉపాధి చేపట్టేవారికి అందుకు శిక్షణ కావాలి. (ఉదా:ఇటుకరాళ్ళ తయారీ, సిమెంటు తలుపులు, కిటికీల తయారీ, పొలాలలో చౌడు, పూడిపోయిన బోరు బావులు బాగు చేయ్యడానికి సాంకేతిక సహాయం మొదలైనవి.
- ఈ సదుపాయాలను తిరిగి ఏ విధంగా కల్పించవచ్చో గుర్తించి అందుకు కావలసిన సహాయాన్ని ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల నుండి పొందాలి.

**వ్యక్తులు, కుటుంబాల బాధ్యత:**

తుఫానుకు గురయిన గ్రామ పునర్నిర్మాణం, పునరావాస పనులు కేవలం కార్యాచరణ బృందాల ద్వారా సాధ్యంకావు. పనులలో కార్యాచరణ బృందాలకు గ్రామస్తులు సహాయ పడకపోతే అవి బాగా జరగవు.

గ్రామస్తులు స్వయంగా పునరావాసం, పునర్నిర్మాణ పనులలో పాల్గొంటే సంతృప్తి కరమైన ఫలితాలు లభిస్తాయి.

గ్రామస్తులు, కుటుంబాలతో కార్యాచరణ బృందాలు అనేకసార్లు సమావేశాలు జరిపి తుఫాను తరువాత కార్యాచరణ బృందాల పాత్ర ఏమిటో, సాధ్యమయినంత త్వరగా కోలుకోటానికి గ్రామస్తులు ఏం చేయాలో స్పష్టపరచాలి.

**కుటుంబాలు చేయగలిగిన పనులు:**

- కార్యాచరణ బృందాలకు వాళ్ళపనిలో సహాయపడటం.
- మృతకళేబరాలు తొలగించే బృందానికి అవి ఎక్కడ ఉన్నాయో తెలియ చెయ్యటం.
- సహాయం అవసరమయినవారిని గుర్తించడంలో బృందానికి సహకారం,
- కుటుంబం అంతటిని ఒక్కచోట ఉంచి జరుగుతున్న పునర్నిర్మాణ పునరావాస పనులు వారికి వివరించడం.
- సాధ్యమయితే ఇళ్ళను తిరిగి కట్టుకోవటం మొదటుపెట్టి, ఇళ్ళలోకి సాధ్యమయినంత త్వరగా తిరిగి వెళ్లాలి.
- భూమి, బ్యాంకు భీమా వంటి దస్తావేజులు దగ్గర ఉంచుకోవాలి. నష్టపరిహారం పొందటానికి ఇవి రుజువులుగా పనికొస్తాయి.
- నష్టపరిహారం కోరే ముందు తప్పిపోయిన వ్యక్తులు, పశువులు, ఆస్తుల గురించి మరొక్కసారి

విచారించాలి.

- ఇళ్ళు, జీవనోపాధుల పున:నిర్మణానికి ఏమి కావాలో తెలుసుకోవాలి. కార్యచరణ బృందాలతో వీటి గురించి చర్చించాలి.
- అవసరాలలో ఏమేరకు గ్రామంలోనే పూర్తి చేసుకోవచ్చో గుర్తించి ఆ పనులు చేపట్టాలి.
- పున:నిర్మాణ పనులకు స్వచ్ఛందంగా ముందుకు రావాలి.
- తొందరపడి పశువులు, ఆస్తులు అమ్మివేయ వద్దు. అవి ఆ తరువాత కాలంలో ఉపయోగపడవచ్చు.

**ముగింపు:**

గ్రామ అత్యవసర ప్రణాళిక తయారయ్యి, రాసుకున్న తరువాత తీసుకున్న నిర్ణయాలను గ్రామ ప్రజలందరికి తెలియ చేయాల్సిన బాధ్యత కార్యాచరణ బృందాల సభ్యులది.

ఎవరెవరు ఏం చేయాలో, ఎక్కడికి వెళ్ళాలో స్పష్టం కావడానికి తుఫానుల కాలంలో అత్యవసర ప్రణాళికను ప్రయోగంగా ఒకసారి అమలు చేసి చూడాలి.

వర్షం కురుస్తున్న ఒక రాత్రి గ్రామంలో కరెంటు తీసివేసి ఉత్పత్తిగా కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలి. ఈ సమయంలో బృంద సభ్యులు వివిధ ప్రాంతాలకు వెళ్ళి కొంతమందిని, వస్తువులను రక్షిత ప్రాంతాలకు తీసుకెళ్ళాలి. ఇలా చేయ్యటం వల్ల ఎటువంటి సమస్యలు ఎదుర్కొంటారో తెలుస్తుంది. అత్యవసర ప్రణాళికను మెరుగు పరచటానికి ఈ అనుభవాలను ఉపయోగించవచ్చును.

గ్రామంలోని మార్పులు, ఉదాహరణకు కొత్త కుటుంబాలు, జననాలు, మరణాలు, కొత్త సదుపాయాల కల్పన వంటివి పటాలలో చేర్చి ఆ మేరకు అవసరాన్ని బట్టి ఎప్పటికప్పుడు ప్రణాళిక మార్పులు చేయ్యాలి.

తుఫానుల ముప్పును ఎదుర్కోవటానికి తయారు చేసిన అత్యవసర ప్రణాళిక గ్రామంలోని ప్రతి కుటుంబానికీ, ప్రతి ఒక్కరికి తెలిసి ఉండాలి. తాము తీసుకునే చర్చలకూ అత్యవసర ప్రణాళికకూ సంబంధం తెలుసుకోవాలి.

## 21. ఆంధ్రప్రదేశ్ (షెడ్యూల్డు కులముల, షెడ్యూల్డు తెగల మరియు (వెనుకబడిన తరగతుల) కుల ధృవీకరణ పత్రముజారి విధాన చట్టం 1993

(చట్టం 16/1993)

**1. ముఖ్య ఉద్దేశ్యము:**

ప్రభుత్వ ఉద్యోగములు పొందుటకు, విద్యా సంస్థలలో ప్రవేశము పొందుటకు, షెడ్యూలు కులములు, షెడ్యూలు తెగలకు, వెనుకబడిన తరగతుల వారికి రిజర్వు చేసిన స్థానములో అట్టి కులమునకు చెందని వ్యక్తులు, తప్పుడు సర్టిఫికెట్లు పొంది ఉద్యోగములు పొందడం, లేదా విద్యా సంస్థలలో ప్రవేశం పొందడం అదే విధంగా పై కులాల వారి ప్రభుత్వము ప్రభుత్వాధీన సంస్థలు కల్పించే ఆర్థిక సహాయము, సౌకర్యములు కూడ పొందుచున్నందువల్ల, అట్టి దుచ్చర్యలు అరికట్టి, అట్టి వారిపై కఠినముగా చర్య తీసుకొనుటకు, వాస్తవమైన షెడ్యూలు కులముల, షెడ్యూలు తెగల, వెనుకబడిన తరగతుల వార్కి అన్యాయం జరగకుండ రక్షణ కల్పించే ఉద్దేశంతో ఈ చట్టం రూపొందించబడినది. ఈ చట్టం 15-05-1997 నుండి అమలులోనికి వచ్చినది.

**2. ధృవీకరణ పత్రం జారి చేయుటకు విధానము:**

సెక్షన్ 3 ప్రకారం షెడ్యూలు కులముల, షెడ్యూలు తెగల, వెనుకబడిన తరగతుల వారు కుల, నివాస, జనన ధృవీకరణ పత్రం (Intigrated Community certificate) కొరకు రూలు- 5 అనుసరించి ఫారం 1 లో షెడ్యూలు వారు, ఫారం 2 లో షెడ్యూలు కులములు మరియు వెనుకబడిన తరగతుల వారు మండల రెవెన్యూ అధికారికి దరఖాస్తు చేస్తూ, కులము, నివాసము, జనన తేదీలను రుజువు పర్చే సాక్ష్య పత్రములను జతచేయాలి. (స్కూలు సర్టిఫికెట్లు, జనన రిజిస్టరు నకలు, మొదలగునవి) దరఖాస్తు పై అవసరమైన దర్యాప్తు నిర్వహించుటకు తగు సమయం ఉండేలాగున చాలా ముందుగానే (6 నెలల ముందుగా (రూలు-4)) దరఖాస్తు చేయాలి.

రూలు 5 ప్రకారం మండల రెవెన్యూ అధికారి అట్టి దరఖాస్తుపై సమగ్ర విచారణ జరిపి, తాను సాక్ష్య పత్రముల వివరములు సరియైనవని, భావించినచో 30 రోజులలోగా ఫారం 3 లో కుల, నివాస మరియు జనన తేదీ ధృవీకరణ పత్రాన్ని జారీ చేయాలి. (సెక్షన్-4) దరఖాస్తు తో జతపర్చిన సాక్ష్య పత్రములలో గల వివరములు సరిపోనిచో, కావలసిన అదనపు సాక్ష్యాధారములు కోరుచూ దరఖాస్తుదారునకు అతడు మైనరైనచో తండ్రి లేక సంరక్షకునికి ఫారం 4 నోటీసు జారీ చేసి, అదనపు సాక్ష్యాధారములను పొంది, కుల, నివాస జననతేదీలు రుజువైనచో ఫారం 3 లో ధృవ పత్రాన్ని 60 రోజులు లోపల మంజూరు చేయాలి.

సమగ్ర దర్యాప్తు చేసిన పిదప, మండల రెవెన్యూ అధికారి దరఖాస్తు దారు తనకులము, నివాసము లేదా జనన తేదీ రుజువు చేసుకోనట్లైతే, తిరస్కరిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలి.

ఐతే అనుమానాస్పద, వివాదభరితమైన కేసులను మండల రెవెన్యూ అధికారి జిల్లాస్థాయి స్క్రూటినీ కమిటీకి (జాయింటు కలెక్టరుకు) నివేదించి, అదేశాలు కోరాలి. రూ5-(1).

రూలు 6 ప్రకారము - కులము, నివాసము, జనన తేదీలను ఋజువు పర్చుకో వలసిన బాధ్యత దరఖాస్తు దారునిదే (సెక్షన్ - 6).

**3.అప్పీలు విధానం:**

సెక్షన్ 7 ప్రకారము: మండల రెవెన్యూ అధికారి ఉత్తర్వుపై 30 రోజులోగా సంతృప్తి చెందని వ్యక్తి జిల్లా కలెక్టరు వార్కి అప్పీలు చేసుకొవచ్చు. కలెక్టరు వారు అప్పీలు దారు వాదనను పరిశీలించిన పిదప, మండల రెవెన్యూ అధికారి ఉత్తర్వులను త్రోసి పుచ్చవచ్చును. లేదా ఖాయపర్చవచ్చును. జిల్లా కలెక్టరు వారి ఉత్తర్వులు స్టేటు గెజిట్‌లో ప్రచురించిన 30 రోజుల లోగా ప్రభుత్వానికి అప్పీలు చేసుకోవచ్చు, ప్రభుత్వమువారు అప్పీలుదారు వాదనను పరిశీలించిన పిదప, కలెక్టరు వారి ఉత్తర్వును త్రోసి పుచ్చవచ్చు లేదా ఖాయపర్చవచ్చును. ఈ విషయములో ప్రభుత్వమునకు రెవ్యూ చేయు అధికారముకలదు, అధికారులు యిచ్చిన ఉత్తర్వులు నిలుపుదల చేయు అధికారముకలదు.

**4.తప్పుడు కుల ధృవీకరణ పత్రాలు పొందిన వారిపై చర్యలు:**

సెక్షన్ 11 ప్రకారం తప్పుడు కులధృవీకరణ పత్రం ఆధారంగా షెడ్యూలు కులము, షెడ్యూలు తెగ, లేదా వెనుకబడిన తరగతులకు చెందని వ్యక్తి ఆకులములకు నిర్దేశించిన (రిజర్వుచేసిన) ఉద్యోగము పొందినా, విద్యా సంస్థలలో ప్రవేశము పొందినా, లేదా ఆర్థిక సహాయము లేదా సౌకర్యములు పొందినా, అట్టి తప్పుడు సర్టిఫికెట్టు రద్దు పరచిన వెంటనే ఉద్యోగం నుండి తప్పించడం విద్యా సంస్థల నుండి (డిబార్) తొలగించడుటయేగాక, ఆర్థిక సహాయము లేదా సౌకర్యములు నిలుపుదల చేయడం, పొందిన ఆర్థిక సహాయాని, సౌకర్యాలను వెనుకకు తీసుకొనడం (Withdraw చేయడం) జరుగుతాయి. డిగ్రీ, డిప్లమా పట్టాలు రద్దు కాబడతాయి.

సెక్షన్ 11,12,13 మరియు 14 సెక్షన్ల ప్రకారం: తప్పుడు కుల ధృవీకరణ పత్రములతో ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థలు, స్థానిక సంస్థలు, విద్యా సంస్థలలో లబ్ధి పొందే యాదిగు వారికి (తప్పుడు కుల ధృవీకరణ పత్రం రద్దు చేసిన పిదప) 6 మాసములకు తక్కువ కాకుండా 2 సంవత్సరముల కాలము వరకు కారాగార శిక్ష మరియు రూ. 1,000/-లుకు తక్కువ కాకుండా రూ. 5,000/-లు వరకు జరిమానా విధించ వచ్చును.

షెడ్యూలు కులము, షెడ్యూలు తెగ, వెనుకబడిన తరగతుల వార్కి రిజర్వు కాబడిన 1)సదుపాయము పొందిన సందర్భములో 2) ఉద్యోగమును పొందిన సందర్భములో 3) ఎన్నుకొనబడడానికి వినియోగించిన సందర్భములో 4) గిరిజనునికి రిజర్వు కాబడిన (లేదా నిర్దేశించిన) ఆ సదుపాయములను గిరిజనేతరులు తప్పుడు కుల (ట్రైబ్) ధృవీకరణ పత్రంలో అనుభవించుచున్న సందర్భములో పై న తెల్పిన శిక్షకు పాత్రుడౌతారు.

అదే విధంగా ఉద్దేశ పూర్వకంగా తప్పుడు కుల ధృవీకరణ పత్రం యిచ్చిన కాంపిటెంటు అథారిటీ (మండల రెవెన్యూ అధికారి) మరియు ప్రోత్సహించిన వ్యక్తి కూడ పైన తేల్చిన శిక్షకు పాత్రులగుదురు.

రూల్ 15 ప్రకారము పైన తెల్పిన నేరాల విషయంలో జిల్లా కలెక్టరు వారు మొదటి తరగతి జ్యుడిషియల్ మెజిస్ట్రేటు కోర్టులో కేసులు దాఖలు చేయుటకు చర్యతీసుకోవాలి.

చట్టపరిధిలో యిచ్చిన ఉత్తర్వులను ప్రశ్నచేయు అధికారము సివిలుకోర్టులకు లేవు.

ఈ చట్టములోని నిబంధనలు ఉల్లంఘించి నేరాలు చేసిన వారిని వారెంటు లేకుండా అరెస్టు చేయవచ్చును.

ధృవీకరణ పత్రము నమూన జతచేయడమైనది.

**MANDAL REVENUE OFFICE - ....................**
**................DISTRICT, A.P - 522002**

Certificate No. Date: - -2006

## COMMUNITY, NATIVITY AND DATE OF BIRTH CERTIFICATE

1. This is to certify that Sri/Smt/Kum.................................................................................................. Son / Daughter of Sri..........................................................................of Village/Town D.No......................................................Mandal Guntur District Guntur of the State of Andhra Pradesh belongs to..........................................Community which is recognized as..............................under

The Constitution (Scheduled Caste) Order 1950
The Constitution (Scheduled Tribes) Order 1950

G.O.Ms.No.1793, Education, dated 25-9-1970 as amended from time to time (B.Cs)S.Cs, S.Ts, list (Modification) Order, 1956 S.Cs and S.Ts (Amendment) Act, 1976.

2. It is certifies that Sri/Smt/Kum.................................................................................................. is a native of D.No.........................................................................................Village/Town ........... Mandal ......... District of Andhra Pradesh.

3. It is certified that the place of birth of Sri/Smt/Kum...................................................................... is ............ Village/Town .............. Mandal .............. District of Andhra Pradesh.

4. It is certified that the date of birth of Sri/Smt/Kum........................................................................ is Day <<Day>> Month <<month>> Year <<year>> (in words)

as per declaration given by his/her father/mother/guardian and as entered in the school records where he / she studied.

Signature :
Date :
Name :
Designation :

## ౨౨. ఆదాయ సర్టిఫికెట్

## (INCOME CERTIFICATE)

పేదలకు, దారిద్ర్య రేఖ దిగువనున్న కుటుంబాలకు ఉద్దేశించిన రాయితీలు పొందటానికి ఆదాయ ధృవీకరణ పత్రము అవసరమవుతుంది. వేలం పాటల్లో, బ్యాంకుల నుండి పెద్ద మొత్తములో లోన్లు తీసుకునే వారికి తమ అర్హత నిరూపించుకోవటానికి, కాంట్రాక్టర్లకు అప్పులు తీర్చే శక్తి (సాల్వేన్సీ) ఉన్నదనే సర్టిఫెకెట్ కూడా కొన్ని సందర్భాలలో అవసరమవుతుంది.

**ఆదాయ సిర్టిఫికెట్ ఎప్పుడు, ఎలా అవసరపడుతుంది!**

- రేషన్ కార్డు (తెలుపు రంగు) పొందగోరే వారికి
- వివిధ సంక్షేమ ఫథకాల ద్వారా సబ్సిడీ పొందే వారికి (డ్వాక్రా, డి.ఆర్.డి.ఏ., వ్యక్తిగత మరుగుదొడ్ల పథకం, ఆదరణ, ముందడుగు తదితరములు ద్వారా లబ్దిపొందుటకు)
- ఇళ్ళ స్థలాల కేటాయింపు
- బ్యాంకు ఋణములు
- బలహీన వర్గాల వారికి గృహ వసతి
- వృద్యాప్య పింఛనులు
- కుటుంబ ప్రయోజన పథకములు
- విద్యార్థి స్కాలర్‌షిప్‌లు మంజూరుకు

ఆదాయం ధృవీకరణ పత్రాలు ఆదాయం పన్ను విషయంలో ఉపయోగించటానికి వీలు లేదు. సర్టిఫికెట్ మంజూరు చేసే సమయంలో పంచాయితీ కార్యదర్శి అన్ని రకాలుగా వచ్చే ఆదాయాన్ని పరిగణించాలి. వనరులు, ఆదాయమూలాలు ఈక్రింది విధముగా ఉండేటట్లు చూచి రికమండ్ చేయవలెను.

- భూమి, వ్యాపారం, శ్రమ కూలీ
- ఉద్యోగం, భవనాలు (అద్దెలు), ఇతర వనరు, వృత్తి

రేషన్ కార్డులు, సబ్సిడీలు, ఇళ్ళ స్థలాల కేటాయింపులు పొందటం కోసం తరచుగా ఆదాయం సిర్టిఫికెట్‌ను ఉపయోగించటం జరుగుతుంది. ముఖ్యంగా పేదవారికై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాలు రూపొందించి ఆదాయ ధృవీకరణ పత్రము వారికి అమలుకై వెంటనే చర్యలు తీసుకొని ఇవ్వవలెను. అనర్హులైన వ్యక్తులు పొందే అలవాటును గట్టిగా ఖండించాలి. అలాంటి చర్యలకు పాల్పడే వ్యక్తులను నివారించేటట్లు చూడవలెను.

**ఆదాయ ధృవీకరణ పత్రం పొందటం ఎలా?**

- దరఖాస్తు ఫారమ్ సంబంధిత మండల రెవిన్యూ అధికారి గారికి దరఖాస్తు చేసుకొనవలెను.
- దరఖాస్తునందు సరైన సమాచారముతో పూర్తి చేయవలెను. రెండు రూపాల కోర్టు ఫీజు స్టాంపు అంటించవలెను.
- దరఖాస్తు ఫారము కార్యాలయమునకు అందజేసిన అనంతరము మండల రెవిన్యూ అధికారి గారు సంబంధిత పంచాయితీ కార్యదర్శి అదాయము పొందు పరచి సర్టిఫై చేసిన పిదప మండల రెవిన్యూ అధికారి గారు సంతకముతో సంబంధిత లబ్ధిదారులకు అందజేయబడును.

# ౨౩. నివాస ధృవీకరణ సర్టిఫికెట్

## (RESIDENCE CERTIFICATE)

ఒక గ్రామము లేక పట్టణం లేదా ఒక వార్డులో మీ యొక్క శాశ్వత నివాసమును ఋజువు చేసేదే నివాస ధృవీకరణ పత్రము. ఒక ప్రదేశములో మీరు నివాసమున్న కాలాన్ని బట్టిగాని, శాశ్వతమైన ఉద్యోగమునుట్టిగానీ ఈ సర్టిఫెకెట్ జారీ చేయబడును.

**సర్టిఫెకెట్ ఎప్పుడు అవసర పడుతుంది?**

- ☞ పాఠశాలలనందుగానీ, కళాశాలలనందు గానీ ప్రవేశము పొందే సమయములో
- ☞ ప్రభుత్వ ఉద్యోగము / ప్రైవేటు ఉద్యోగము లో చేరునప్పుడు
- ☞ రేషన్ కార్డులు పొందునప్పుడు
- ☞ వివిధ సబ్సిడీ పథకాలు పొందగోరే సమయములో
- ☞ బ్యాంకుల ద్వారా ఋణ సదుపాయాలు పొందగోరే సమయములో
- ☞ ఓటరుగా పేరు నమోదు చేసుకోడానికి

**ఆంధ్రప్రదేశ్‌లో నివాసానికి సంబంధించిన నియమ నిబంధనలు:**

1. చాలా వరకు, ప్రభుత్వ ఉద్యోగాలలో, కళాశాలలలో సీట్ల కొరకు నివాస ధృవీకరణ పత్రము అవసరము
2. గ్రూప్ – 1 సర్వీసు వంటి ఉన్నత ఉద్యోగాలకు రాష్ట్రములో ఎక్కడైనా నివాసముండవచ్చును.
3. వృత్తి విద్య, ప్రభుత్వ కాళాశాలల్లో ప్రవేశానికి రాష్ట్రాన్ని మూడు ప్రాంతాలుగా విభజించారు. అవి
   - ☞ పాత ఆంధ్ర విశ్వ విద్యాలము : అంటే కోస్తా ఆంధ్రాలో శ్రీకాకుళం నుండి ప్రకాశం జిల్లాలు వరకు
   - ☞ పాత ఉస్మానియా విశ్వ విద్యాలయం : తెలంగాణా జిల్లాలు
   - ☞ పాత వెంకటేశ్వర విశ్వ విద్యాలయం : నెల్లూరు, రాయలసీమ జిల్లాలు
4. ఆ ప్రాంతాల్లో నివసిస్తూ కనీసం 7 సంవత్సరములపాటు అక్కడే పాఠశాలలో చదివిన విద్యార్థులను మాత్రమే ఆయా ప్రాంతాల్లోని చేర్చుకుంటారు.
5. రాష్ట్ర సర్వీస్ కమీషన్ ద్వారా ఉద్యోగము పొందగోరు వారు గ్రూప్– సర్వీసులోని ఉద్యోగాలకు అభ్యర్థులు, ఆయా జిల్లాలు/ జోనుల్లో నివసించువారై ఉండవలెను. ఆయా జిల్లాలు లేదా జోనుల "కోటా" ఉద్యోగాలకు మాత్రమే వారు అర్హులు అవుతారు. మరోచోట వారు పోటీ పడేదేమీ లేదు.
6. పాఠశాల ఉపాధ్యాయులను జిల్లాల వారీగా ఎంపిక చేస్తారు. ఏ జిల్లాల్లో వారు ఉద్యోగము కోరుతున్నారో! ఆ జిల్లాలలో "నివాస ధృవీకరణ సర్టిఫికెట్" తప్పనిసరిగా ఉంటుంది.
7. ప్రభుత్వములోని కొన్ని క్రింది స్థాయి ఉద్యోగాలకు నియామకాలు కూడా జిల్లాల ప్రాతిపదికపై జరుగుతాయి.

8. ఇతర గెజిటెడ్ ఉద్యోగాల ఎంపిక ప్రాంతాల (జోన్స్) ప్రాతిపధికన జరుగుతుంది. ఇందుకోసం రాష్ట్రాన్ని ఏడు జోన్‌లుగా విభజించారు.

| <u>జోన్‌లు</u> | <u>జిల్లాలు</u> |
|---|---|
| జోన్ – I | శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం |
| జోన్ – II | తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణ |
| జోన్ – III | గుంటూరు, నెల్లూరు, ప్రకాశం |
| జోన్ – IV | కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు |
| జోన్ – V | వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ |
| జోన్ – VI | రంగారెడ్డి, మెదక్, నల్గొండ మహబూబ్‌నగర్, నిజామాబాద్, హైదరాబాద్ (నగరం మినహా) |
| జోన్ – VII | హైదరాబాద్ నగరం |

9. జోన్‌ల వారీ విభజన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకమైనది. రాష్ట్రంలోని ప్రాంతీయ సమస్యలు పరిష్కారానికై అమలు చేసే ఆరు సూత్రాల ప్రాంత ఫలితమే ఇది.

10. ఆంధ్రప్రదేశ్ లోపల కూడ వైద్య, ఇంజనీరింగ్ కళాశాలల్లో ఒక ప్రాంతం విద్యార్థులను మరో ప్రాంతంలో "బయట వారుగా" పరిగణిస్తారు. సాధారణంగా 15%నకు మించని సాధారణ కోటాలో వీరిని చేర్చుకోవచ్చు.

**నివాస ధృవీకరణ పత్రం పొందటం ఎలా?**

- ☞ మండల రెవిన్యూ అధికారి గారికి దరఖాస్తు చేసుకొనవలను. (నిర్దేశించిన ఫారమ్‌లో)
- ☞ రెండు రూపాయల కోర్టు ఫీజు స్టాంపును ధరఖాస్తు ఫారమ్ పైన అంటించాలి. (ఎస్.సి., ఎస్.టి, వారికి దీని నుండి మినహాయింపు ఉంది)
- ☞ గత నాలుగేళ్లలో వీరు చదివిన పాఠశాల, కళాశాలలో చదివిన సర్టిఫికెట్ కావలెను.
- ☞ కళాశాల లేక పాఠశాలల్లో ఇచ్చిన బదిలీ సర్టిఫికెట్ (టి.సి.) ఉండవలెను.
- ☞ రేషన్ కార్డు కాపీ (ఒకవేళ కార్డు లేని పక్షంలో నివాసాన్ని ధృవపరిచే డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్, పంచాయితీ పన్ను కాపీలు జతపరచవలెను.

పంచాయితీ కార్యదర్శి కార్యాలయములో అధికారి వారు ఎంక్వైరీ నిర్వహించి మంజూరు చేయుటకు త్వరితగతిన చర్యలు తీసుకుందురు

## 24. జనన మరణ సర్టిఫికెట్

## (BIRTH AND DEATH CERTIFICATE)

ఒక వ్యక్తి జీవితంలో జనన ధృవీకరణ పత్రము ముఖ్యమైనది. జన్మతేది, వమస్సు, తల్లిదండ్రులెవరనేది నిర్ధారించడానికి ఈ సర్టిఫికెట్ చాలా అవసరము.

జన్మ ధృవీకరణ పత్రము ఈ క్రిందనుదహరించిన అనేక సందర్భాలలో అవసరమవుతుంది.

☞ పాఠశాలల్లో ప్రవేశం

☞ కళాశాలల్లో ప్రవేశం

☞ ఉద్యోగం పొందగోరే సందర్భాలలో

☞ పాస్‌పోర్ట్ కోరే సందర్భాలలో

☞ వయసు నిర్ధారించడానికి జరిగే కోర్టు కేసులు

☞ వివాహ రిజిస్ట్రేషన్

☞ డ్రైవింగ్ లైసెన్స్

☞ విమాన ప్రయాణ రాయితీకై వృద్యాపు వయస్సు ఋజువు

☞ వృద్ధులకున్న ప్రత్యేక రాయితీలు

☞ ఓటరు రిజిస్ట్రేషన్స్

ఒక బిడ్డ పుట్టినప్పుడు జన్మించిన ప్రాంతము మైనరు పంచాయితీ, మేజరు పంచాయితీ అయినా కొత్తగా ఏర్పాటు చేసిన పంచాయితీ కార్యదర్శి వారికి, మున్సిపాలిటీ, కార్పోరేషన్ ఐతే వారికి వెంటనే వివరములతో సహ తెలియపరచవలసిన భాద్యత తల్లిదండ్రులు విధిగా పాటించవలెను. అలాగే ప్రతి మరణాన్ని కూడా తెలియపరచవలెను.

గ్రామములలో లేదా మున్సిపాలిటీలలో పుట్టిన మరణించిన వెంటనే రిజిస్ట్రేషన్ పొందిన సర్టిఫికెట్‌ను జాగ్రత్తగా ఉంచుకొనవలసినదిగా గ్రామముల పంచాయితీ కార్యదర్శి తెలియపరచవలెను. ఆసుపత్రిలో జరిగిన అన్ని కాన్పుల విషయంలో అన్ని జననాల గురించి తెలియచేయడం చట్టరీత్యా ఆస్పత్రి అధికారుల విధి.

ముఖ్యంగా పాఠశాల రికార్డులలో తరచుగా జనన తేదీ తప్పుగా చేస్తుంటారు. ఇది పొరపాటు వల్ల కాని, బుద్ధిపూర్వకంగా అబద్ధపు రికార్డులు వ్రాయటం వల్లకానీ జరుగుతుంది. ఒక బిడ్డ బడిలో చేరినప్పుడు ఉపాధ్యాయుడు ఏదో ఒక తేది స్వయంగా అనుకొని వేయటం తరచు జరుగుతుంది. నమోదు చేసిన వయస్సు నిబంధనలకు అనువుగా ఉండేటట్లు కొన్నిసార్లు ఇలా చేస్తారు.

ఇటీవలి కాలంలో విద్యావకాశాలలో క్రీడలలో వయసు దాచి ప్రయోజనాలు పొందేటందుకు వీలుగా కొందరు తల్లిదండ్రులు పిల్లల వయస్సులు తక్కువ చేసి వేస్తున్నారు. ఇలా రికార్డులలో అబద్ధాలు చెప్పి వ్రాయించుట వల్ల చివరకు పిల్లలకు ఏ లాభము చేకూరదు. దీనిని గట్టిగా ఖండించి ఇలా చేయకుండా నివారించాలి.

పాఠశాల రికార్డులలో జనన తేది, పేరు స్పష్టంగా తప్పులు లేకుండా రాయించుకొనవలెను. పాఠశాల వదలివేసిన తరువాత రికార్డుల్లో పొరపాటు దిద్దటం చాలా కష్టం. ఈ విషయమును గ్రామ సెక్రెటరీ గ్రామములోని పౌరులందరకూ తెలియపరచవలెను.

కుటుంబములో మరణము సంభవించినపుడు అర్హత గల వైద్యుడు నుండి సర్టిఫికెట్‌ను పొందవలెను. మరణము సంభవించిన యెడల ఆ సమాచారాన్ని సంబంధిత గ్రామ సెక్రెటరీకి తెలియపరిచి రికార్డులలో వ్రాయించుకొనవలెను.

మరణ ధృవీకరణ పత్రము అనేక సందర్భాలలో అవసరమౌతుంది. అవి ఏమనగా!

- ☞ చట్టరీత్యా వారసత్వ ధృవీకరణ పత్రానికి
- ☞ కోర్టు వారిచే వారసత్వ పత్రము
- ☞ కుటుంబ పెన్షను, ఇతర ప్రయోజనాలకు
- ☞ బ్యాంకు లావాదేవీలకు
- ☞ వ్యాపార లావాదేవీలకు
- ☞ ఆపద్బంధు పథకము క్రింద ప్రయోజనము పొందుటకు
- ☞ వివిధ ఇన్సూరెన్స్ పథకము క్రింద లబ్ధిపొందుటకు
- ☞ వారసత్వము లేక వీలునామా ఆధారంగా ఆస్థి మార్పిడి

ఒక వ్యక్తి చనిపోయిన తరువాత ఆ పేరు ఓటర్ల పట్టికలోంచి, తొలగించుటకు చర్య తీసుకొనవలెను.

**నమోదు అధికారులు:**

జననము గానీ, మరణము గానీ గ్రామపంచాయితీ /మున్సిపల్ కార్యాలయములో నమోదు చేయించాలి.

- ☞ మైనరు పంచాయితీలు : పంచాయితీ కార్యదర్శి
- ☞ మేజర్ పంచాయితీలు : పంచాయితీ కార్యదర్శి
- ☞ మున్సిపాలిటి : మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ లేనిచో మున్సిపల్ కమీషనరు
- ☞ కార్పోరేషన్ (నగర పాలక సంస్థ) : వార్డు హెల్త్ ఆఫీసర్స్

జననము లేదా మరణము జరిగిన సమయములో నిర్లక్ష్యము చేత నమోదు చేయించకపోతే రిజిస్ట్రేషన్ జరగలేదని (ఫారం-10) ఒక ధృవీకరణ పత్రాన్ని పై అధికారుల నుండి పొందవచ్చు.

**జనన లేక మరణ ధృవీకరణ పత్రం పొందటం ఎలా?**

☞ పైన చెప్పిన అధికారులు జనన, మరణ ధృవీకరణ పత్రాలను జారీ చేస్తారు.

☞ ప్రభుత్వ ఉత్తర్వులు నెం. 276 పంచాయితీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ (మండల్ 2 (తేదీ 18.06.2002 యందలి ఉత్తర్వుల ప్రకారము నివాస/స్వగ్రామ ధృవీకరణ పత్రము మరియు జననము, మరణము, పహాణీ యొక్క నకల్లు (కాపీ) జారీ చేయు అధికారము పంచాయితీ కార్యదర్శులకు కల్పించినారు.

☞ సంబంధిత అధికారి గారికి ధరఖాస్తు పెట్టుకొనవలెను. దరఖాస్తు ఫారములో జనన తేది/మరణ తేది, ప్రదేశము, తల్లిదండ్రుల పేర్లు, చనిపోయిన వారి పేర్లు, ఆడ, మగ అనేవి అన్నియు సక్రమముగా వ్రాయించవలెను.

☞ ఇట్టి జనన, మరణ ధృవీకరణ పత్రమును నకలు ఇచ్చుటకు వసూళ్ళు అయ్యే రుసుమును జనన, మరణ రిజిస్ట్రేషను నియమాలు 1999 లలోని సెక్షన్ 13 (5) (ఎ) ప్రకారము గ్రామ పంచాయితీ సాధారణ నిధుల యందు జమచేయవచ్చును.

**రిపోర్టులు పంపు విధానము:**

☞ ప్రభుత్వ ఉత్తర్వుల నెం.13 వైద్య, ఆరోగ్య & కుటుంబ సంక్షేమ (డి-1) తేదీ:31.1.2003 యందలి ఉత్తర్వుల ప్రకారం ప్రతి నెల 5వ తారీఖు లోపల జనన, మరణములకు సంబంధించిన స్టాటిస్టికల్ రిపోర్టు భాగమును మండల రెవెన్యూ కార్యాలయమునకు పంపించవలెను. మరియు న్యాయ సంబంధ సమాచారము జనన, మరణ రిజిస్టరుగా ఉపయోగపడును. ఇట్టి సమాచారమును ఒక రిజిస్టరు నందు నమోదు చేసిన అది జనన, మరణ రిజిస్టరుగా గ్రామ పంచాయితీ యందు బద్రపరచ వచ్చును.

☞ న్యాయ సంబంధ సమాచారము (జనన, మరణము) గ్రామ లెక్కలు నెం.9 (జననము) 10 (మరణము) క్రింద జనాబంది సమయములో మండల రెవెన్యూ అధికారి గారికి సమర్పించవలసి ఉండును.

## 25. షెడ్యూల్డు జాతులు, తెగలపై అత్యాచార నిరోధక చట్టము - 1989

షెడ్యూలు జాతులు, తెగలు, ఆర్థిక విద్యారంగాలలో సమాన అవకాశాలను పొందుటకు, వారికి సామాజిక న్యాయము చేకూర్చుటకు, ధనికి వర్గాలవారి అత్యాచారాల నుండి రక్షించుటకు ఏర్పాటు చేయబడిన చట్టమే, షెడ్యూల్డ్ జాతుల, తెగలకు అత్యాచాద నిరోధక చట్టము. ఇతర వ్యక్తులు, షెడ్యూల్డ్ కులములు, తెగలకు చెందిన వారి న్యాయపరమైన హక్కులకు భంగం కలిగించుట, వారిని అసత్యపు నేరారోపణల ద్వారా దావాలలో ఇరికించుట – వారి సార్వజనిక హక్కులను భంగము కలిగించు ఈ చట్టము క్రింద నేరములుగా పరిగణించబడతాయి. షెడ్యూడ్డ్ తెగలు కులములకు చెందిన వారిని అంటరాని వారుగా పరిగణించుట, అవమానించే ఉద్దేశ్యంతో కులం పేరున దూషించుట ఈ చట్టం ప్రకారం శిక్షార్హములు.

షెడ్యూల్డ్ కులములు లేదా తెగలకు చెందని వ్యక్తి ఈ క్రింది చర్యలు జరిపినచో అవి నేరములుగా లేదా అత్యాచారములుగా పరిగణించబడును. (సెక్షను – 3)

1. తినరాని పదార్థములు తినమని వారిని బలవంత పెట్టుట.
2. అవమాన పరచు ఆద్దేశ్యముతో చెత్త పదార్థములు, శవములు, చెడు పదార్థములు మొదలగునవి వారి స్థలములో బలవంతంగా వేయుట.
3. వారికి చెందిన భూములను అన్యాయంగా ఆక్రమించుట లేదా సాగు చేయుట లేదా బలవంతగా బదిలీ చేయుట. అన్యాయంగా వారి స్థలములు, / భూముల నుండి ఖాళీ చేయించుట.
4. యాచకము లేదా వెట్టి చాకిరి చేయమని బలవంత పెట్టుట.
5. ఓటు వేయకుండా అడ్డుపడుట వంటి చర్యలు
6. వారిపై తప్పుడు కేసులు బనాయించుట.
7. ప్రభుత్వ ఉద్యోగులకు తప్పుడు సమాచారమిచ్చి వారి ద్వారా షెడ్యూల్డ్ కులము లేదా తెగకు చెందిన వారికి నష్టము వంటివి కలిగించుట.
8. షెడ్యూల్డ్ కులము లేదా తెగకు చెందిన స్త్రీ ని అగౌరవ పరుచుట, బలత్కారము చేయుట.

పై నేరములు చేసిన వారికి ఆరు నెలల నుండి ఐదు సంవత్సరముల వరకు శిక్ష మరియు జరిమానా విధించచ్చును.

వారి ఆస్థులకు నష్టం కలిగించిన నేరస్థులకు ఆరు నెలల నుండి ఏడు సంవత్సరముల వరకు శిక్ష విధించవచ్చును.

సూచన: ఈ చట్టము క్రిందకి నేరములను విచారించుటకు ఏర్పాటైన ప్రత్యేక కోర్టుల చిరునామా.

1. స్పెషల్ జడ్జ్ ఫర్ ట్రయిల్ ఆఫ్ అఫెన్సెస్ అండర్ ది యస్.సి/ యస్.టి (ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్) చట్టం 1989

జిల్లా కోర్టు భవనములు

(ప్రతి జిల్లాలోను నెలకొల్పబడినాయి.)

## 26. వెట్టిచాకిరి నిర్మూలన చట్టం

Bonded Labour System - (Abolition) - Act 1976

ఇది వెట్టిచాకిరి రద్దు, నిరోధానికి సంబంధించినది. దేశమంతా ఈ చట్టము 25.10.1975 నుండి అమలులోనికి వచ్చింది. ఈ విషయాన్ని సంబంధించి అంతకుక్రితం వెట్టిచాకిరిపై ఉన్న అన్ని చట్టాలు ఈ చట్టానికి లోబడి, అమలు జరుపబడతాయి. వెట్టిచాకిరిని, దానికి సంబంధించిన బాండు, అప్పు ఈ చట్టం ద్వారా రద్దుచేయబడ్డాయి. వెట్టిచాకిరిని చట్టవ్యతిరేక కార్యకలాపంగా పరిగణించారు. ఈ చట్టం పరిధిలో రెవెన్యూ డివిజనల్ అధికారికి, మండల రెవెన్యూ అధికారికి – కేసులను విచారించుటకు అధికారాలు సంక్రమించాయి.

వెట్టిచాకిరికి సంబంధించిన కేసులను మూడుతరగతులలో విశ్లేషించవచ్చు.

మొదటిది – వెట్టిచాకిరి గుర్తింపు – ఇది సర్వే ద్వారా చేయవచ్చు.

రెండవది – వెట్టిచాకిరికి సంబంధించిన అన్ని పత్రాలను స్వాధీనంచేసుకొని – భూస్వామిని ప్రాసిక్యూట్‌చేస్తూ, సంబంధిత వ్యక్తిని వెట్టి నుండి విముక్తిచేయుట.

మూడు – వెట్టిచాకిరి నుండి విముక్తి పొందిన వ్యక్తికి పునరావాసం కలుగచేయుట.

గ్రామీణాక్షేత్రాలలో పని చేసే అధికారులు సర్వే ద్వారా వెట్టి చాకిరికి సంబంధించిన విషయాలను సేకరించాలి.

## 27. ఆంధ్రప్రదేశ్ ఋణ విముక్తి చట్టం 1977

(A.P.Agricultural Indebtedness Relief Act.1977)

వ్యవసాయ రంగంలో ఉండే వారికి అప్పుచేయాల్సి రావడం సర్వసాధారణ విషయం భారతదేశంలోని వ్యవసాయదారుడు – అప్పులలో పుట్టి, అప్పులలో పెరిగి అప్పులనే తన సంతతికి సంక్రమింపచేస్తాడు. అనేది పాతకాలపునానుడి, అందుచే వ్యవసాయ కూలీలకు సన్నకారు, చిన్నకారు రైతులకు, గ్రామాలలోని చేతి పనివారికి, అప్పుల బాధ నుండి విముక్తి కలిగించే ఉద్దేశ్యతో ఆంధ్రప్రదేశ్‌లో A.P.Agricultural Indebtedness Relief Act, ఒక చట్టాన్ని 1977 లో రూపొందించారు. అప్పిచ్చిన వారు పెట్టే బాధల నుండి ఉపశమనం కలిగించడమే ఆ చట్టం ప్రధాన లక్ష్యం–చిన్నకారు, సన్నకురు రైతులు, గ్రామీణ చేతి పనివారు, వ్యవసాయ కూలీలు తాము చెల్లించాల్సిన అసలు, అందుపై వడ్డీలను, సెక్షన్ 4 ప్రకారం మాఫీచేశారు. అంటే ఆ అప్పులు – వడ్డీలను, చెల్లించినట్లే పరిగణింపబడతాయి. తనఖా పెట్టిన ఆస్తికూడా, విముక్తి పొంది, మరల స్వంతదారుడికి చేరుతుంది. ఈ చట్టంలోని లక్ష్యాలను నెరవేర్చేందుకు మండల రెవెన్యూ అధికారికి అవసరమైన అన్ని అధికారాలను బాధ్యతలను అప్పగించారు.

## 28. కనీస వేతనాల చెల్లింపుకు సంబంధించిన చట్టం

(Minimum Wages Act. 1977)

వ్యవసాయరంగంలో వివిధ స్థాయిలలో పనులచేసే రైతు కూలీలకు కనీసవేతనాలను చెల్లించడానికై ప్రభుత్వం ఒక చట్టాన్ని రూపొందించింది. తాత్కాలిక వ్యవసాయకూలీలు, దైనందిన కూలీలు – దున్నుట/ పంటమార్చుట/విత్తనాలువేయుట, నార్లువేయుట,/కలుపుతీయుట/త్రవ్వుట / కుప్పవేయుట మొదలైన పనులు చేయుటకు కనీస వేతనాలను చెల్లించవలసిన యున్నది. అయితే ప్రభుత్వం ప్రకటించిన రేట్ల కంటే కూలీలకు, వాస్తవంగా, తక్కువ కూలీలు చెల్లించడం జరుగుచున్నది. అందువల్ల చట్టంలోని, నిబంధనలను, అమలు చేయుటకు ఇన్‌స్పెక్టర్ల హోదాలో పర్యవేక్షణ చేయుటకు - G.O.Ms.No.634 - of L.E. & T.E. - 13.6.1977 ద్వారా మండల రెవెన్యూ అధికారులకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు, అధికారాలు ఇవ్వడం జరిగింది. కాబట్టి మండల స్థాయిలోను, గ్రామస్థాయిలోనూ ఈ చట్టంలోని నిబంధనలను అమలు జరిగేట్టు చూడవలసిన బాధ్యత ఉంది.

## 29. రైలు కట్టలు

భారీ వర్షాలు కురిసే కాలంలో గ్రామ పంచాయతి కార్యదర్శి రైలు కట్టలకు నష్టం కలిగించే ప్రమాదం ఉన్న చెరువులపై గట్టి కాపలాకు ఏర్పాట్లు గావించాలి. చెరువుల నిండా నీళ్లు ఉన్నప్పుడు గట్లు ఏమైనా తెగిపోయే అవకాశాలు ఉంటే ఆ విషయాన్ని రైల్వే అధికార్లకు మండల రెవెన్యూ అధికారికి వెంటనే తెలియజేయాలి. ఏదైనా రైలు ప్రమాదం జరిగినప్పుడు లేదా రైల్వేకు నష్టం కలిగినప్పుడు రైల్వే అధికారులకు సాధ్యమైన సహాయాన్ని అందించాలి.

## 30. ది ఇండియన్ ట్రెజర్ - ట్రోవ్ చట్టం 1878

## (కేంద్ర చట్టం)

### నిధి నిక్షేపాలు

**1. ముఖ్యోద్దేశ్యము:**

'నిధి' అంటే చారిత్రాత్మక లేదా పురాతత్వ ప్రయోజనం కలిగి 100 సంవత్సరాలకు పైబడిన కాలం నుండి భూమిలో నిక్షిప్తమైవున్న, కప్పబడి వున్న అంటిపెట్టుకొని ఉన్న రూ. 10/- మించిన విలువ కలిగియున్న ఏదైనా వస్తువు అని అర్ధము. అంతేకాకుండ, భూమి ఉపరితలంపై కనుగొన్న కోయని వజ్రాలు, ఇతర విలువైన ఖనిజాలు కూడ 'నిధి' లో చేరి ఉంటాయి. అట్టి నిధిని కనుగోన్నప్పుడు భారత నిధి నిక్షేపాల చట్టం 1878 లోని నిబంధనల ప్రకారం చర్యతీసుకోవలసి ఉంటుంది.

**2. ప్రచురణ:**

చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం నిధిని కనుగోన్న వ్యక్తిగాని, కనుగొన్న వ్యక్తి నుండి నిధినికొనుగోలు చేసిన వ్యక్తిగాని, లేదా స్థళం యజమాని గాని, అనిభవదారుగాని 'నిధి'కి సంబంధించి కనుగొన్న వివరాలన్నిటిని 2 నెలలోగా జిల్లా కలెక్టరుకు తెలియజేయాలి. పైన పేర్కొన్న వ్యక్తులనుండి అట్టి సమాచారం అందిన మీదట సెక్షన్ 5 ప్రకారం కలెక్టరు ఒక నిర్ధిష్టమైన నాల్గు మాసాల కాలవ్యవధి చూపుచూ ఒకతేదీ, స్థళం, సమయంలో తన సమక్షంలో క్లైముదారులు హాజరురవడం కోసం నిధి వివరాలను స్టేటుగెజిట్ లోను, జిల్లా గెజిట్‌లోను, లోకల్ పోలీసు స్టేషనులోను, కలెక్టరు కార్యాలయంలోను, గ్రామంలోగల పంచాయితీ కార్యాలయలోను నోటీసు ప్రచురించడం ద్వారాను, గ్రామంలో దండోరా మూలము గాను ప్రకటించాలి. నిర్ణయించిన తేదీన క్లైమెంటులు హాజరు కాకపోతే సెక్షన్ 6 ప్రకారం వార్కిగల నిధిపై హక్కులను కోల్పోతారు.

**3. విచారణ, ప్రకటన**

క్లైయిము దార్లు కలెక్టరు వద్ద హాజరైనప్పుడు నిధి నిక్షిప్తతగురించి, వారి హక్కుల గురించి దర్యాప్తు నిర్వహించి, క్లైముదార్ల హక్కులు సివిల్ కోర్టు ద్వారా రుజువు చేసుకొనేందుకు సెక్షన్ 8 ప్రకారం అతనికి అవకాశం మరియు సమయం నిర్ధేశిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలి. సెక్షన్ 9 ప్రకారం, క్లైమెంటు లేకపోయినా, సెక్షన్ 8 ప్రకారం అనుమతించిన సమయంలో క్లైమెంటు సివిల్ కోర్టులో తన హక్కులు రుజువు చేసుకోవడానికి దావా వేయ్యకపోయినా, లేదా వేసిన దావాలో తీర్పు తనకు ప్రతికూలమైన నిధిని "యజమాని లేని నిధి" గా ప్రకటించాలి.

**4. నిధి పంపకం:**

"యజమాని లేని నిధి" గా ప్రకటించిన పిదప చట్టంలోని సెక్షన్ 10, 11 మరియు 12 ప్రకారం

ఆయాక్షేము దార్లవాటాలను నిర్ధారించి, వాటాల నిష్పత్తి ప్రకారం “నిధి”ని, గాని దానికి సమానమైన విలువను గాని క్లైమెంట్లకు, కనుగొన్న వ్యక్తికి పంచియివ్వాలి.

**5. నిధి స్వాధీనము:**

“నిధి” పురాతత్వ లేదా చారిత్రాత్మక విలువైనదిగా భావించినట్లైతే ప్రభుత్వ ఉత్తర్వులను పొంది సెక్షన్ 16 ప్రకారము కలెక్టరు వారు నిధిని స్వాధీనంచేసుకోవచ్చు. పై 2వ పేరాలో తెల్పిన వ్యక్తులుగాక వేరొక వ్యక్తి “నిధి” గురించి ముందుగా సమాచారము అందించినచో, సెక్షన్ 16–ఎ ప్రకారము నిధిలో వాటాను పొందే వీలుంటుంది.

**6. శిక్ష:**

సెక్షన్ 20 ప్రకారము ఏదేని నిధిని కనుగోన్న వ్యక్తి లేదా కొనుగోలు చేసిన వ్యక్తి నిధి గురించి సెక్షన్ 4 ప్రకారం కలెక్టరు వార్కి సమాచారం తెలియజేయక పోయినా, నిధిని దాచినా, మార్చి వేయదానికి ప్రయత్నించినా, మార్చినా వారికి ఒక సంవత్సరం కారాగారము లేదా జరిమానా లేదా రెండింటితో శిక్షించడమవుతుంది.

అదే విధంగా అట్టినేరానికి స్థళయజమాని లేదా అనుభవదారు సహాయపడినా, ప్రోత్సహించినా, సమాచారం అందించకపోయినా అతనినికూడ 6 మాసాల కారాగారము లేదా జరిమానా లేదా రెండింటితో శిక్షంచడమవుతుంది.

**7. గ్రామపంచాయితీ సెక్రటరీ విధి**

గ్రామ పంచాయితీ శక్రటరీ తన గ్రామ పరిధిలో కనుగోన్న నిధి నిక్షేపాల గురించి పూర్తి వివరాలతో మండల రెవెన్యూ అధికారి వార్కి నివేదిక తక్షణమే పంపాలి.

# 31. ఆంధ్ర ప్రదేశ్ ప్రజారోగ్య చట్టం - 1939

**(ఆంధ్ర ఏరియా)**

(Act.No.III of 1939)

ప్రజలకు ఆరోగ్య రక్షణ కలిగించటానికి, హాయిగా, ఆరోగ్యంగా ప్రజలు నివసించడానికి ఈ చట్టం ప్రవేశ పెట్టబడింది. ఇందులో స్థానిక స్వపరిపాలనా సంస్థల పరిధిలో నివశిస్తున్న ప్రజల బాధ్యతలను, స్థానిక పరిపాలనా సంస్థల బాధ్యతలను, అధికారాలను పొందు పరచారు.

దీని ప్రకారం: – ప్రజారోగ్య బోర్డును ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నియమించారు. అందులో రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి, స్థానిక పరిపాలనా శాఖా మంత్రి, ముగ్గురు M.L.A. లు, రాష్ట్ర వైద్య సంచాలకులు, రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకుడు, చీఫ్ ఇంజనీరు (P.W.D. Reg) గాని సానిటరీ ఇంజనీరు గాని, డిప్యూటి చీఫ్ ఇంజనీరు గాని సభ్యులుగా వుంటారు. వీరికి అదనంగా ప్రభుత్వం ఒక ఉద్యోగిని సభ్యునిగా పేర్కొన వచ్చును. ఈ బోర్డుకు ప్రజారోగ్య శాఖ మంత్రి అధ్యక్షుడు గాను, ప్రజారోగ్య సంచాలకుడు కార్యదర్శిగాను వుంటారు. (Sec.4)

ఈ బోర్డు రాష్ట్ర ప్రభుత్వానికి సలహాలనిస్తుంది. స్థానిక సంస్థలలో ఆరోగ్యాధికారి వుంటారు ఇతను కార్య నిర్వాహకునిగా ప్రజారోగ్య రక్షణకు సంబంధించిన విషయాలు చూస్తారు. (Sec.16)

**ఈ ఆరోగ్యాధికారి చూసేవి, చేసేవి:**

1. త్రాగు నీటి సరఫరా (Sec.17 to 26)
2. డ్రైనేజి మురికి నీటి పారుదల (Sec.27 to 36)
3. సానిటరీ పారిశుద్ధత (Sec.37 to 40)
4. న్యూసెన్సు (కంగాళి ను నిరోధించుట (Sec.41 to 51)
5. అంటురోగముల గూర్చి ప్రకటించుట, అవి వ్యాపించకుండా తగు జాగ్రత్తలు తీసుకొనుట (Sec.52 to 77)
6. సుఖ రోగముల గూర్చి జాగ్రత్త తీసుకొనుట (Sec.78 to 80)
7. మాతా శిశు సంరక్షణ బాధ్యత (Sec.82)
8. దోమల నివారన (Sec.83 to 88)
9. నివాస స్థలములలో కీటకములు, పారిశుద్యము వగైరాల పర్యవేక్షణ (Sec.89 to 96)
10. అద్దె గృహాలు, రిజిస్ట్రేషన్ పర్యవేక్షణ, అనుమతి వగైరాలు (Sec.41 to 51)
11. ఆహార శుభ్రత గూర్చి పర్యవేక్షణ (Sec.108 to 115)
12. జాతరలు, పండుగల గూర్చి ప్రకటన, పర్యవేక్షణ (Sec.116 to 125)

చట్టం అదేశాలను అతిక్రమించినా, ఆచరించక పోయినా, వారు శిక్షార్హులు. అవుతారు. వారు నేరా రోపణకు గురికాబడి, జార్మానా కట్టవలసి వస్తుంది. (Sec.134C1) శిక్షింప బడిన తరువాత కూడా వారు అదే తప్పును చేస్తూ ఉంటే మరలా ప్రతిరోజుకు (నేరం జరుగతున్నంత కాలం) జర్మానా వేయబడుతుంది.

కార్య నిర్వహణ అధికారుల ప్రవేశాన్ని అనుమతించక పోవటం నేరం. అలాంటి తప్పుకు ఒక నెల సాధారణ శిక్షగాని, జార్మానా గాని వేయబడుతుంది. (Sec.135)

నేరారోపణ, ఆరోగ్య శాఖాధికారిగాని, పోలీసు గాని, స్థానిక పరిపాలనా సంస్థ ద్వారా అధికారం పొందిన వ్యక్తిగాని చేయవచ్చును. కాని ఈ నేరారోపణ జరిగిన నెల లోపునే చేయాలి. (Sec.138)

ఈ నేరాలు రాజీ పడవచ్చు (రూలు 8 నిబంధనలకు లోబడి) (Sec.138)

నేరం చేస్తున్నప్పుడు ఆ నేరస్తుల్ని పోలీసు (139) (140) అరెస్టు చేయవచ్చును.

ఈ చట్టం వర్తించు నేరాలు:

1. అనధికారంగా మురికి నీటిని నిల్వచేసే కుండీని అనుమతి లేని స్థలంలో కట్టుట.
2. మురికి కాల్వ సదుపాయం లేకుండా క్రొత్త ఇంటిలో నివాసముండుట.
3. వ్యర్థ పదార్థములు హాని కలిగించేవి మురికి కాల్వలోనికి విడిచి పెట్టుట.
4. మరుగు దొడ్లను సరిగ్గా నిర్వహించ కుండుట.
5. త్రాగు నీటిని కలుషిత పరుచుట.
6. మురికిని, చెత్తను, అశుద్ధాన్ని వీధిలోనికి వేయుట.
7. అంటువ్యాధి గురించి ఆరోగ్య శాఖకు తెలియ జెప్పకుండుట.
8. అశుద్దాన్ని మరగు పరచకుండుట.
9. అంటువ్యాధి ఉన్న వ్యక్తి ఆహార పదార్థముల వ్యాపారము చేయుట.
10. అంటురోగాల్ని కలిగించే బట్టలను లాండ్రీకి వేయుట లేక చెత్త కుండీలో వేయుట వగైరాలు.

## 32. వినియోగ దారుల రక్షణ చట్టము - 1986

వినియోగదారుడు పలు విధములుగా దోపిడికి గురి కాబడుతున్నాడు. అట్టి దోపిడిని అరికట్టి, వినియోగ దారునికి వున్న హక్కులను నిర్ధారించి, వాటికి రక్షణ కల్పించే ఉద్దేశ్యంతో ఈ చట్టం రూపకల్పన చేయబడింది.

వినియోగదారులకు ఉన్న హక్కులను తెలియజెప్పుతూ అట్టి, హక్కులను వినియోగదారినికి లభించక (అందక) పోయినట్లయితే వాటిని చట్ట ప్రకారం ఎలా సంక్రమింప చేసుకోవాలో, నష్టపోయిన వారికి పరిహారం ఏమిటో, వాటిని ఎలా సాధించు కోవాలో తమ హక్కుల పరిరక్షణ కోసం ఏ న్యాయ స్థానాన్ని (Forum) ఆశ్రయించాలో ఈ చట్టంలో పొందుపరిచారు.

ఈ చట్టం యొక్క ముఖ్య ఉద్దేశ్య ఖర్చు లేకుండా, సులభంగా, త్వరితంగా వినియోగ దారునికి

ఉపశమనం కలిగించటం, నష్ట పరిహారాన్ని అందజేయటం.

వినియోదారునికి సంబంధించి వర్తించే కొన్ని పదాలకు అర్థం, వివరణ (ఈ చట్టమునకు సంబంధించినంత వరకు) ఇవ్వటం జరిగింది.

1. సేవ అనగా వినియోగదారునికి కావలసిన అన్ని రకముల సదుపాయములు అందించడం, అనగా వినియోగదారుడు తనకు కావలసిన సేవకు మూల్యం చెల్లించినట్లైత, అతను అవతలి వ్యక్తి నుండి లేక సంస్థ నుండి తనకు సరియైన లోపం లేని సేవను పొందే హక్కు వుంది. ఈ సేవలు బ్యాంకింగ్‌లో కావచ్చు, ధన సహాయం కావచ్చు, జీవిత భీమా, ఇతర భీమాలు ఋణాలు కావచ్చు. ఆహారం, వసతి విషయాలు ఇండ్ల నిర్మాణం, వినోదం అందించడం, ఉల్లాసం కలిగించటం కావచ్చు, వార్తలను లేక యితర సమాచారాన్ని అందచేయుటం కావచ్చు.

అయితే ఈ సేవలు ఉచితంగా అందజేసినట్టివైనా, వ్యక్తిగత ఒప్పందం ప్రకారం అయినా అవి ఈ చట్ట పరిధిలోనికి రావు.

ఈ “సేవలు” అన్న పదానికి పై నిచ్చిన వివరణ చట్టపు ఉద్దేశ్యాన్ని తెలుపటానికి మాత్రమే సరియైన నిర్వచనం న్యాయస్థానం యిస్తుంది.

2. **సేవా లోపం:–** అనగా . ఒప్పందం ప్రకారం సేవచేయకపోవడం అసంపూర్తి సేవ, నాణ్యత లోపం, సేవ చేసే పద్ధతిలో లోపం, తప్పుగా చేయడం, చట్ట ప్రకారం లేక విధుల ప్రకారం చేయక పోవటం, పని లోపభూయిష్టంగా వుడటం, నాసిరకంగా ఉండటం వగైరాలు.

3. **సరుకు వస్తువు లోపం:** అనగా –కొన్న వస్తువు (సరుకు) కు వుండవలసిన నాణ్యత, పరిమాణము శక్తి, స్వచ్ఛత, ప్రమాణము లేకపోవుట, ఆ వస్తువులో యేమైనా తప్పు కలిగే రీతిగాని, చట్ట ప్రకారం ఉండవలసిన మోతాదులో లేక పోవటం, వ్యాపారస్థుడు హామీ యిచ్చినట్టుగాని, లేక ప్రకటించినట్లుగాని లేకపోవడం.

4. **వ్యాపారస్థుడు అనగా:** వస్తువు (సరకు) లను అమ్మే వ్యక్తి (సంస్థ) అమ్మకానికి ఇతరులకు వస్తువులను అందించే వ్యక్తి (సంస్థ) సరుకు, (వస్తువు) లను తయారు (ఉత్పత్తి) చేయువాడు, తయారైన వస్తువులను (సరుకులను) ప్యాకెట్లలో వుంచి అమ్మటం గాని, పంచటం గాని, చేసినప్పుడు అట్టి ప్యాకింగ్ చేసిన వ్యక్తి (సంస్థ) కూడా ఈ చట్ట ప్రకారం వ్యాపారస్థుడు అనబడుతాడు.

5. **అక్రమ వ్యాపార పద్ధతి:–** అనగా వ్యాపారాభివృద్ధి అమ్మకాలు పెంచడం కోసం లేక సరుకుల రవాణా, సరఫరా చేయడం కోసం సేవలు అందించటం కోసం అనుసరించే తప్పుడు పద్ధతి. ఈ క్రింది పేర్కొన్న సందర్భాలు, పనులు అక్రమ వ్యాపార పద్ధతి అంటారు.

1. నోటి మాటల ద్వారాగాని, ప్రకటనల ద్వారాగాని, వ్రాత మూలకంగా గాని, కనిపించే గుర్తులు, సంజ్ఞల ద్వారా గాని

(అ) అమ్మజూపుతున్న లేక సేవ లందిస్తున్నవి. ఒక ప్రత్యేకమైన ప్రమాణము, నాణ్యత, తరగతి,

మిశ్రమము, పద్దతి, పోలిక లేక పోయినా ఉన్నట్లు చెప్పడం.

(ఆ) పాత వస్తువులను బాగు చేసి లేదా తిరిగి నిర్మించి అవి క్రొత్త వస్తువులుగా నమ్మించడం.

(ఇ) అలా అమ్మజూపుతున్న సరుకులు, లేక సేవలు ఫలానా వారి అనుమతితో ప్రమాణము కలిగి వున్నాయని (లేకున్నా) అబద్ధపు ప్రచారం చేయడం.

(ఈ) ఆ సరుకులకు (సేవలను) లేని గుణాన్ని ఆపాదించటం, అట్టి సరుకుల వల్ల లాభం పొందుతారని మభ్య పెట్టడం.

(ఉ) ఏ పరిక్ష జరపకుండా అమ్మే వస్తువు (సరుకు) పనితనం గురించి నాణ్యత గురించి, మన్నన, కాల పరిణామము గురించి తప్పుడు ప్రచారం చేయడం.

(ఊ) అటాంటి వస్తువు (సరుకు) కు అబద్దపు హామీ ఇవ్వడం.

(ఋ) అమ్మబడే వస్తువు ఖరీదు (విలువ) గురించి ప్రజలను తప్పుదారి పట్టించడం.

(ౠ) వేరే వాళ్ళు అమ్మే వస్తువు (సరుకు) ల గూర్చి అబద్దపు దారి పట్టించేట్టు ప్రచారం చేయటం.

2. ప్రజలను మభ్య పెట్టటం లేక మోసగించుటకు వస్తువులను అతి చౌకగా అమ్మజూపుతున్నట్టు ప్రచారం చేయడం.

3. కొనుగోలు దారుడు కొంటున్న వస్తు సేవలను బహుమతి / పారితోషకము వగైరా ఉచితంగా ఇస్తున్నట్లుగా మభ్యపెడుతూ ఆ వస్తువు (సేవల) ఖరీదు అమ్మజూపుతున్న వస్తువు లేక సేవలపై ముందుగానే హెచ్చించడం, లేక లాటరీ గాని, పోటీ గాని వ్యాపారాభివృద్ధి కోసం నిర్వహించడం.

4. అమ్మజూపుతున్న సరుకు (వస్తువు) సేవల నాణ్యత ఉపయోగం, సరఫరా వగైరాలు నిర్దేశించిన రీతిన లేవని తెలిసీ వాటిని అమ్మ జూపటం.

5. అమ్మజూపుతన్న వస్తువు (సేవ) ల ధరలు అధికం చేయడం, లేక చీకటి బజారులో అమ్మ జూపడం గురించి సరుకులను నిల్వ ఉంచటం, లేక సరుకు ఉన్నా అమ్మటానికి, నిరాకరించటం, వగైరాలు, వినియోగదారునికి చట్టం ద్వారా సంక్రమించిన హక్కులు.

1. **భద్రత హక్కు:** ఆస్తికి, ప్రాణానికి, ముప్పు కలిగించే వస్తువు / సేవలను వ్యాపారానికి ఉంచకుండుట. దీనిని వినియోగ దారుడే జాగరూకతతో చూసుకోవాలి.

2. తాను కొనుక్కుంటున్న సరుకు/వస్తువు నాణ్యతముద్ర అంటే లేక గుర్తు కలిగి వుందా లేదా అన్న విషయాన్ని చూసుకోవాలి. అలాంటి గుర్తు (ముద్ర) లేకుంటే వ్యాపారస్థుని ఆ సరుకు నాణ్యత, పరిమాణం, శక్తి స్వచ్చత, వగైరాలను అడిగి తెలుసుకోవాలి. ఆ సమాచారాన్ని తెలుసుకొనే హక్కు వుంది.

3. తనకు నచ్చిన వస్తువు/సరుకు/సేవ యెంచుకునే హక్కు ఉంది. వినియోగదారుడు తన హక్కుకు భంగంకాని, నష్టం కాని వాటిల్లుతున్నప్పుడు వాటిని ఈ క్రింది విధంగా ఇబ్బంది నివారణ పొందవచ్చును.

భాధితుడైన వినియోగదారుడు తనను వంచించిన వ్యాపారస్థుని ఈ విషయం గూర్చి అడుగవచ్చు. అతని నుండి తనకు న్యాయం జరుగనప్పుడు వంచన జరిగిన స్థల పరిధికి సంబంధించిన వినియోగ దారుల సంఘానికి చెప్పవచ్చు. తరువాత వినియోగదారుడు స్వయంగా గాని, వినియోగదార్ల సంఘం ద్వారా గాని, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వం ద్వారా గాని వంచన జరిగిన పరిధికి సంబంధించిన జిల్లా వినియోగదార్ల న్యాయస్థానం లేక రాష్ట్ర లేక జాతీయ వినియోగదార్ల న్యాయ స్థానంలో ఫిర్యాదు చేయవచ్చును.

- దీనికి కోర్టు ఫీజు లేదు.
- ప్రత్యేక నమూనా(ఫిర్యాదు) లేదు.
- ఫిర్యాదు చేయనున్న వినియోగదారుడు చేయవలసిందల్లా వ్రాత పూర్వకంగా తనకు జరిగిన నష్టమును విపులంగా తెలియజెప్పాలి.
- ఫిర్యాదుదారుని పేరు, విలాసము వివరాలు వ్రాయాలి.
- తనకు జరిగిన నష్టమును (నేరమును) ధృవపరచేందుకు కావలసిన వివరాలు, పత్రాలు, లేక సరుకు తన ఫర్యాదుతో జత పరచాలి.
- ఎదుటి పార్టీ (ప్రతివారి) (వ్యాపారి) చిరునామా వివరాలు వ్రాయాలి.
- తాను (ఫిర్యాది) కోరుకుంటున్న పరిహారం
- ఫిర్యాదుపైన, ఫిర్యాదిగాని, లేక అతనిచే అధికారం పొందిన ప్రతినిధిగాని సంతకం చేయాలి.
- సరుకులలో లోపములను సవరించుట అంటే లోపములను సరిదిద్దించుట
- లోపభూయిష్టమైన సరుకును మంచి సరుకుతో మార్పిడి చేయించుట
- చెల్లించిన ఖరీదును వాపసు ఇప్పించుట
- జరిగిన నష్టమునకు నష్టపరిహారము పొందుట
- వినియోగదారుల న్యాయ స్థానం విచారం జరిపి పై పరిహారముల లో యుక్తమైన దానికి ఉత్తర్వు యిస్తుంది.
- వినియోగదారుల జిల్లాఫోరం తీర్పు (ఉత్తర్వు) తో వాదిగాని, ప్రతివారి గాని సంతృప్తి చెందనిచో తీర్పు ఇచ్చిన 30 దినములలో రాష్ట్ర కమీషనుకు, ఆ తీర్పుపై 30 దినములలో జాతీయ కమీషనుకు అప్పీలు చేసుకొనవచ్చును. ఇట్టి అప్పీళ్ళకు కోర్టు ఫీజు లేదు.

సరుకుల విలువగల సేవల విలువ గాని, నష్టపరిహారం గాని, లక్షరూపాయలు మించకుండా ఉంటే (అంటే లక్షరూపాయల వరకు) ఫిర్యాదుల్ని జిల్లా వినియోగదారుల న్యాయస్థానంలో వేయవచ్చును.

అలాంటి విలువలుగాని, నష్టపరిహారం గాని లక్షరూపాయలకు మించి 10 లక్షల రూపాయిలకు మించనిచో రాష్ట్ర వినియోగదారుల కమీషను ముందు వేయవచ్చును.

పది లక్షలకు మించినచో అట్టి ఫిర్యాదులను జాతీయ కమీషను ముందు వేయాలి.

# ౩౩. శాంతి భద్రతలు

గ్రామంలో శాంతి భద్రతలు కాపాడడంలో పోలీసు రెవెన్యూ అధికారులకు పూర్తి సహకారం అందించడం పంచాయతీ కార్యదర్శి ముఖ్య విధుల్లో ఒకటి.

1. గ్రామంలో ఏ విధమైన కుల, వర్గ, మత ఘర్షణలు జరిగినా లేక జరిగే సూచనలున్నా వెంటనే పోలీసు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించే బాధ్యత గ్రామ కార్యదర్శిది.

2. గ్రామంలో ఏ హత్యలు జరిగినా, ఆత్మహత్యలు జరిగినా అనుమానాస్పద మరణములు సంబవించినా ఆ సందర్భాలలో కూడ వెంటనే పోలీసు, రెవెన్యూ అధికారులకు తెలియచేయాలి. పోలీసువారు వచ్చి విచారణ ప్రారంభించి మృతదేహాన్ని స్వాధీనం చేసుకొనే వరకు దాన్ని గ్రామ సేవకుల సహాయంతో ఆ ప్రదేశం నుండి కదిలించకుండా జాగ్రత్తలు తేసుకొవాలి. కేసు విచారణలో, శవ పంచాయితీలో పోలీసు వారికి సహకరించాలి. నేరం జరిగిన స్థలాన్ని యధావిధంగా పరిరక్షించాలి.

3. గ్రామంలో ఏ రోడ్డు ప్రమాదం సంబంవించినా వేంటనే పోలీసు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలి. క్షతగాత్రులకు తక్షణ ప్రాథమిక వైద్య చికిత్స జరిగేలా చూడాలి. వెంటనే వారిని దగ్గరలోవున్న వైద్యశాలకు పంపించాలి. ప్రమాదం జరిపిన వాహన చోదకణ్ణి, అతని వాహనాన్ని ప్రమాద స్థలం నుండి పోలీసువారు వచ్చేలోగా తప్పించుకుపోకుండా నిరోధించాలి. వాహనంలోని ప్రమాణీకులకు తక్షణ సహాయంగా ఆహారం, నీరు అందేటట్లు చూడాలి.

4. గ్రామంలో ఏ అగ్ని ప్రమాదం సంభవించినా వెంటనే అగ్నిమాపక సిబ్బంధికి, రెవెన్యూ,పోలీసులకు సమాచారం అందించాలి. ఫైర్‌ఇంజన్లు వచ్చేలోగా గ్రామస్థుల సహకారంతో మంటలు ఆర్పడానికి కృషి చేయాలి. అగ్ని బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు అన్ని చర్యలు తీసుకొవాలి.

5. గ్రామంలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరించుచున్నా, ఆశ్రయం పొందుచున్నా, ఆవిధంగానే ఎవరైనా విదేశీ పౌరులు గడువుదాటిన తర్వాత గ్రామంలో నివసించుచున్నా, ఎవరి ఆశ్రయంమైనా పొందుచున్నా వెంటనే పోలీసు వారికి తెలియచేయాలి.

6. గ్రామంలో ఏదైనా దొంగసొత్తు దొరికిన సందర్భాల్లో సదరు సొత్తును జాగ్రత్తగా పోలీసు వారికి అప్పగించవలెను. అదేవిధంగా ఎవరూ హక్కుదారులు లేని ఆస్థిని కూడ పోలీసువారి స్వాధీనములో ఉంచవలేను.

7. గ్రామంలో అపరాధులెవరైనా ఉన్న సందర్భాలలో పోలీసు వారికి సమాచారము అందించి తగు చర్య తీసుకొనవలెను.

8 రైలు ప్రమాదాలు, విమాన ప్రమాదాలు గ్రామ పరిధిలో జరిగిన సందర్భాలలో వెంటనే రెవెన్యూ పోలీసు అధికారులకు తెలియచేయాలి. క్షతగాత్రులకు తక్షణ వైద్య సహాయము అందించవలెను.

9. మండల రెవెన్యూ అధికారి, మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌గా క్రిమినల్ ప్రొసిజర్ కోడ్‌లోని కొన్ని నిర్దిష్టమైన సెక్షన్ల క్రింద అనగా సెక్షన్లు 107, 129, 144, 145, 174 మరియు 176(3) వగైరాలు క్రింద శాంతి భద్రతల పరిరక్షణకు అధికారములను సంక్రమింపజేసినారు. ఈ విషయములో గ్రామ పంచాయతీ కార్యదర్శి, మండల రెవెన్యూ అధికారి గారికి తగు సహకారము అందించవలెను.

## 34. యఫ్.ఐ.ఆర్

(సెక్షన్ 154 సి.ఆర్.పి.సి)

ఏదైనా నేరము జరిగినప్పుడుగాని లేదా జరుగుతుందని అనుమానించినపుడు గాని ఎవరైనా వ్యక్తి పోలీసు అధికారికి ఫిర్యాదు రూపంలో గాని, ఆరోపణల రూపములో గాని తెలియచేసినచో, అట్టి సమాచారమును యఫ్.ఐ.ఆర్ (ఫస్ట్ ఇన్‌ఫర్‌మేషన్ రిపోర్టు) అంటారు. అది కేసుకు పునాది వంటిది.

- ✦ అట్టి సమాచారము వ్రాసి ఇచ్చినచో ఆ వ్యక్తి దానిపై సంతకము చేయవలెను.
- ✦ ఏ కారణము వల్లనైనా అట్టి ఫిర్యాదు నోటి మాటగా ఇచ్చినదైతే, సదరు పోలీసు అధికారి ఫిర్యాదు వ్రాసి, ఆ వ్యక్తికి చదివి వినిపించి అతనిచేత సంతకం చేయించవలెను.
- ✦ ఆ ఫిర్యాదు సారాంశాన్ని స్టేషన్ రోజువారి డైరీలో వ్రాయవలెను.
- ✦ భాధితులుగాని, బాధితుల తరపువారుగాని యఫ్.ఐ.ఆర్. దాఖలు చేయవచ్చును.
- ✦ నేరము యొక్క పూర్తి వివరములు, నిందితుని యొక్క వివరములు మరియు గుర్తులు, నేరము జరిగిన స్థలము, తేది, సమయము, సాక్షుల వివరములు, ఏ ఉద్దేశముతో నిందితుడు ఆ నేరమునకు పాల్పడినది, మొదలగు వివరములు యఫ్.ఐ.ఆర్. నందు పొందుపరచవలెను.
- ✦ ఫిర్యాదు దారుడు యఫ్.ఐ.ఆర్. కాపీ పొందు హక్కు కలిగి ఉండును.
- ✦ పోలీసు అధికారి యఫ్.ఐ.ఆర్. రికార్డు చేయుటకు నిరాకరించినచో ఆ విషయమును తెలియజేస్తూ ఫిర్యాదు దారుడు ఫిర్యాదును జిల్లా పోలీసు సూపరింటెండెంటు (యస్.పి) గారికి పోస్టు ద్వారా పంపవచ్చును.
- ✦ సంబంధిత మేజిస్ట్రేటు గారి కోర్టులో కూడా క్రిమినల్ ప్రొసిజర్‌కోడ్ లోని సెక్షను 200 క్రింద ఫిర్యాదు దాఖలు చేయవచ్చును.
- ✦ సదరు మేజిస్ట్రేట్ వారు సంబంధిత పోలీసు అధికారిని, అట్టి ఫిర్యాదును దర్యాప్తు చేయవలసితదిగా ఆదేశించవచ్చును.
- ✦ తప్పుడు ఫిర్యాదు ఇచ్చుట నేరము
- ✦ పోలీసు వారు అసత్యపు ఫిర్యాదు (యఫ్.ఐ.ఆర్) వ్రాయుట కూడా నేరము.

# 35. అరెస్టు - బెయిలు - హక్కులు

వ్యక్తిగత స్వేచ్ఛ భారత పౌరునికి రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కు. కావున వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడం నేరము. అలా భంగం కలిగించిన వారు శిక్షార్హులు.

ప్రభుత్వంగాని, పోలీసులుగాని తగిన కారణం లేకుండా ఏ భారత పౌరున్ని నిర్బంధించరాదు. అట్లు ఏ వ్యక్తి అయినా నిర్బంధానికి గురైతే అట్టి వారికి సంబంధించిన వారెవరైనా సుప్రీం కోర్టును గాని రాష్ట్ర హైకోర్టును గాని ఆశ్రయించి విడుదల కోరవచ్చు. (Article 32 and Article 226 of Constitution) తగిన కారణం పై ఏ వ్యక్తినైనా నిర్బంధించినచో అట్టి వ్యక్తిని, ఆయా అధికారులు, 24 గంటల్లో సంబంధిత న్యాయ స్థానము ముందు ఖచ్చితంగా హాజరు పరచవలెను. అట్లు హాజరు పరచనిచో అది అక్రమ నిర్బంధమగును. కావున అందుకు కారకులైన అధికారులు శిక్షార్హులు, అలా అక్రమ నిర్బంధానికి గురైన వారికి సంబంధించిన వారు, ప్రథమ శ్రేణి మేజిస్ట్రేట్ కోర్టునుగాని, జిల్లాకోర్టును గాని ఆశ్రయించి తగిన విడుదల ఆర్డరును గాని, అనువైన సందర్భాలలో సెర్చివారెంటుగాని పొందవచ్చును.

నిర్బంధించబడిన వ్యక్తికి, తనను ఎందుకు ఏ నేరంపై నిర్బంధిచినదీ తెలిసికొనే హక్కు కలదు. అలాగే నిర్బంధించిన అధికారి, అలా ఎందుకు నిర్బందించినదే తెలుపు బాధ్యత కలిగి ఉండును. (Sec.50.Cr.P.C.) నిర్బంధించిన అధికారి నిర్బంధంలో ఉన్న వ్యక్తిని ఎలాంటి హింసలకు గురి చేయరాదు, అలా చేస్తే అది నేరము కాబట్టి అట్టి అధికారి శిక్షార్హుడు.

నిర్బంధంలోకి తీసుకోబడిన ప్రతి వ్యక్తినీ నేరస్తుడిగా భావించరాదు. ఆ వ్యక్తి పై అభియోగం రుజువైనప్పుడే శిక్షార్హులవుతారు. తగిన విచారణ లేకుండా ఏ వ్యక్తినీ, శిక్షించరాదు, కావున విచారణ అయ్యేంతవరకూ స్వేచ్ఛగా ఉండటానికి బెయిల్ కోరవచ్చు. వారు న్యాయసహాయం పొందడానికి అర్హులు.

సాధారణంగా చిన్నతరాహానేరాలలో, కేసు విచారణ సమయంలో బెయిలుపై విడుదల అగుటకు వీలుండవచ్చు (Sec.49.Cr.P.C.). అయితే విచారణ సమయంలో న్యాయస్థానం ముందు ప్రతివాయిదా హాజరవుతానని న్యాయస్థానం అంగీకారం మేరకు జామీనుదారులతో సహా పూచీ కత్తు ఇవ్వవలసి ఉంటుంది. బెయిలు పొందిన ముద్దాయి పరారైనచో పూచీ ఉన్న జామీనుదారులు, పూచీ కత్తులో ఉదహరించిన సొమ్ము కోర్టుకు చెల్లించాల్సి ఉంటుంది.

తీవ్రమైన ప్రమాదకరమైన నేరాలలో నిర్బంధించబడిన వ్యక్తులు కూడా బెయిలుపొందే అర్హత కలిగి ఉంటారు. (Sec.437.Cr.P.C.) కాని అట్టి కేసులలో కేసుపై విచారణ జరిపిన మీదట కోర్టువారు బెయిలు ఇచ్చుటగాని నిరాకరించుటగాని చేయవచ్చు. నేరం మోపబడిన ముద్దాయి విచారణకు తప్పకుండ హాజరవుతాడని, సాధారణంగా న్యాయస్థానం పరిధి నుండి పారిపోయే అవకాశం లేదనీ, సాక్షులను తారుమారు చేయరని భావించినప్పుడు మాత్రమే అతనిని బెయిలు పై విడుదల చేస్తారు.

ఏ పౌరుడైనా అన్యాయంగా గాని, అకారణంగా గాని తనను నిర్బంధంలోని తీసుకోబోతున్నారని గ్రహించినపుడు, అతడు అమాయకుడైతే సెషన్స్ కోర్టునుగాని హైకోర్టును గాని ఆశ్రయించి ముందస్తు

బెయిలు పొందడానికి అవకాశమున్నది. (Sec.438.Cr.P.C.)

గౌరవ సుప్రీంకోర్టువారు ఒక తీర్పులో చెప్పిన క్రింద విషయములు, పోలీసు వారు ఒక వ్యక్తిని అరెస్టు చేసినప్పుడు, తప్పక పాటించవలసియున్నది.

1. అరెస్టు కాబడిన వ్యక్తి కోరినచో అతని/ఆమెయొక్క స్నేహితునికి గాని, బంధువులకు గాని, పరిచయస్తునికి లేదా వారి హితులకు గాని ఆ వ్యక్తిని అరస్టు చేసినట్లు మరియు ఎక్కడ నిర్బంధములో ఉంచుచున్నదీ పోలీసు వారు తెలుపవలెను.

2. పోలీసు వారు, అరస్టు చేసిన వ్యక్తి పై గల హక్కును వారు ఆ వ్యక్తికి తెలుపవలెను.

3. అట్టి అరెస్టు గురించి ఎవరికి తెలిపినదీ, పోలీసు వారు స్టేషను డైరీలో వ్రాయవలెను.

## 35. మానవ హక్కుల పరిరక్షణ చట్టము 1993

జాతీయస్థాయిలో మానవ హక్కుల సంఘము, రాష్ట్రాలలో రాష్ట్ర స్థాయి మానవహక్కుల సంఘాలు మరియు సమర్థవంతంగా మానవహక్కులను పరిరక్షించుటకు గాని మానవహక్కుల కోర్టులను స్థాపించుటకు ఉద్ధేశించబడిన చట్టమే మానవ హక్కుల పరిరక్షణ చట్టము.

సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి గారి అధ్యక్షతన మరి కొందరు మేధావులు సభ్యులు గా స్థాపించబడిన జాతీయ మానవ హక్కుల సంఘం డిల్లీలో ఉన్నది.

రాష్ట్ర స్థాయి మానవ హక్కుల సంఘాలు హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తుల అధ్యక్షతన స్థాపించవలసినదిగా ఈ చట్టము నిర్దేశిస్తోంది.

భారత రాజ్యాంగములో కల్పించిన జీవించుట, స్వేచ్ఛ సమానత్వము మరియు వ్యక్తి గత హోదాలకు సంబంధించిన హక్కులను మానవ హక్కులుగా సదరు చట్టము నిర్వచించుచున్నది.

సదరు చట్టము నిర్దేశించిన విధులలో కొన్నింటిని పరిశీలిద్దాం.

1. మానవ హక్కుల ఉల్లంఘన లేదా అట్టి ఉల్లంఘనకు ప్రేరేపించుట లేదా మానవ హక్కుల ఉల్లంఘనను నిరోధించుటలో సదరు అధికారులు నిర్లక్ష్యం చేయుటపై బాధితులు గాని వారి తరపు వారు గాని ఫిర్యాదు చేసినప్పుడు లేదా జాతాయ కమీషను తనంతట తానుగా విచారణ జరపవచ్చును.

2. మానవ హక్కుల ఉల్లంఘనకు చెందిన ఆరోపణలకు సంబంధించి కోర్టులందు పెండింగు ఉన్న విచారణలలో సదరు కోర్టు వారి అనుమతితో కమిషనువారు జోక్యం చేసుకోవచ్చును.

3. సంబంధింత రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసిన పిదప జైలును గాని లేదా ఇతర నిర్బంధములో ఉంచిన సంస్థలను గాని, సందర్శించి అచ్చటి నివాస పరిస్థితులను అధ్యయనం చేసి తగు సిఫారసులు చేయవచ్చును.

4. మానవ హక్కుల కొరకు భారత రాజ్యాంగము ఇతర చట్టములు కల్పించిన రక్షణలను సదరు సంఘము

వారు సమీక్షించి వాటిని కట్టు దిట్టంగా అమలు చేయుటకు కావలసిన చర్యలను సిఫారసు చేయవచ్చును.

5. మానవ హక్కులను అను భవించుటలో ఆటంకం కలిగించు టెర్రరిజం వంటి అంశాలను సమీక్షించి వాటి నిరోధానికి అవసరమైన చర్యలను సిఫారసు చేయవచ్చును.

మానవ హక్కులకు సంబంధించిన ఫిర్యాదులను విచారించునపుడు సదరు కమీషనుకు సివిలు కోర్టుకున్న అధికారములు ఉండును.

మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన కేసులను త్వరగా పరిష్కరించుటకు గాను మానవ హక్కుల కోర్టులను మన రాష్ట్రంలో జిల్లా కేంద్రాలలో నెలకొల్పినారు.

మానవ హక్కుల ఉల్లంఘన జరిగిన రోజు నుండి ఒక సంవత్సరం లోపల ఫిర్యాదు చేయవలెను. సంవత్సరకాలం ముగిసినచో సదరు సంఘమువారు విచారణకు స్వీకరించక పోవచ్చును.

## 37. మనోవర్తి

ఎవరైనా స్త్రీ, భర్త నిర్లక్ష్యానికో, నిరాదరణకో గురైతే ఆమె పోషణార్థం నెలనెలా భర్త చెల్లించే మొత్తాన్ని సాధారణంగా మనోవర్తి లేదా భరణము అని, ఆంగ్లములో మెయింటెనెన్స్ అని అంటారు. భరణం పొందడానికి భార్య మాత్రమే కాదు. బిడ్డలు, తల్లిదండ్రులు కూడా అర్హులే.

భరణము కొరకు, సివిలు కోర్టులో కేసు వేయుటకు కూడా అవకాశమున్నది. కాని భరణము కేసులను సకాలంలోను, వెంటనే పరిష్కరించడానికి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షను 125 ఉద్దేశించబడినది. ఈ సెక్షను ప్రకారం భర్తల నిరాదరణకు గురైన భార్యలు – భర్తల నుండి, అనాథలు, నిస్సహాయులు, అయిన బిడ్డలు తండ్రి నుండి, దిక్కులేని తల్లిదండ్రులు – కొడుకు లేదా కూతురు నుండి అవసరమైన ఆర్థిక సహాయాన్ని పొందేందుకు చట్టపరిధిలో అవకాశం కల్పించబడినది.

ఏ వ్యక్తి అయినా తగినంత రాబడి ఉండి భార్యనుగాని, బిడ్డలను గాని, తల్లిదండ్రులను గాని పోషించడానికి నిరాకరించినా లేదా నిర్లక్ష్యం చేసినా ఆ వ్యక్తి నుండి వారు భరణం పొందవచ్చును.

**భరణపు మొత్తము:**కోర్టువారు సంబంధిత విషయాలన్నింటినీ పరిశీలించి అవతలి వ్యక్తి యొక్క ఆస్తులు, ఆదాయము, ఇవతలి వ్యక్తి లేదా వ్యక్తుల యొక్క వయసు మొదలగు విషయాలను పరిగణనలోకి తీసుకొని భరణపు మొత్తాన్ని నిర్ణయిస్తారు. అయితే అలా నిర్ణయించిన భరణము, సెక్షను 125 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారము నెలకు ఒక వ్యక్తికి రూ.500/- మించదు. ఇరుపక్షాల వారి ఆదాయ వ్యయాలు, బాధ్యతలు మొదలైన ఎన్నో అంశాలు కోర్టువారు పరిగణనలోకి తీసుకుంటారు.

భరణం మంజూరైన తరువాత, పరిస్థితులలో మార్పు వచ్చిన యెడల ఇరుపక్షాలలో ఎవరైనా ఋజువులతో కోర్టువారికి ధృవపరచగలిగితే మొదట మంజూరు చేసిన మొత్తాన్ని కోర్టువారు మార్చడానికి అవకాశమున్నది. తాత్కాలిక భరణాన్ని కూడా కోర్టువారు మంజూరు చేయవచ్చు.

**భరణము ఉత్తర్వులు అమలు పరచు అధికారము:**

భరణము మంజూరు చేసినది ఏ ప్రాంతపు కోర్టువారయినా భరణము చెల్లించవలసి యున్న ప్రాంతపు మెజిస్ట్రేటు వారు ఇరుపక్షాలను గుర్తించిన పిదప భరణము మంజూరు ఉత్తర్వులను అమలుపరచు అధికారము కలిగి ఉందురు.

**అర్హతలు:**

1. భర్త పోషించిన భార్య తనను తను పోషించుకోలేనపుడు భరణము పొందడానికి అర్హురాలు. సివిల్ కోర్టువారు విడాకులు మంజూరు చేసినప్పటికీ ఆ భార్య తన భర్త నుండి భరణము పొందే హక్కు కలిగి ఉంటుంది. భర్త మరో స్త్రీ ని వివాహమాడినా, మరో స్త్రీ తో అక్రమ సంబంధం కలిగి ఉన్నా అతని నుండి భరణము కోరడానికి అర్హురాలు.
2. సంతానం న్యాయబద్ధమైనదైనా, కాకపోయినా, వారు వివాహితులైనా కాకపోయినా, తమని తాము పోషించుకోలేని యుక్తవయసురాని బిడ్డలు, తమ తండ్రి నుండి భరణము పొందడానికి అర్హులు.
3. యుక్త వయస్సు వచ్చున బిడ్డలు కూడా శారీరక లేదా మానసిక అస్వస్తతల కారణంగా తమను తాము పోషించుకోలేని వారు న్యాయబద్దమైన సంతానమైనా కాకపోయినా తండ్రి నుండి భరణం పొందడానికి అర్హులు. అయితే వివాహమైన కూతురు ఇందుకు అర్హురాలు కాదు.
4. యుక్తవయసు రాని కూతురుకి వివాహమైనాగాని, ఆమె భర్తకు తగినంత ఆదాయం లేదని ఋజువైన సందర్భంలో ఆమెకు యుక్తవయస్సు వచ్చువరకు తండ్రి నుండి భరణము పొందుటకు అవకాశమున్నది.
5. తనను తాను పోషించుకోలేని తల్లి లేదా తండ్రి కూడా కొడుకు నుండి భరణం పొందవచ్చు.
6. కూతురికి తగినంత ఆదాయం ఉన్న ఎడల ఆమె వివాహిత అయినా కాకపోయినా ఆమె నుండి భరణము కోరుటకు తనను తాను పోషించుకోలేని తల్లి లేదా తండ్రి అర్హులు.

**భరణము కోరుతూ ఎక్కడ కేసు వేయ్యాలి?:**

భరణము ఎవరినుండి కోరుతున్నారో ఆవ్యక్తి నివస్తున్న ప్రాంతంలో గాని,

భరణము ఎవరైతే కోరుతున్నారో వారు నివసిస్తున్న ప్రాంతంలో గాని

ఇరు వర్గాలవారు చివరిసారిగా ఎక్కడైతే నివాసముండినారో ఆ ప్రాంతంలోగాని, మొదటి తరగతి మెజిస్ట్రేటువారి కోర్టులో భరణం కోరుతూ దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది.

అయితే, తల్లిగాని తండ్రిగాని, తల్లిదండ్రులిరువురుగాని కొడుకు నుండి భరణము కోరుతున్నపుడు తాము నివసిస్తున్న ప్రాంతంలో కాకుండా తమ కొడుకు నివసిస్తున్న ప్రాంతంలో కేసు వేయవలసి ఉంటుంది.

**న్యాయ సహాయం:** భరణము కోరుతున్న వారు కేసు వేయుటకు తగిన ఆర్థిక స్తోమత లేనివారైతే వారు, సంబంధిత జిల్లా న్యాయసేవా అధికార సంస్థ జిల్లా కోర్టు భవనములు వారికి దరఖాస్తు చేసుకుంటే అట్టివారికి, నిబంధనలమేరకు తగు న్యాయ సహాయం అందించబడుతుంది.

స్త్రీలు, పిల్లలు, ఎటువంటి ఆదాయ పరిమితులు లేకుండా న్యాయ సహాయం పొందడానికి అర్హత కలిగి ఉన్నారు.

# 38. లోక్ అదాలత్

## (ప్రజా న్యాయపీఠము)

**(చాప్టరు IV సెక్షన్లు 19 నుండి 22 వరకు)**

లోక్ అదాలత్ అనగా ప్రజాన్యాయ పీఠము. అధికార, అనధికార ప్రముఖులతో కూడిన కమిటీలు సదరు కేసులలో ఇరుపక్షాలవారిని విచారించి, కేసుల యొక్క పూర్వపరాలు, రికార్డులు పరిశీలించి సహృద్భావ వాతావరణంలో చర్చించి ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని లేదా ఒప్పందాన్ని కుదిర్చి ఆ మేరకు తీర్పు ఇచ్చుట లోక్ అదాలత్ యొక్క ముఖ్య ఉద్దేశ్యము.

లోక్ అదాలత్ వారు ఇచ్చన తీర్పు సివిలు కోర్టు తీర్పుతో సమానముగా పరిగణించబడును. సదరు అవార్డు పై ఏ విధమైన అప్పీలుకు అవకాశముండదు లోక్ అదాలత్ వారి తీర్పు అంతిమ తీర్పుగా పరిగణించబడుతుంది. కేసుకు సంబంధించిన ఇరు పక్షాల వారు సదరు లోక్ అదాలత్ యొక్క తీర్పుకు కట్టుబడి ఉండాలి. (Sec.21)

కోర్టు వరకు కేసు వెళ్ళని పక్షములో సదరు పార్టీల వారు తమ యొక్క తగాదాను పరిష్కరించవలసినదిగా సంబంధిత తాలుకా / మండల న్యాయ సేవా అధికార సంస్థను గాని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థనుగాని, లేదా రాష్ట్ర హైకోర్టు నందు గల రాష్ట్రన్యాయ సేవా అధికార సంస్థను కోరవచ్చును (Sec.20(2))

కోర్టులందు పెండింగులో ఉన్న కేసులలో ఇరుపక్షాలు, తమ కేసును లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించమని కోరినప్పుడు గాని, లేదా ఏ ఒక్క పార్టీ కోరినప్పుడుగాని, లేదా సదరు కేసు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించదగినదని అయా కోర్టులు భావించనపుడు, సదరు కేసులను సంబంధిత లోక్ అదాలత్‌లకు ఆయా కోర్టులు పంపవచ్చును (Sec.20(1))

చట్టరీత్యా రాజీపరిష్కారానికి వీలుగాని కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించబడును.

ఉపయోగములు:

1. తక్కువ వ్యవధిలో, ఖర్చు లేకుండా సుహృద్భావ వాతావరణంలో పరిష్కరించుట.
2. లోక్ అదాలత్ తీర్పును అప్పీలు లేని అంతిమ తీర్పుగా పరిగణించుట.
3. లోక్ అదాలత్‌లలో కేసు వేయుటకు ఎటువంటి ఫీజులు చెల్లించనవసరంం లేదు.
4. కోర్టులందు దాఖలు చేసిన కేసులు లోక్ అదాలత్‌లలో పరిష్కరించబడినచో, కోర్టు ఫీజు వాపసు చేయబడును.

## 39. ఉచిత న్యాయ సహాయము

న్యాయం దృష్టిలో అందరూ సమానులే. న్యాయానికి గొప్ప-బీద అన్న తేడా లేదు. అందరికీ సమానావకాశాలు కల్పించడానికి ముఖ్యంగా ఏ పౌరుడూ ఆర్థిక కారణాల మూలంగా గాని వేరే ఇతర బలహీనతల మూలంగా గాని న్యాయాన్ని పొందే అవకాశాలను కోల్పోకుండా ఉండడం కోసం ఉచిత న్యాయ సహాయం అందించాలని ప్రభుత్వం భావించింది. బీద, బలహీన వర్గాల వారికి న్యాయ విధానం అందుబాటులోకి తేవడం కోసం, వారికి సామాజిక ఆర్థిక న్యాయాలు కల్పించడం కోసం ఉచిత న్యాయ సహాయాన్ని అందించాలని నిశ్చయించినారు. ఫలితంగా 1976వ సంవత్సరంలో భారత రాజ్యాంగానికి అధికరణ 39(ఎ) జత చేసి బీద, బలహీన వర్గాల వారికి ఉచిత న్యాయ సహాయాన్ని అందించడం రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతగా నిర్దేశించినారు. అంతే కాకుండా ఇందుకోసము వేరొక చట్టాన్ని రూపొందించినారు. అదే న్యాయ సేవల అధికారిక చట్టము, ఇది కేంద్ర చట్టము. ఈ చట్టము నిర్దేశించినట్టు మన రాష్ట్ర ప్రభుత్వము, రాష్ట్ర హైకోర్టు ఉమ్మడిగా చర్చించి కొన్ని సూత్రాలను, నిర్ధేశకాలను రూపొందించినారు.

**అర్హులు:**

ఈ చట్టము, దాని అనుబంధ సూత్రాల ప్రకారము దిగువ కనబరచిన వారు ఉచితంగా న్యాయ సహాయం పొందడానికి అర్హులుగా నిర్ణయించినారు.

అ. షెడ్యూల్డ్ కులము లేక తెగకు చెందినవారు.

ఆ. యాచకులు

ఇ. స్త్రీలు, పిల్లలు,

ఈ. మతి స్తిమితంలేని వారు, అవిటివారు

ఉ. సామూహిక విపత్తు, హింసాకాండ, కుల వైషమ్యాలు, అతివృష్టి, అనావృష్టి, భూకంపాలు, పారిశ్రామిక విపత్తులు వంటి విపత్తులలో చిక్కుకున్నవారు.

ఊ. పారిశ్రామిక కార్మికులు.

ఋ. ఇమ్మోరల్ ట్రాఫిక్ (ప్రివిన్షన్) చట్టము 1956 సెక్షన్ 2(జి) లో తెలిపిన నిర్బంధము, సంరక్షణ నిర్బంధములో సహా, లేక బాల నేరస్తుల న్యాయ చట్టము 1986 సెక్షన్ (జె) లో తెలిసిన నిర్బందము లేక మెంటల్ హెల్త్ చట్టము 1987 సెక్షన్ 2(జి) లో తెలిపిన మానసిక చికిత్సాలయములో నిర్బందము లో ఉన్న వ్యక్తులు

**మరియు**

ౠ. వార్షిక ఆదాయం రూ. 25,000/- (ఇరవై ఐదు వేలు) కు మించిన వ్యక్తులు కూడా ఉచిత న్యాయ సహాయం పొందడానికి అర్హత కలిగి ఉన్నారు.

అర్హతగల వాది, ప్రతివాదులు కూడా న్యాయ సహాయం పొందవచ్చు.

**న్యాయ సహాయ విధానాలు:**

1. న్యాయవాదిచే ఉచితముగా న్యాయ సలహా ఇప్పించుట.
2. కేసులను పరిశీలించిన మీదట అవసరమైనచో దరఖాస్తుదారుని తరపున న్యాయవాదులను నియమించి ఆయా కోర్టులలో కేసులు చేపట్టుట.
3. న్యాయసహాయం పొందినవారికి కోర్టు ఫీజు, కేసుకు సంబంధించిన కోర్టు ఖర్చులు భరించుట.
4. న్యాయ సహాయం పొందిన వారికి ఆయా కేసుల్లో జడ్జిమెంటుల నకళ్ళు ఉచితముగా ఇచ్చుట మొదలగు సహాయాలు అందించబడతాయి.

**దరఖాస్తు చేయు పద్ధతి:**

న్యాయ సహాయం కోరువారు తమ కేసు యొక్క పూర్వపరాలు, కావలసిన పరిష్కారము (రిలీఫ్) వివరిస్తూ అఫిడవిట్‌ను సంబంధిత డాక్యుమింటులను జత చేస్తూ దరఖాస్తు చేసుకొనవలసి ఉంటుంది. దరఖాస్తుదారులు పైన తెలిపిన అర్హతలలో ఏవి కలిగి ఉన్నదీ తెలియపరుస్తూ తగిన ఆధారాలను (వీలైనంత మేరకు) పంపిన ఎడల నిబంధనల మేరకు తగు చర్య తీసుకొనబడును.

**దరఖాస్తు చేయవలసిన చిరునామా:**

ఉచిత న్యాయ సహాయము కోరువారు తమతమ జిల్లాలకు చెందిన జిల్లా న్యాయ సేవా అధికార సంస్థలకు గాని, రాష్ట్ర హైకోర్టునందు గల రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థకు గాని తమ యొక్క కేసుల వివరములను తెలుపుతూ దరఖాస్తు చేసుకొనవచ్చును.

1. సెక్రటరీ, తాలుకా / మండల న్యాయ సేవా అధికార సంస్థ కోర్టు ఆవరణ
2. సెక్రటరీ, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ జిల్లా కోర్టు భవనములు
3. మెంబర్ సెక్రటరీ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ హైకోర్టు భవనములు, హైదరాబాద్ – 500 066.

**మరియు**

ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో గల కేసుల యందు న్యాయ సహాయం కోరువారు ఈ క్రింది చిరునామా దరఖాస్తు చేసుకొనవచ్చును.

4. సెక్రటరీ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయసేవా అధికార సంస్థ హైకోర్టు భవనములు హైదరాబాద్ – 500 066.

# న్యాయ విజ్ఞాన వేదికలు

ఆమూలాగ్రంగా చదవలేని, చదివినా పూర్తిగ అవగాహన కాని న్యాయ శాస్త్ర సంబంధింత ప్రజోపయోగ చట్టాలలోని ముఖ్యాంశాలను, న్యాయ కోవిదులు స్వయంగా తెలియచెప్పుటకు మీ గ్రామంలో, మీ వాకిట్లోనే న్యాయ విజ్ఞాన సభలు ఉచితముగా ఏర్పాటు చేయబడుతున్నాయి.

న్యాయశాస్త్ర పరమైన అనేక సమస్యలపై ఉచిత సలహాలు మీ ముంగిటనే న్యాయ కోవిదుల ద్వారా స్వయంగా పొందండి.

ఊరూరా రాష్ట్ర న్యాయ వ్యవస్థ నిర్వహించే న్యాయ విజ్ఞాన సభలలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు లేదా న్యాయ కోవిదులుగాని స్వయంగా మీతో ముచ్చటించి, సంప్రదించి, తగు సలహాలందించి చిరకాలంగా నిలిచిపోయిన మీ కేసులలో సత్వర పరిష్కారం అందించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొండి.

**న్యాయ సహాయ న్యాయవాదులు**

మన రాష్ట్రంలోని అన్ని మెజిస్ట్రేటు కోర్టుల యందు న్యాయసహాయ న్యాయ వాదులను నియమించడమైనది. సదురు న్యాయ సహాయ న్యాయవాదులు పేర్లకు సంబంధిత కోర్టుల యందు ప్రదర్శించియున్నారు. నిర్బంధముగా కస్టడీ లో ఉన్న వ్యక్తులు లేదా వారి తరపువారు సదరు న్యాయసహాయ న్యాయవాది గారి ద్వారా న్యాయ సహాయాన్ని ఉచితముగా పొందవచ్చును.

అట్టి న్యాయవాదుల విధులు

1. కస్టడీలో ఉన్న వ్యక్తులకు న్యాయ సలహా, సహాయములు అందించుట.
2. రిమాండు ధరఖాస్తులను వ్యతిరేకించుట
3. బెయిలు ధరఖాస్తులు దాఖలు చేసి వాదించుట
4. ఇతర సంబంధిత దరఖాస్తులు దాఖలు చేయుట

సదరు న్యాయ సహాయ న్యాయవాది యొక్క సహాయం కావలసినవారు సంబంధిత మెజిస్ట్రేటుగారికి కోరితే అట్టి మేజిస్ట్రేటుగారు న్యాయ సహాయ న్యాయవాదిని నియమిస్తారు. కస్టడీలోని వ్యక్తులుగాని వారి తరపు వారు గాని సదరు న్యాయ సహాయ న్యాయవాదికి ఎలాంటి రుసుము చెల్లించనక్కరలేదు.

మరిన్ని వివరాలకు మీ దగ్గరిలో ఉన్న మెజిస్ట్రేటు వారి కోర్టునుగాని, మండల న్యాయసేవా సంఘాన్ని గాని జిల్లా కోర్టులో గల జిల్లా న్యాయసేవా అధికార సంస్థను గాని సంప్రదించండి.

# ౪౦. ఫ్యామిలీ కోర్టులు

## కుటుంబ న్యాయస్థానాల చట్టం 1984

(Act No.8.)

కుటుంబ సంబంధమైన తగాదాలను పరిష్కరించి వారి మధ్య రాజీ కుదుర్చుటకు, వివాహ పరమైన తగాదాలను పరిష్కరించుటకు ఫ్యామిలీ కోర్టుల చట్టము ప్రవేశపెట్టబడినది. లా కమీషన్ యొక్క రిపోర్టు ఆధారంగా రూపొందించబడిన ఈ చట్టం త్వరితముగా తగాదాను పరిష్కరించుటకు దోహద పడుతుంది. లాయరును నియమించుకోనవసరం లేకుండా ఎవరి కేసును వారే వాదించుకొనుటకు గాను ఈ చట్టం వీలు కల్పిస్తోంది.

**చట్టపు ముఖ్యోద్దేశాలు:** రాజీ మార్గంగా కుటుంబ తగాదాలు పరిష్కరించుట, త్వరితంగా న్యాయాన్ని అందించుట

**కుటుంబ న్యాయస్థానం పరిధిలోనికి వచ్చే తగాదాలు:**

వివాహ సంబంధింత తగాదాలు అంటే వివాహనిబద్దత, విడాకులు, దాంపత్య హక్కులు, మనోవర్తి, పిల్లల సంరక్షణ బాధ్యత, భార్యా భర్తల ఆస్తి వివాదాలు, సంతాన న్యాయ సమ్మతి (వారసత్వం) నిర్ధారణ చిన్న (ఆయుక్త) పిల్లల సంరక్షణ వగైరాలు. ఇవి కాక ప్రత్యేక చట్టం ద్వారా దాఖలు చేయబడిన తగాదాలు (అంశాలు).

కుటుంబ న్యాయ స్థానం ఒక పరిధిలో స్థాపిస్తే పైన చెప్పిన తగాదాలు ఆన్యాయస్థానంలోనే పరిష్కరించుకోవాలి, వేరే ఇతరమైన న్యాయస్థానాలు (సివిలు, క్రిమినలు న్యాయ స్థానాలు) పైన చెప్పిన తగాదాలను పరిష్కరించకూడదు (జాలవు).

కుటుంబ న్యాయ స్థాన వ్యవహారాలు, న్యాయ స్థానం కాని, వాది, ప్రతివాదులు గాని, కావలనుకుంటే రహస్యంగా నడప వచ్చు.

పార్టీలకు వాది, ప్రతి వాదులు న్యాయ వాదిని నియమించుకొనే హక్కు లేదు. కాని న్యాయ స్థానం అలాంటి అవసరం ఉందని భావిస్తే నిస్వార్థంగా కోర్టుకు సలహానిచ్చే వ్యక్తిని (Amiecus Curiae) నియమించవచ్చు.

కుటుంబ న్యాయస్థానం, నివేదికను (Report) (Information) వాంగ్మూలాన్ని దస్తావేజు (Document) సమాచారం (Statement) ఉంటే అది తగాదాలు పరిష్కారానికి సహాయకారిణి అనుకుంటే సాక్ష్యాలుగా తీసుకోవచ్చు. సాక్ష్యం చట్ట బద్ధత ఈ న్యాయ స్థానానికి అక్షరాలా అన్వయించ నక్కరలేదు.

కుటుంబన్యాయస్థానపు తీర్పు (Judgment) పైన హైకోర్టుకు ఉన్నత న్యాయ స్థానానికి అప్పీలు పునర్విచారణ, పునః నిర్ణయం కొరకు దాఖలు చేయవచ్చు.

కాని కుటుంబ న్యాయ స్థానపు తీర్పుకు పునరీక్షణ (Revision) లేదు. (Sec. 19 (3)) భార్య భర్తల మధ్య వివాహ పరమైన మరియు ఆస్తి తగాదాలు, భరణములకు సంబంధించిన విషయములు, పిల్లలు సంరక్షణకు సంబంధించిన విషయములు మొదలగునవి ఈ ఫ్యామిలీ కోర్టులలో చేపట్టబడతాయి.

ఈ ఫ్యామిలీ కోర్టులలో పై విషయాల్లో దావాలు వేసుకోదలచిన మహిళలు, పిల్లలు, మరియు అర్హులైన పురుషులు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ నుండి న్యాయ సహాయం పొందవచ్చును.